తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

21-6-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 141 పేజీలు: 8+16 వెల: 8.00


నేడు ప్రపంచమంతా

# 'యోగ ముద్ర'


కోల్‌కతాలో ప్రధాని మోడీ, రాష్ట్రాల్లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు



## 190 దేశాల్లో 'యోగా డే'

శనివారం పెరేడ్ గ్రౌండ్స్ యోగా సాధనలో గవర్నర్ శుక్లా, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి - 2లో

**న్యూఢిల్లీ, జూన్ 20:** ప్రపంచదేశాల్లో ఇప్పటికే అమలుచేస్తున్న అంతర్జాతీయ యోగాడేను ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహిం చేందుకు కేంద్రం సన్నాహాలుచేస్తోంది. కామన్ యోగాప్రోటోకాల్ ఆధారంగా దేశవ్యా ప్తంగా ఒకే సమయంలో యోగాను నిర్వహి స్తారు. యోగా సంగం పోర్టల్ ఏర్పాటుచేసిన కేంద్రం యోగాడేలో పాల్గొనే వ్యక్తులు సంస్థలుప్రము ఖలు, అన్నివర్గాల ప్రజలు ఈ పోర్టల్‌లో నమోదుచేసుకోవాలని విజ్ఞప్తిచేసింది. 21వ తేదీ అంటే ఆదివారం ప్రధానిమోడీ కోల్‌కత్తాలో యోగాడేలో పాల్గొని యోగాసనాలు ఇతర అభ్యా సకులతో కలిసి ఆచరిస్తారు. అలాగే రాష్ట్రాల ముఖ్యమం త్రులు, గవర్నర్లు, బిజెపి పాలితరాష్ట్రాల్లో పార్టీ కేడర్, ఎమ్మెల్యేలు,ఎంపిలు మొత్తంఈ యోగాడేలో >>2



# హార్ముజ్ మళ్లీ క్లోజ్

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు

ఒప్పంద ఉల్లంఘనతో జలసంధిని మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటన

**టెహ్రాన్,జూన్ 20:** దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులను అమెరికాతో కుదిరిన ఒప్పందానికి విరుద్ధంగా జరిగిన చర్యలుగా పేర్కొంటూ, కీలకమైన హార్ముజ్ జలసంధిలో మరోసారి నౌకా రాకపోకలకు మూసివేస్తున్నట్లు ఇరాన్ కేంద్ర సైనిక కమాండ్ శనివారం ప్రకటించింది.ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసిన ప్రకటనలో సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ ఖాతమ్ అల్ అన్‌బియా మాట్లాడుతూ, హార్ముజ్ జలసంధి >>2

22, 23న ఢిల్లీలో ఉంటా..

రండి.. అశ్విని వైష్ణవ్‌ను

# కలుద్దాం



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సిఎం రేవంత్ మరో బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్20:** హైదరాబాద్ మెట్రో రైల్ పెండింగ్ అంశాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సాయంత్రం మరో బహిరంగ లేఖ రాశారు. మెట్రో ఫేజ్2, ఐఆర్ ఎఫ్‌సీ ఫైనాన్సింగ్‌కు సంబంధించిన అంశాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి >>2

నీట్ రీ ఎగ్జామ్‌కు అంతా రెడీ 2




PATANJALI पतंजलि



## అంతర్జాతీయ యోగా దినోత్సవం

## యోగా పిలుపు

ప్రాథమికంగా, మన భారతీయులం మహర్షుల వారసులం. కాలం మనల్ని వర్గాలుగా, కులాలుగా, సమాజాలుగా విభజించి ఉండవచ్చు, కానీ కృతఘ్నత అనే పాపాన్ని నివారించడానికి మనం మన పూర్వీకులకు రుణపడి ఉండాలి. అందువల్ల, మనమందరం కలిసి యోగా సాధన చేద్దాం - ప్రతి గ్రామంలో, నగర పరిసర ప్రాంతాలలో 10, 20, 50, లేదా 100 మందితో సమూహాలను ఏర్పాటు చేసుకోండి మరియు మరింత మందికి స్ఫూర్తినిచ్చేందుకు ఈ సమావేశాల ఫోటోలు మరియు వీడియోలను సోషల్ మీడియాలో పంచుకోండి.

మీరు స్వయంగా ప్రతిజ్ఞ చేసి, యోగా, ఆయుర్వేదం మరియు స్వదేశీ ద్వారా ఆత్మనిర్భర భారతదేశాన్ని నిర్మించడానికి ఇతరులను ప్రేరేపించండి.

**వ్యతిరేకత -** యోగ, ఆయుర్వేద, స్వదేశీ మరియు సనాతన సంస్కృతులను తీవ్రంగా వ్యతిరేకించి, నాశనం చేసే కుట్రలో అనేక దుష్ట శక్తులు చురుకుగా ఉన్నాయి. నిజమైన జాతీయవాద సనాతని ఆత్మలు ఈ దేవాసుర సంగ్రామంలో (మంచికి, చెడుకు మధ్య జరిగే యుద్ధం) లేదా ధర్మయుద్ధంలో (ధర్మం కోసం జరిగే యుద్ధం) పతంజలి మరియు పూజ్య స్వామి రామ్‌దేవ్ జీతో మనస్ఫూర్తిగా దృఢంగా నిలబడాలి. ఎక్కడ ధర్మం (న్యాయం) ఉంటుందో, అక్కడ విజయం ఉంటుంది; సత్యం మాత్రమే జయిస్తుంది. (యతో ధర్మః తతో జయః, సత్యమేవ జయతే)

**దోపిడీ -** ఆక్స్‌ఫామ్ అంతర్జాతీయ నివేదిక మరియు ఇంటర్నెట్‌లో లభించే వివిధ ఇతర ప్రామాణిక మూలాలను ఏఐ (AI) సాధనాలను ఉపయోగించి పరిశీలించడం ద్వారా, కేవలం గత 200-250 సంవత్సరాలలోనే విదేశీ కంపెనీలు మన దేశాన్ని 100 ట్రిలియన్లకు పైగా దోచుకున్నాయని నిర్ధారించుకోవచ్చు. బహుళజాతి కంపెనీలు, మెకాలే విద్యా విధానం మరియు సాంస్కృతిక అణచివేత ఈ మహోన్నత భారతదేశాన్ని వినాశన అంచుకు నెట్టాయి. 500-1000 సంవత్సరాల క్రితం నాటి మన స్వర్ణయుగాన్ని స్మరించుకుంటూ, భారతదేశ వ్యతిరేక శక్తులను ఓడించి, మన ఋషులు (ఋషులు మరియు ఋషికులు) అమరవీరుల ఆశయాలను సాకారం చేసుకుంటూ, ఒక వైభవోపేతమైన మరియు అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడానికి మనం అవిశ్రాంతంగా, ఐక్యంగా కృషి చేద్దాం.

**పతంజలి యొక్క సారథ్యం -** పూజ్య స్వామి రామ్‌దేవ్ జీ, ఆచార్య శ్రీ బాలకృష్ణ జీ వారి అవిశ్రాంత కృషి ద్వారా మరియు పతంజలి సంస్థ ద్వారా, యోగ, ఆయుర్వేద, స్వదేశీ మరియు సనాతన సంస్కృతుల వైభవం ఇప్పుడు యావత్ ప్రపంచానికి చేరింది. ఈ మహత్తర సేవా కార్యక్రమానికి పతంజలి లక్షల కోట్ల రూపాయల భారీ మొత్తాలను విరాళంగా అందించింది. దాదాపు 10,000కు పైగా పరిశోధనా విధానాలను పాటిస్తూ, పతంజలి విద్వాంసులు 500కు పైగా పరిశోధనా పత్రాలను అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. పతంజలి గురుకులం, ఆచార్యకులం, పతంజలి విశ్వవిద్యాలయం, భారతీయ శిక్షా బోర్డు (BSB), పతంజలి కెరీర్ అకాడమీ, పతంజలి సివిల్ సర్వీసెస్ అకాడమీ (PCSA), పతంజలి ఆరోగ్య సంక్షేమం, పతంజలి యోగగ్రామ్, నిరామయం, పతంజలి రీసెర్చ్ ఫౌండేషన్ మరియు గోశాలలు వంటి సంస్థలను కలిగి ఉన్న పతంజలి దేశవ్యాప్త నెట్‌వర్క్‌లోని లక్షలాది మంది స్వచ్ఛంద కార్యకర్తల నిస్వార్థ అంకితభావం మరియు తపస్సుతో ఒక చారిత్రాత్మక సేవా కార్యక్రమం కొనసాగుతోంది. వందలాది మంది తాపసుల తపస్సు, లక్షలాది కర్మయోగుల నిస్వార్థ సేవ, మరియు కోట్లాది తోటి పౌరుల మద్దతే మా బలం. మా చివరి శ్వాస వరకు మా సర్వస్వాన్ని మాతృభూమికి, మానవాళికి సేవకే అంకితం చేయాలన్నదే మా దృఢ సంకల్పం.

సేవ చేయడానికి మరియు యోగ సద్గుణాలను, అలాగే శ్రీరాముడు, కృష్ణుడు మరియు శివుని సద్గుణాలను ఆచరించడానికి పతంజలితో అనుసంధానం అవ్వండి. సనాతన ధర్మాన్ని ఆచరించాలి, కేవలం బోధించకూడదు.

ఆస్థా మరియు ఇండియా టీవీ వంటి ఛానెళ్లను చూడటం ద్వారా లేదా యూట్యూబ్‌లోని కంటెంట్‌ను యాక్సెస్ చేయడం ద్వారా యోగా సాధనను రోజువారీ అలవాటుగా చేసుకోండి.

| आस्था LIVE | संस्कार | INDIA TV | YouTube |
|---|---|---|---|
| Everyday 5:00 am to 7:30 am and 8:00 pm | Everyday 9:00 am | Everyday 8:00 am | Swami Ramdev \| Acharya Bal Krishna |

పతంజలి వారి పరిశోధన ఆధారిత ఆరోగ్య ఉత్పత్తులు, మందులు, అలాగే స్వదేశీ ఉత్పత్తులైన ఆవు నెయ్యి, దంత్ కాంతి, తేనె, కేశ కాంతి, షర్బత్, జ్యూస్‌లు కొనడానికి, గూగుల్‌లో "పతంజలి స్టోర్ నియర్ మీ" అని వెతకండి. ఈ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ప్రధాన స్టోర్లలో లభిస్తాయి. ఒకవేళ అక్కడ లభించకపోతే, వాటిని అందుబాటులో ఉంచమని మీ దుకాణదారుడిని కోరండి.

మరిన్ని వివరాల కోసం, పతంజలి ప్రధాన సంస్థల వెబ్‌సైట్‌లను సందర్శించండి.

సంపూర్ణ ఆరోగ్య ప్రయోజనాలను అనుభవించడానికి పతంజలి వెల్నెస్‌ను సందర్శించండి; నమోదు కోసం, దయచేసి సంప్రదించండి: **8954-666-111**

భారతీయ శిక్షా బోర్డు మరియు పతంజలి సివిల్ సర్వీసెస్ అకాడమీకి సంబంధించిన విచారణల కోసం, సంప్రదించండి: **8954-555-999**





శనివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కేంద్ర మంత్రి ధర్మేంద్ర రాజీనామా చేయాలని ఆందోళన చేస్తున్న కాక్రోచ్ పార్టీ నాయకులు

# నీట్ రీ ఎగ్జామ్‌కు అంతా రెడీ

## దేశంలోని 551 ప్రాంతాలు, విదేశాల్లోని 14 చోట్ల నేడు పరీక్ష

### పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఎన్‌టిఎ

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 20:** నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-యుజి-2026 రీ ఎగ్జామ్ నేడు(ఆదివారం) దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నారు. మే 3న జరిగిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ కావడంతో నేడు నీట్ రీ ఎగ్జామ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నీట్ రీ ఎగ్జామినేషన్‌కు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. నీట్ రీ ఎగ్జామ్ ప్రశ్నపత్రాలు, ఇతర గోప్యమైన పరీక్షా సామగ్రిని జీపీఎస్ సదుపాయం కలిగిన వాహనాల్లో పోలీసు భద్రత మధ్య తరలిస్తున్నట్లు ఎన్‌టిఏ తెలిపింది. పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీ నిఘా, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణ, రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. పరీక్ష నిర్వహణ కోసం సమన్వయకర్తలు, పరిశీలకులు, కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు, జిల్లా యంత్రాంగం అధికారులు, పోలీసు సిబ్బంది కలిపి రెండు లక్షలకు పైగా సిబ్బందిని నియమించినట్లు పేర్కొంది. దేశ వ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది అభ్యర్థులు నీట్ యూజీ 2026 రీ ఎగ్జామినేషన్ హాజరు కానున్నారు. వారి కోసం దేశంలోని 551 నగరాల్లో, విదేశాల్లోని 14 నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్ అండ్ పేపర్ విధానంలో నిర్వహించనున్నారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య పరీక్ష కేంద్రాలకు అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉండదని ఎన్‌టీఏ స్పష్టం చేసింది.

**నాగ్‌పూర్ అభ్యర్థికి అబుదాబిలో పరీక్ష కేంద్రం..**

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన ఓ విద్యార్థికి నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం ఇవ్వాల్సి ఉండగా ఆ విద్యార్థికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని అబుదాబిలో పరీక్షా కేంద్రాన్ని కేటాయించారు. పరీక్షకు కేవలం ఒక్కరోజు(శనివారం) ముందు ఈ విషయం బయటపడటంతో విద్యార్థి కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. దీనిపై విద్యార్థి కుటుంబం ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఎన్‌టీఏ సమస్యను పరిష్కరించి నాగ్‌పూర్‌లోనే పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నాగ్‌పూర్ విద్యార్థి మే 3న నిర్వహించిన నీట్ పరీక్ష నాగ్‌పూర్‌లోని సరస్వతి విద్యాలయ కేంద్రంలో రాశాడు. ప్రశ్నపత్రం లీకేజీ వివాదం నేపథ్యంలో పరీక్షను నేడు మళ్లీ నిర్వహించాలని నిర్ణయించడంతో, రీఎగ్జామినేషన్ కోసం కొత్త అడ్మిట్ కార్డు విడుదలైంది. కొత్త అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసిన విద్యార్థి కుటుంబం అందులో పరీక్ష కేంద్రంగా యూఏఈలోని అబుదాబి ఇండియన్ స్కూల్ పేరు ఉండటం చూసి ఆశ్చర్యానికి గురైంది. దరఖాస్తు సమయంలో మొదటి ప్రాధాన్యంగా నాగ్‌పూర్, తరువాత వార్ధా, భండారా నగరాలను మాత్రమే ఎంపిక చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అబుదాబి కేంద్రం కేటాయింపుపై ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ స్పందిస్తూ పరీక్ష కేంద్రం సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. విద్యార్థికి ప్రస్తుతం నాగ్‌పూర్‌లోనే పరీక్ష కేంద్రం కేటాయించామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

# ముంబయికి వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి

## సుప్రీయా సూలే కుమార్తె వివాహానికి హాజరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్20:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శనివారం మధ్యాహ్నం ముంబాయి పర్యటనకు వెళ్లారు. సీనియర్ నేత శరద్ పవార్ ఇంట్లో జరిగే వివాహ కార్యక్రమానికి హాజరు కానున్నారు. శరద్ పవార్ మనవరాలు, సుప్రీయా సూలే కుమార్తె పెళ్లి హాజరు కానున్నారు. ఇదే సమయంలో ఆదివారం మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్‌తో భేటీ అయ్యేందుకు యత్నించనున్నారని సమాచారం. తుమ్మిడిహెట్టి అనుమతి కోసం ఫడ్నవీస్‌తో చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే అంశంపై రెండు,మూడుసార్లు ఫడ్నవీస్‌కు లేఖరాశారు. ఆదివారం సాయంత్రం ముంబాయి నుంచి సిఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లనున్నారు. మెట్రో ప్రాజెక్టు నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచే పనిలో సిఎం రేవంత్‌రెడ్డి ఉండనున్నారు. సోమవారం కేంద్ర ఆర్థిక మంత్రి, అధికారులతో సిఎం భేటీ కానున్నారు. రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ రుణంపై ఒత్తి పెంచే పనిలో ఉన్నారు. రుణం ఇవ్వకపోతే న్యాయపరంగా ముందుకు వెళ్లే యోచనలో తెలంగాణ ప్రభుత్వ ఉండనుంది.

# ప్రపంచమంతా 'యోగ ముద్ర'

>> పాల్గొంటున్నారు. ఇప్పటికేఈ పోర్టల్‌లో నమోదుచేసుకున్నవారి సంఖ్య ఆరులక్షల మార్కును దాటిందని కేంద్రం తెలిపింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రైవేటు సంస్థలు, ఎన్జీవోలు, కమ్యూనిటీ గ్రూపులు లెక్కలేనన్ని పాల్గొంటున్నాయి. భారత్‌ప్రతిపాదనతో 2015 జూన్ 21న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించినైక్యరాజ్యసమితి అప్పటినుంచి యోగా డేను కొనసాగిస్తున్నది. ఇపుడు ప్రపంచంలోని 190 దేశాల్లో యోగాడే నిర్విరామంగా అనుసరిస్తున్నారు. యోగ ఫర్ హెల్దీ ఏజింగ్ అనే థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ ఏడాది యోగాడేను అంతర్జాతీయంగా అనేక కీలకప్రాంతాల్లోనిర్వహిస్తున్నారు. అమెరికాలోని వాషింగ్టన్, న్యూయార్కునగరాలతోపాటు, ఇతర ముఖ్యనగరాల్లోను నిర్వహిస్తే చైనాలోని బీజింగ్, జపాన్‌లోని టోక్యో ఇతర కీలక ముఖ్య ప్రాంతాల్లో యోగా డేను నిర్వహించడంతో లక్షలాదిమంది యోగాసన కార్యాచరణలో పాల్గొన్నారు. మానసిక ప్రశాంతత, జీవన నాణ్యత పెంపులో యోగా కీలకపాత్రపోషిస్తుందని, ఈక్రమంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న యోగా సంగం కార్యక్రమం యోగాను మరింతమంది జీవితాల్లో భాగంచేసేదిశగా ముందుకు వెళ్లాలని ప్రధాని మోడీ జాతియావత్తుకు పిలుపునిచ్చారు. అలాగే ప్రముఖ పర్యాటక కేంద్రాలు, పర్యాటక ప్రాంతాల్లో యోగాడేను నిర్వహించడంద్వారా ఈ పర్యాటక ప్రాంతాలకు విస్తృత ప్రాచుర్యం కల్పించేందుకు పురావస్తుశాఖ కూడా ముందుకువచ్చింది.

## రండి.. అశ్విని వైష్ణవ్‌ను

# కలుద్దాం

>> కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. జూన్ 16న తాను రాసిన లేఖలో హైదరాబాద్ మెట్రో రైల్‌కు సంబంధించిన సమస్యలను ప్రస్తావించానని సీఎం గుర్తుచేశారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన పరిష్కారం అవసరమని, అందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, ఆ సమయంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు. మెట్రో టేకోవర్, ఐఎఫ్ఆర్‌సీతో రుణ ఒప్పందాలు, మెట్రో ఫేజ్ 2 ప్రతిపాదనల ప్రతులను కూడా తాను తీసుకువస్తానని సీఎం ఈ లేఖ ద్వారా తెలియజేశారు.

సమావేశం ఏర్పాటు చేసి తనకు సమాచారం ఇవ్వాలని కిషన్‌రెడ్డిని కోరారు. మెట్రో పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం కావాలని అన్నారు. మెట్రో ఫేజ్2, ఐఆర్ఎఫ్‌సి ఫైనాన్సింగ్‌కు సంబంధించి అంశాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో చర్చకు సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు.

జూన్ 22, 23 తేదీల్లో తాను ఢిల్లీలో ఉంటానని, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీకి సమయం కేటాయించాలని సీఎం రేవంత్ కోరారు.ఇద్దరం కలిసి రైల్వే మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. సంబంధిత ఒప్పందాల పత్రాలతో సమావేశానికి హాజరవుతానని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తెలంగాణకు హైదరాబాద్ మెట్రో కీలక మౌలిక వసతి ప్రాజెక్టని ఈ సందర్భంగా లేఖలో సీఎం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని చెప్పుకొచ్చారు.

కాగా, ఈనెల 16వ తేదీన కూడా హైదరాబాద్ మెట్రో రైలు అంశంపై కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డి లేఖ రాశారు.

ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా తాను సిద్ధమేనని రేవంత్ అన్నారు. రైల్వే మంత్రితో వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయించాలన్నారు. ఆ సమావేశానికి సంబంధించి కిషన్ రెడ్డి పిలుపు కోసం తాను ఎదురు చూస్తానని పేర్కొన్నారు. ఇందుకు ఆయనతో వ్యక్తిగత భేటీకీ సిద్ధమేనని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు.

## వారం - వర్జ్యం

21-06-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
సప్తమి మ.3.26,
పూర్వఫల్గుణి ఉ.9.34
వర్జ్యం : సా.5.01-సా.6.41
దు.సా.4.53-సా.5.45
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉంటుంది.

**వృషభం:** ఒకరికి మీరు సహాయం చేయడమే తప్ప మీకు ఇతరులు సహకరించకపోవడం కొంత ఇబ్బంది కలిగించినా ధైర్యం వీడరు.

**మిథునం:** ప్రభుత్వ అధికారులతో విభేదించడం వలన నష్టమే తప్ప లాభం చేకూరదని గుర్తెరిగి మసలుకోండి.

**కర్కాటకం:** నూతనవ్యక్తులు పరిచయమై మాటసహాయం అందిస్తారు. ఇంటా బయటా మీదే పైచేయిగా వుంటుంది.

**సింహం:** భూములు కొనుగోలు చేస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సోదరుల కలయిక.

**కన్య:** ఆర్థికంగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తపిస్తారు. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు.

**తుల :** కుటుంబమునందు ఒడిదుడుకులను ఎదుర్కొంటారు. పనులలో తొందరపాటు వద్దు. ప్రయాణాలు లాభిస్తాయి.

**వృశ్చికం:** వీసా, పాస్‌పోర్ట్ వంటి విషయాలలో సాంకేతిక లోపాలు రాకుండా జాగ్రత్తలు వహించండి. ఆరోగ్యం జాగ్రత్త.

**ధనుస్సు:** టి.వి రంగం, యాంకరింగ్ రంగాలలోని వారికి అనుకూలమైన కాలం. ముఖ్య విషయాలలో పెద్దల సలహాలు తీసుకుంటారు.

**మకరం:** ప్రకృతివైద్యం, సౌందర్య సాధనాల పట్ల ఆకర్షితులవుతారు. పోటాపోటీగా ప్రతిపనిని చేసి విజయం సాధిస్తారు.

**కుంభం:** సమాజంలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించటానికి కావలసిన ప్రణాళికలు సిద్ధంచేసుకొని కార్యాచరణలో పెడతారు.

**మీనం:** కీలక విషయంలో సొంతనిర్ణయాలు శ్రేయోదాయకం. ఎదుటివారిని బాగా అంచనా వేయగలుగుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# యోగా నిత్యజీవితంలో భాగం

## -గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

### యోగా ఒక మతానికి పరిమితం కాదు...

### అలా చూడటం మూర్ఖత్వం: వెంకయ్య

### అంతర్జాతీయ యోగా దినోత్సవం- పెరేడ్ గ్రౌండ్స్‌లో 24 గంటల కౌంట్‌డౌన్

### యోగాలో పాల్గొన్న కిషన్‌రెడ్డి, దత్తాత్రేయ, లక్ష్మణ్, రాంచందర్‌రావు, ఈటల



శనివారం పెరేడ్ గ్రౌండ్స్ యోగా సాధనలో గవర్నర్ శుక్లా, కేంద్రమంత్రి కిషన్ తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్20:** యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, శరీరం మనసుఆత్మల సమన్వయానికి దోహదపడే సమగ్ర జీవన విధానమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 24 గంటల కౌంట్‌డౌన్ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, మానసిక ఒత్తిళ్లు, వేగవంతమైన జీవన శైలితో కూడిన ప్రస్తుత కాలంలో యోగా ప్రతి ఒక్కరికీ అంతర్గత ప్రశాంతత, క్రమశిక్షణ, సానుకూల శక్తిని అందిస్తుందని పేర్కొన్నారు.యోగా భారతీయ సనాతన జ్ఞాన సంపదకు ప్రతీకగా నిలిచి, నేడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య చైతన్యానికి మార్గదర్శకంగా మారిందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకు రావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని గవర్నర్ కొనియాడారు. 2014లో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో 177 దేశాల మద్దతుతో జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించడం భారతదేశానికి గర్వకారణమని చెప్పారు.భారతీయుల ప్రాచీన వారసత్వమైన యోగా ప్రపంచానికి ఆరోగ్యం, మానసిక సమతుల్యత సందేశాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతి పౌరుడు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతమైన, సమృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత నిర్మాణం సాధ్యమవుతుందని గవర్నర్ అన్నారు.'యోగతో ఆరోగ్యం, యోగతో సమతుల్యత, యోగతో ఆత్మబలం' అనే సందేశాన్ని ప్రజలు ఆచరణలో పెట్టాలని సూచించారు. యోగాను ఒక మత కోణంలో చూసే వారిపై ఆయన తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. యోగా అనేది ఏ ఒక్క మతానికో, వర్గానికో పరిమితమైంది కాదని,దానికి మతాన్ని ఆపాదించి చూడటం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందని వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా యోగాకు వస్తున్న గుర్తింపు మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా అనేది మన ప్రాచీనసంస్కృతిలో ఒక భాగమని, నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక, ఆరోగ్య చింతన ఎంతో అవసరమని పేర్కొన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... ప్రధాని మోదీ చొరవతోనే 12 సంవత్సరాల క్రితం యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు. డిప్రెషన్ లాంటి సమస్యలను దూరం చేయడానికి యోగా అద్భుతంగా పనిచేస్తుందని, పిల్లల నుండి పెద్దల వరకు అందరూ దీనిని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రాకేష్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, సినీ నటి పాయల్ రాధాకృష్ణ, సినీ హీరో నవీన్ పొలిశెట్టి, నటి డింపుల్ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, యోగ గురువులు, యోగ సాధకులు ప్రజా ప్రతినిధులు,యువతీ యువకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐకి రాష్ట్ర సర్కార్ గుడ్ బై?

## డిపాజిట్లు వెనక్కి తీసుకోవడంపై కసరత్తు

### ఖాతాలను ఇతర బ్యాంకులకు మార్చే యత్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్20:** రాయదుర్గంలో వివాదాస్పద భూముల వేలానికి సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వ్యవహరించిన తీరుపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఇందులో భాగంగా ప్రభుత్వానికి సంబంధించి ఎస్‌బీఐలో చేస్తున్న అన్ని లావాదేవీలను ఉపసంహరించుకోవాలనే ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఈ వివాదం కారణంగా ఎస్‌బీఐ నుంచి ప్రభుత్వ శాఖల ఖాతాలు, నిధులను మరో ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకునకు తరలించే యోచనలో సర్కార్ ఉంది. అలాగే ఇప్పటి వరకూ రాష్ట్రంలోని బ్యాంకులకు లీడ్ బ్యాంక్ హోదా ఉన్న స్టేట్ బ్యాంక్‌కు దాని నుండి తప్పించే ఆలోచన చేస్తునట్లు వెల్లడవుతోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అధికారిక ఖాతాలు, డిపాజిట్లతో పాటు, శాఖల ఖాతాలు, వాటిల్లో ఉన్న నగదు నిల్వలు, డిపాజిట్లు, రుణాలు తదితర వివరాలను రాష్ట్ర ఆర్థిక శాఖ అత్యవసరంగా సేకరిస్తున్నట్లు తెలియవచ్చింది. దీనికి సంబధించి ఆయా వివరాలను సమర్పించాలని ఫోన్ల ద్వారా అత్యవసర సందేశాలు కూడా పంపించినట్లు సమాచారం.

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగుల జీతాలు, పీఎఫ్‌లు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, కార్పొరేషన్లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు సహా ఇతరత్రా లావాదేవీలకు సంబంధించిన వివరాలన్నీ ఇవ్వాలని అన్ని శాఖల ముఖ్య, ఉన్నతాధికారుల సెల్‌ఫోన్‌లకు సందేశాలు వెళ్లాయి. ప్రభుత్వానికి చెందిన నిధులు, కార్పొరేషన్ల డిపాజిట్ల వివరాలను గోప్యంగా ఉంచకుండా పూర్తి డేటాను ఇవ్వాలని స్పష్టం చేసింది. బ్యాంకులో ఉన్న మొత్తం ప్రభుత్వ ఖాతాలు, ఎఫ్‌డీల పూర్తి స్థాయి నివేదికను వెంటనే సమర్పించాలని ఆ సందేశంలో ఆదేశించింది. డిపాజిట్లను వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా రాయదుర్గంలో టీజీఐఐసీ ఇటీవల వేలం వేసిన భూములకు ఎకరానికి రూ.237 కోట్ల రికార్డు ధర పలకింది. అయితే ఈ వేలం ప్రక్రియ ముగిసిన తదుపరి ఆ భూములు తమవేనంటూ హైకోర్టులో స్టేట్ బ్యాంక్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ బ్యాంక్‌కు గుడ్ బై చెప్పనున్నట్లు సమాచారం.



ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన కార్యక్రమంలో అభివాదం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ

# సోలార్ విలేజ్‌గా రాష్ట్రపతి స్వగ్రామం

## ముర్ము పుట్టినరోజు సందర్భంగా ఒడిశాలో రూ. 47 వేల కోట్ల అభివృద్ధి పనులు.. రాష్ట్రపతితో కలిసి ఒడిశాలో ప్రధాని పర్యటన

**మయూర్‌భంజ్(ఒడిశా), జూన్ 20:** రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన వికాస్ రా ధారా, ఒడిశా సారా బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోడీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి సోలార్ విలేజగా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతి, ఉత్కర్ష్ ఒడిశా ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో ఉత్కర్ష్ ఒడిశా ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోడీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని సంతాలీ జాహిరా, హో జాహిరా అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు.

# హార్ముజ్ మళ్లీ క్లోజ్

>> ద్వారా నౌకల రాకపోకలను నిలిపివేస్తున్నాం. శత్రుపక్షం ఇచ్చిన హామీని ఉల్లంఘించినందుకు ఇది తొలి ప్రతిస్పందన. దాడులు కొనసాగితే, తమ బాధ్యతలను నిర్వర్తించేలా ప్రత్యర్థిని ఒత్తిడి చేసేందుకు మరిన్ని చర్యలు చేపడతామని హెచ్చరించింది. ఇదిలా ఉండగా, లెబనాన్ ప్రభుత్వ మీడియా కథనాల ప్రకారం, దేశంలోని సుమారు 20 ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. నబాతియెహ్ ప్రాంతంలో జరిగిన దాడుల్లో 16 మంది మరణించినట్లు లెబనాన్ పౌర రక్షణ సంస్థ వెల్లడించింది. ఈ వారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ మధ్య మధ్యప్రాచ్య యుద్ధాన్ని అన్ని రంగాల్లో, ముఖ్యంగా లెబనాన్‌లో నిలిపివేయడానికి ప్రాథమిక ఒప్పందం కుదిరింది. లెబనాన్ అంశం ఇరాన్ ప్రధాన డిమాండ్లలో ఒకటిగా ఉంది. అయితే, ఆ ఒప్పందానికి సంబంధించిన తదుపరి చర్చలు శుక్రవారం స్విట్జర్లాండ్‌లో జరగాల్సి ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ భారీ దాడులు ప్రారంభించడంతో అవి నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ ప్రజలు మరణించగా, యుద్ధంలో ఇజ్రాయెల్‌కు చెందిన నలుగురు సైనికులు కూడా మరణించినట్లు సమాచారం. దీంతో ఇరాన్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. శుక్రవారం మధ్యాహ్నం అమెరికా మరియు ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్ హిజ్బుల్లా మధ్య కొత్త కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు అమెరికా అధికారి ప్రకటించారు. హిజ్బుల్లా కూడా పాటిస్తే తాము కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటామని అమెరికాలోని ఇజ్రాయెల్ రాయబారి తెలిపారు. శనివారం ఇజ్రాయెల్ సైనిక అధికారి మాట్లాడుతూ, ఇరాన్ మద్దతుగల హిజ్బుల్లా దళాలు రాత్రికి రాత్రే దక్షిణ లెబనాన్‌లోని ఇజ్రాయెల్ బలగాలపై 50కిపైగా క్షిపణులు, రాకెట్లు ప్రయోగించాయని ఆరోపిస్తూ, తమ దాడులను కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. లెబనాన్ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో మొత్తం 47 మంది మరణించారు. అమెరికాఇరాన్ ఒప్పందం కుదిరిన తర్వాత నమోదైన అత్యధిక మరణాల సంఖ్య ఇదేనని పేర్కొన్నారు.

# ఆర్‌ఒను ఉరితీసినా తప్పులేదు

## గాడ్సేరాజ్య స్థాపనకు కుట్ర చేస్తున్న బిజెపి

### పవన్‌ను బూచిగా చూపి తెలంగాణలో పాగాకు యత్నం: పిసిసి చీఫ్ మహేష్

**హైదరాబాద్,జూన్ 20,ప్రభాతవార్త:** మీనాక్షి నటనరాజన్ విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారనీ కేసు లేకుండా నామినేషన్ తిరస్కరించిన ఆర్‌ఓ నీ ఉరి తీసిన తప్పులేదనీ టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సంచలన ప్రకటనల చేశారు. గాంధీభవన్‌లో శనివారం తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను ఎన్నిక సంఘం తిరస్కరించినందుకు నిరసనగా రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో జరిగిన సత్యాగ్రహదీక్షకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జార్ఖండ్‌లో అంబానీ తరపు వ్యక్తికి సరైన పత్రాలు లేకున్నా మరోసారి అవకాశం ఇచ్చారనీ మీనాక్షి నటరాజన్ విషయంలో వివరణకు కూడా అవకాశం ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరించారనీ ఆరోపించారు. దేవుడు పేరు చెప్పకుండా బిజెపి నేతలు గెలిచే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారనీ చేసేవన్నీ చెడ్డపనులే అనీ ఆయన ఎద్దేవా చేశారు. పవన్‌ను బూచిగా చూపెట్టి తెలంగాణలో పాగా వేయాలని చూస్తున్నారనీ బిజెపికి, బిజెపితో అంటకాగేపార్టీలకు తెలంగాణలో స్థానం లేదనీ ఖరాఖండిగా చెప్పారు. తెలంగాణలో మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తంచేశారు. రఘుపతి రాజారాం పేరును మరిచిపోయి గాడ్సే జపం చేస్తోన్న బిజెపి దేశంలో గాడ్సే రాజ్యం స్థాపించాలని కుట్రపన్నుతోందని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆల్ ఇండియా చైర్మన్ సునీల్ పన్వర్ , ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు. సత్యాగ్రహ దీక్షలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , ఎమ్మెల్యే నవీన్ యాదవ్, పలువురు డిసిసి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనమే భావితరాలకు వరం

## జిల్లాలో ఘనంగా ప్రారంభమైన వన మహోత్సవ కార్యక్రమం

### ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 20, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఇందిరా మహిళ శక్తి భవన సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో మన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన



మంత్రి జూపల్లి కృష్ణారావుకు పూల మొక్క కుండి అందజేస్తున్న కలెక్టర్

మొక్కలను నాటిన రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, మొక్కలు నాటారు. జిల్లా అటవీశాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలను ఎదుర్కోవాలంటే విస్తృత స్థాయిలో వృక్షారోపణ చేపట్టడం అత్యంత అవసరమని అన్నారు. మొక్కలు మన జీవితానికి ఆధారం అని, అవి ఆక్సిజన్‌ను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనాన్ని పెంపొందించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోందని, వాటిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. మొక్కలు నాటడం ఒక మంచి కార్యక్రమమే అయినప్పటికీ, వాటిని సంరక్షించి పెద్ద చెట్లుగా పెంచినప్పుడే ఆ కార్యక్రమానికి నిజమైన ఫలితం దక్కుతుందని అన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని తన కుటుంబ సభ్యుడిలా సంరక్షించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం దేశంలోనే పచ్చదనం పెంపులో ఆదర్శంగా నిలిచిందని, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అందించాలంటే చెట్ల పెంపకాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందన్నారు.

ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ ప్రకృతి సంపదను పరిరక్షించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పచ్చదనం పెంపు కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతతో పాటు గ్రామాలు, పట్టణాల సౌందర్యం కూడా పెరుగుతుందని తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, కార్యాలయాల వద్ద మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ సంవత్సరం మన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 35 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ వారికి కేటాయించిన మొక్కల లక్ష్యాలను చేరుకోవాలని పచ్చదనం, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జిల్లాలో వృక్షారోపణ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వనమహోత్సవపు కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. వన మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు జిల్లా కలెక్టర్ పూలకుండీ అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ అమరేందర్, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, వివిధ శాఖల అధికారులు తదితరులు అధికారులు, పాల్గొన్నారు.

# మేధో, సాంస్కృతిక పునరుజ్జీవనానికి బెంగాల్ కేంద్రబిందువు: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

### లోక్‌భవన్‌లో గ్రాండ్‌గా పశ్చిమబెంగాల్ రాష్ట్ర అవతరణ వేడుకలు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 20:** భారత మేధో, సాంస్కృతిక పునరుజ్జీవనానికి బెంగాల్ కేంద్రబిందువనీ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. లోక్ భవన్‌లో శనివారం సాయంత్రం ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, సతీమణి జానకిశుక్లాతో కలిసి పాల్గొన్నారు. గవర్నర్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కేవలం ఒక రాష్ట్ర భౌగోళిక గుర్తింపునకు సంబంధించిన వేడుక మాత్రమే కాదని, భారతదేశ మేధో సంపత్తి, సాంస్కృతిక పునరుజ్జీవనం, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచే సందర్భమని పేర్కొన్నారు. రాజా రామమోహన్‌రాయ్, స్వామివివేకానంద, మహర్షి అరవిందో వంటి మహనీయులు భారత సాంస్కృతిక పునరుజ్జీవనానికి పునాదులు వేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమర చరిత్రలో బెంగాల్ విప్లవకారుల పాత్ర చిరస్మరణీయమని పేర్కొంటూ, వందేమాతరం గీత రచయిత బంకిమ్ చంద్ర ఛటర్జీ, జాతీయ గీత రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ఖుదీరామ్ బోస్, రాస్ బిహారీ బోస్, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వంటి మహనీయులు దేశానికి అందించిన సేవలను గవర్నర్ గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరదృష్టితో దేశవ్యాప్తంగా లోక్ భవన్‌ల ద్వారా వివిధ రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ భూమిపై పశ్చిమ బెంగాల్ వైభవాన్ని స్మరించుకోవడం ద్వారా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, సౌరాష్ట్ర నుంచి సిల్చార్ వరకు భారత ఆత్మ ఒక్కటేననే సందేశం బలపడుతుందని గవర్నర్ అన్నారు. బెంగాల్, తెలంగాణల మధ్య అనుబంధం చారిత్రకమైందని గవర్నర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఆధునిక విద్యా వ్యవస్థకు పునాదులు వేసిన ఆచార్య అఘోరనాథ్ ఛటోపాధ్యాయ సేవలను, ఆయన కుమార్తె భారత కోకిల సరోజినీ నాయుడు దేశంలో జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో పోషించిన పాత్రను గవర్నర్ గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధిలో బెంగాలీ ప్రవాస సమాజం విశేష కృషి చేస్తోందని, ఐటీ, వైద్యం, విద్య, కళలు, పరిశోధన రంగాల్లో వారి సేవలు ప్రశంసనీయమని గవర్నర్ అన్నారు. తెలంగాణను కర్మభూమిగా ఎంచుకుని రాష్ట్ర ప్రగతికి తోడ్పడటమే కాకుండా, తమ సుసంపన్నమైన భాషా, సాంస్కృతిక సంప్రదాయాలను ఇక్కడి సమాజంతో మమేకం చేశారని కొనియాడారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జ్ఞానం, కళలు, పరిశ్రమల రంగాల్లో మరింత బలమైన అనుబంధాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని గవర్నర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణలో నివసిస్తున్న బెంగాలీ సమాజానికి, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రజలకు గవర్నర్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్ మాట్లాడుతూ...మ్యాథ్స్, సైన్స్, సాహిత్య రంగాలలో పశ్చిమ బెంగాల్ తనదైన ముద్ర వేసుకున్నారు. అనంతరం పశ్చిమ బెంగాల్ గవర్నర్ ఆర్ ఎన్ రవి సందేశాన్ని డిజిటల్ స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణా చారి, బెంగాలీ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

### ఎఐటియుసి డిమాండ్

**శ్రీకాళహస్తి, జూన్ 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజనీరింగ్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు 3 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి తొండ మల్లికార్జున్, వైయస్ మణి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్య దర్శులు కోగిల హరి యన్ జాను ఏఐటీయూసీ జిల్లా నాయకులు కత్తి రవి, మునిచందు, సిపిఐ మండల కార్యదర్శి శివ కుమార్ ప్రజానాట్యమండలి చారులతో నాయకులు మురళి కొం డమ్మ శారదమ్మ మధు మురళి పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.





# ప్రియుడి కుట్రకు ప్రియురాలి కుటుంబం బలి

### ముగ్గురు సజీవదహనమైన కేసులో బిగ్ ట్విస్ట్

### పోలీసుల అదుపులో నిందితుడు

**మిర్యాలగూడ, జూన్ 20, ప్రభాతవార్త:** ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ప్రణయంగా మారి ఇద్దరూ సహజీవనం చేశారు. ఇటీవల ప్రియురాలు ఆ యువకుడి ప్రవర్తన నచ్చక దూరం పెట్టడంతో ఆమెను, ఆమె కుటుంబసభ్యుల్ని ఆమె ప్రియుడే పక్కా స్కెచ్ వేసి దారుణ హత్యలు చేసినట్లు పోలీసుల విచారణలో వెలుగుచూసినట్టు తెలుస్తోంది. ఈ నెల 5న నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని కలలవాడలో ఓ వృద్ధురాలుతో పాటు ఇద్దరు చిన్నారులు సజీవ దహనమైన కేసులో మిస్టరీ వీడింది. అది సహజ ప్రమాదం కాదని ప్రియుడే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీస్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది.



**పోలీస్ విచారణలో షాకింగ్ నిజాలు..**

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదవశాత్తు సిలిండర్ పేలి ముగ్గురు దుర్మరణం చెందినట్లు భావించిన ఈ కేసులో, పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా షాకింగ్ నిజాలు వెలుగులోకి వచ్చాయని సమాచారం. పక్కా ప్లాన్‌తో చేసిన దారుణమేనని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈనెల 5వ, తేదీ అర్ధరాత్రి కలాల్‌వాడలోని ఒక ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వనం చంద్రకళ (అమ్మమ్మ), (కూతురు ధనమ్మ పిల్లలు )ఆమె మనవడు లక్ష్మణ్ (16), మనవరాలు ప్రణతి(14) సజీవ దహనమైన సంగతి విదితమే. చంద్రకళ కుమార్తె ధనమ్మ భర్త చనిపోవడంతో తన ఇద్దరు పిల్లలతో కొన్ని సంవత్సరాలుగా తల్లి చంద్రకళ వద్దే ఉంటూ పిల్లలను చదివించుకుంటుంది. ఇటీవల చంద్రకళ భర్త కూడా చనిపోవడంతో మగదిక్కు లేని వారు కూలి నాలి చేసుకుంటూ కుటుంబ భారాన్ని భుజాన వేసుకొని జీవిస్తున్నారు. ఇన్ స్టా గ్రామ్ లో పరిచయం... ధనమ్మకు ఇన్‌స్టాగ్రామ్‌లో శ్రీకాకుళానికి చెందిన శ్రీకాళహస్తి శిరీష్‌కుమార్ పరిచయం అయ్యాడు. పరిచయం కాస్త ప్రణయంగా మారి కొంతకాలం సహజీవనం చేశారని తెలిసింది. కానీ కొద్ది కాలానికే అతని వ్యవహార శైలి నచ్చకపోవటంతో ధనమ్మ, కుటుంబం అతన్ని దూరం పెట్టింది. ఫోన్ నెంబర్ కూడా అందుబాటులో లేకుండా చేసింది.

ఇక్కడే ఉంటే అతని వేధింపులు తప్పవని గ్రహించిన ధనమ్మ ఇంటి పని చేసేందుకు పుణే వెళ్లింది. సంఘటనకు కొద్దిరోజుల ముందు చంద్రకళ ఇం టికి వచ్చిన సదరు శిరీష్ ఇకపై తన చెడు వ్యసనాలు వదిలేస్తానని, మంచిగా చూసుకుంటానని మభ్య పెట్టేందుకు ప్రయత్నించినప్పటికీ చంద్రకళ, ధనమ్మ పిల్లలు ఒప్పుకోలేదని సమాచారం. కనీసం ధనమ్మ ఫోన్ నెంబర్ అయినా ఇవ్వాలంటూ అడిగినా వారు ఇవ్వకుండా నిరాకరించినట్లు తెలిసింది. దీంతో వారిపై కోపం పెంచుకున్న సదరు శిరీష్ వారిని అడ్డు తొలగించుకుంటే ఏ దిక్కులేని ధనమ్మ తన దగ్గరకు వస్తుందని భావించి, ఈనెల 5వ తారీఖు అర్ధరాత్రి వారిపై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు సమాచారం. నిందితునికి స్వల్ప గాయాలు ఈ క్రమంలో సదరు నిందితునికి కూడా స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. ఒక్కసారిగా మంటలు అంటుకోవటంతో పాటు గ్యాస్ సిలిండర్ కూడా పేలడంతో ముగ్గురు సజీవ దహనం అయినట్లు సమాచారం. మృతుల కుటుంబ నేపథ్యం, ఘటన స్థలంలో లభించిన ఆధారాలను, సిసి ఫుటేజ్ ను పరిశీలించిన పోలీసులకు ఈ ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమయినట్లు తెలిసింది. దీంతో ఛాలెంజ్ గా తీసుకున్న పోలీసులు నిందితుడు శిరీష్ కుమార్ పై నిఘా పెట్టి, విచారణను వేగవంతం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. కుటుంబ కలహాలు లేదా ఆర్థిక గొడవలే ఈ ఘాతుకానికి కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

శిరీష్ కుమారే అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా ఇంట్లోకి చొరబడి, గ్యాస్ లీక్ చేసి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు బలమైన ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. అనుమానితుడైన శిరీష్ కుమార్‌ను మిర్యాలగూడ పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారని, రహస్య ప్రాంతంలో అతడిని విచారిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ కేసు పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించనున్నారని తెలిసింది. ఇప్పటివరకు ప్రమాదంగా భావించిన ఈ దుర్ఘటన ఓ కిరాతకుడి దుర్మార్గమైన పన్నాగం అని తేలడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

# రెండేళ్ల విజయోత్సవ సభ విజయవంతం

**రాయచోటి, జూన్ 20 ప్రభాతవార్త:** రెండేళ్ల విజయోత్సవ సభ రాయచోటిలో విజయవంతంగా నిర్వహించారు. సభలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ దార్శనిక నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమం వైపు వేగంగా పయనిస్తుందన్నారు. రెండేళ్లలోనే అభివృద్ధికి కొత్త దిశను చూపుతూ సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేర్చిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా అన్నదాత సుఖీభవ పథకం కింద 51013 మంది రైతులకు సంవత్సరానికి 20000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తూ సుమారు 102 కోట్లు వార్షిక భరోసా కల్పించామన్నారు దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం 34,521 కుటుంబాలకు లబ్ధి చేకూరాగా 256359 ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసి 20 కోట్ల ఆర్థిక సహాయం అందించామన్నారు తల్లికి వందనం పథకం ద్వారా 76,442 మంది విద్యార్థులకు 52,47 మంది తల్లులు లబ్ధి పొందుతున్నారన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద 37, 555 లబ్ధిదారులకు ప్రతినెల సామాజిక భద్రత పెన్షన్లు అందిస్తున్నామన్నారు మూడు ఆసుపత్రులను అభివృద్ధి చేసి మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేసి 160 వైద్య పరికరాలను సమకూర్చి 2630 ఆరోగ్య శిబిరాల ద్వారా 64 వేల మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు అందించామన్నారు విద్యారంగంలో 114 అదనపు తరగతి గదులు 161 పాఠశాలల్లో తాగునీటి సదుపాయాలు 254 డిజిటల్ క్లాస్ రూమ్ లు ఏర్పాటుచేసి 10409 మంది విద్యార్థులకు ప్రత్యక్ష ప్రయోజనం కల్పించామన్నారు ఈ విధంగా సూపర్ సిక్స్ హామీల అమృతపాటు యువత మహిళలు రైతులు పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అన్నారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దుతానని పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ విజయోత్సవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ అనిత యాదవ్ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

## సెక్రటేరియట్ ఎఎస్ఒలకు బంపర్ ఆఫర్

### ఎంపిడిఒ అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్ర పరిపాలనకు గుండెకాయలాంటి సచివాలయంలో వివిధ శాఖల్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు (ఏఎస్వోలు), సీనియర్ స్టెనోగ్రాఫర్లుగా పనిచేస్తున్న వారిని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) గా వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీరిని బదిలీ ప్రాతిపదికన నియమించాలని సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా ఉత్తర్వులు జారీ చేశారు. సెక్రటేరియెట్‌లోని సింగిల్ యూనిట్ పరిధిలోకి వచ్చే శాఖల్లో ఆర్థిక, న్యాయ శాఖలు మినహా మిగిలిన విభాగాల్లో పనిచేస్తున్న ఏఎస్వోలు, సీనియర్ స్టెనోల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులుగా వెళ్లడానికి ఆసక్తి ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మాలో తమ అంగీకార పత్రాన్ని ఈ నెల 24 లోపు తెలియజేయాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తుతో పాటు, సంబంధిత ఉద్యోగి వార్షిక పనితీరు నివేదికలు, ఐదేళ్ల స్పెషల్ అసెస్ మెంట్ నివేదికలను జత చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## పద్మావతిఅమ్మవారి సేవలో సిఎస్ రామకృష్ణారావు



**తిరుపతి, జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు కుటుంబంతో కలసి శనివారం సాయంత్రం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించు కున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుచానూరుకు చేరుకున్న ఆయనకు, కుటుంబసభ్యులకు టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోనికి చేరుకుని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి అమ్మవారి తీర్థప్రసాదాలు అంద జేశారు. ఆయన తిరుమలకు వెళ్ళారు.

# రైతులు అధైర్యపడవద్దు.. రెండేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం

### రైతుబంధు సర్కారు పోయి రాబందు వచ్చింది

### బోథ్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీమంత్రి కెటిఆర్

**ఆదిలాబాద్ ప్రతినిధి, జూన్ 20, ప్రభాతవార్త :** ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు బంధు ప్రభుత్వ పోయి రాబంధు ప్రభుత్వ వచ్చిందని, కరోనా కంటే డేంజర్ కాంగ్రెస్ ప్రభుత్వమని, రైతులు కాళ్లు కాదు కాంగ్రెస్ నాయకుల కాలర్ పట్టుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి వరకు చివరి గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవరు అధైర్య పడకండి అని బహిరంగ సభలలో తెలిపి ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో కేంద్ర ఇచ్చిన కోటా కంటే అధనంగా కొనుగోలు చేయకూడదని క్యాబినెట్ తీర్మాణం చేసినట్లు ఆయన అన్నారు. కేసిఆర్ ప్రభుత్వం రైతులను రాజు చేసినట్లు ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా రైతుబంధు పథకం పెట్టి ఆర్థికంగా ఆదుకున్నట్లు, రెండుసార్లు రుణమాఫీ చేయడం జరిగిందని వెల్లడించారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులు చేపట్టి చెరువులకు పూర్వ వైభవం వెచ్చినటున్ల ఆయన అన్నారు. గతంలో 1కోటి30 లక్షల ఎకరాల ఉన్న సాగు కేసిఆర్ ప్రభుత్వ హయాంలో 2 కోట్ల 30 లక్షలకు చేరుకుందని, అదనంగా ఒక కోటి ఎకరాల సాగు అధికంగా అయినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రైతు డిక్లెరేషన్ పేరుతో తెలంగాణ రైతులను మోసం చేశారని అన్నారు. అన్ని పంటలకు బోనస్ 500 రూపాయలు ఇస్తామని, 40 రకాల సన్నలు అని కేవలం 7 రకాల సన్నలకు మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టం జరిగిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో ఆంక్షలు విధిస్తే అప్పటి కేటీఆర్ ప్రభుత్వ హయాంలో ఢిల్లికి రాష్ట్ర ప్రభుత్వం బయల్దేరి కేంద్రంతో సంప్రదింపులు జరిపి కొనుగోలు చేపట్టేలా కృషిచేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8 కాంగ్రెస్ ఎంపిలు, 8 మంది బీజేపి ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి చివరి గింజవరకు కొనేలా చేయాలని తెలిపారు. అనంతరం కార్యకర్తలకు, నాయకులకు ఎస్ఐఆర్ కార్యక్రమం పై అవగాహన కల్పించారు. త్వరలో యాప్ ద్వారా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు.

**ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని పరామర్శ**

జిల్లాలోని నెరడిగొండ మండలం పొన్న గ్రామానికి చెందిన రైతు పాండురంగ్ ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని బలవన్మరణానికి పాల్పడిన రైతు కుటుంబాన్ని కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు బృందం పరామర్శించడం జరిగింది. పార్టీ నిధుల నుండి రూ. 3లక్షల చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. రైతులు ఎవరు అధైర్యపడవద్దని రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి జాన్సన్ భుక్యా, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాధిత రైతు కుటుంబానికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

## భగీరథ్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు

### చర్లపల్లి జైలు నుంచి విడుదల

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో అరెస్టయి చర్లపల్లి జైల్లో వున్న బండి భగీరథ్‌కు మ ల్కాజిగిరి ఫోక్సో కోర్టు శనివారం వారంరోజులపాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇంజనీరింగ్ పరీక్షలకు హాజరయ్యేందు కోసం తనకు వారం రోజుల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడి భవిష్యత్తు రీత్యా ఈ నెల 26వ తేదీ వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేశారు. గత నెల 16న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో అరెస్టు చేయడం తెలిసిందే. అంతకు పదిరోజుల ముందు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదుకాగా అతను పోలీసుల విచారణకు రాకుండా హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు ప్రయత్నించగా అక్కడ పిటిషన్ డిస్మిస్ అవడం విదితమే. దీని తరువాత భగీరథ్‌ను పేట్ బషీరాబాద్ పోలీసులు గండిపేట్ వద్ద అరెస్టుచేసి జైలుకు తరలించారు. అప్పటి నుంచి అతను జైల్లో వున్నాడు. కాగా తాజాగా భగీరథ్‌కు మల్కాజిగిరి పోక్సో కోర్టు శనివారం మధ్యాహ్నం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మధ్యంతర బెయిల్ సందర్భంగా న్యాయమూర్తి షరతులను విధించారు. బెయిల్ గడువు ముగియగానే నేరుగా జైలు అధికారులకు లొంగిపోవాలని, ఫిర్యాది దారులను బెదరించకూడదని ఆదేశించారు.

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వర నమూనా సేకరణ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 20, ప్రభాతవార్త:** సింగరేణి ఆస్తుల వ్యవహారంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసి జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ స్వరనమూనాలను సేకరించారు. సింగరేణి ఆస్తులను ధ్వంసం చేయాలని, కార్యాలయంపై దాడి చేయాలని, రైలు పట్టాలు తెగ్గొట్టాలని, మిలిటెంట్ యాక్టివిటీకి సిద్ధం కావాలని బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయ డంతో నాంపల్లి పోలీసులు కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు. ఈ కేసు కాస్త నాంపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి కొద్దిరోజుల క్రితం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదలీ అయింది. కాగా సుమన్‌ను కస్టడీకి తీసుకునేందుకు బంజారా హిల్స్ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఆ పిటిషన్‌ను కోర్టు తోసి పుచ్చింది.

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయము, ఇరిగేషన్ సర్కిల్, సూర్యాపేట
టెండర్ నోటీసు నెం. 21 SE/2026-27, తేది: 20.06.2026, పని పేరు: యాదాద్రి భువనగిరి జిల్లా-మోత్కూర్ మునిసిపాలిటీ నందు గల పెద్ద చెరువు యొక్క క్రుంగిన చెరువు కట్ట మరమ్మతు పనుల గురించి బిడ్లను ఆహ్వానించడమైనది. అంచనా విలువ: రూ.36.42 లక్షలు. టెండర్ స్వీకరించు చివరి తేదీ మరియు సమయం: 23.06.2026 సా.5.00 గం. వరకు. మిగతా వివరాలకు https://tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.
సం/- యస్. శివ ధర్మ తేజ, యం.ఇ., పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, సూర్యాపేట
DIPR.No.4649-PP/CL/Advt/1/2026-27, తేది: 20.06.2026

# ఆహారమే విషతుల్యమైతే..

**దేవిప్రసాద్ బొందలపాటి**

'ఆహారమే ఔషధం" అనే భారతీయ జీవన తత్వం నేడు 'ఆహారమే విషం'గా మారుతోందా అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు పండుగల సమయంలో మాత్రమే కల్తీ ఆహారంపై వార్తలు వినిపించేవి. కానీ ఇప్పుడు ఉదయం తాగే పాల నుంచి రాత్రి భోజనంలో ఉండే పనీర్ వరకు, పిల్లలు తినే చాక్లెట్ల నుంచి ఇంట్లో వాడే నెయ్యి వరకు, హోటళ్లలో ఉపయోగించే అల్లంవెల్లుల్లి పేస్ట్ నుంచి వీధి వ్యాపారులు విక్రయించే మసాలాల వరకు దాదాపు ప్రతి ఆహార ఉత్పత్తిపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గత కొన్నేళ్లుగా వెలుగులోకి వస్తున్న వరుస కల్తీ కేసులు ప్రజారోగ్య వ్యవస్థను అప్రమత్తం చేస్తున్నాయి. టన్నుల కొద్దీ నకిలీ ఆహార పదార్థాలు పట్టుబడుతున్నా, మార్కెట్‌లో వాటి ప్రవాహం మాత్రం తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. దర్యాప్తుసంస్థల ప్రకారం ఇది విడివిడిగా జరిగే నేరం కాదు. కోట్ల రూపాయల టర్నోవర్‌తో నడుస్తున్న ఒక వ్యవస్థీకృత నేర నెట్‌వర్క్‌గా మారింది. గతంలో కల్తీ అంటే పాలలో నీళ్ల కలపడం, మిరప పొడిలో ఇటుకపొడి కలపడం వంటి చిన్నస్థాయి మోసాలు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు సాంకేతికత, ప్యాకేజింగ్, బ్రాండింగ్‌ను ఉపయోగించి భారీ స్థాయిలో నకిలీ ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. గడువు ముగిసిన ఉత్పత్తులకు కొత్త లేబుళ్లు అతికించడం, కుళ్లిపోయిన ముడి పదార్థాలను రసాయనాలతో శుభ్రపరచి మళ్లీ వినియోగించడం, కృత్రిమ రంగులు, ఫ్లేవర్లు, రసాయనాలు కలిపి నాణ్యమైన ఉత్పత్తుల్లా విక్రయించడం, ప్రముఖ బ్రాండ్లను పోలిన ప్యాకెట్లలో నకిలీ సరుకులను మార్కెట్‌లోకి పంపించడం వంటి అక్రమాలు సాధారణమైపోయాయి. తెలంగాణలో అధికారిక గణాంకాల ప్రకారం పరీక్షించిన 18,283 ఆహార నమూనాల్లో 2,642 నమూనాలు నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలింది. అంటే ప్రతి 100 నమూనాల్లో దాదాపు 15 నమూనాలు కల్తీ లేదా నాణ్యత లోపాలతో ఉన్నాయన్న మాట. 2021 నుంచి 2024 మధ్య పరీక్షించిన 15,702 నమూనాల్లో 2,387 నమూనాలు కూడా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లో 2023-2026 మధ్య 16,700 ఆహార నమూనాలను పరీక్షించగా సుమారు 1,400 నమూనాలు నాణ్యత ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అంతేకాదు, 2018- 2022 మధ్య ఆహార కల్తీకి సంబంధించిన 14,745



కేసులు నమోదవడం రాష్ట్రంలో సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. దేశంలో అత్యధిక ఆహార కల్తీ కేసులు నమోదైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలిచింది. ఆహార కల్తీ కేవలం ఆర్థిక నేరం మాత్రమే కాదు, ప్రాణాలను కూడా బలితీసే ప్రమాద కర నేరం. ఆంధ్రప్రదేశ్‌లో విషపూరిత రసాయనం కలిసిన పాలను సేవించడం వల్ల 16 మంది వరకు ప్రాణాలు కోల్పోయిన ఘటన దీనికి నిదర్శనం. పాలలో కలిసిన ఎథిలీన్ గ్లైకాల్ వంటి రసాయనాలు మూత్రపిండాలు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్తీ ఆహారంలో ఉపయోగించే కృత్రిమ రంగులు, రసాయనాలు, నాసిరకం నూనెలు, గడువు ముగిసిన పదార్థాలు వెంటనే ప్రభావం చూపకపోయినా, దీర్ఘకాలంలో కాలేయం, మూత్ర పిండాలు, గుండె, జీర్ణవ్యవస్థ, హార్మోన్ల అసమతుల్యత వంటిసమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఈ ప్రమాదానికి మరింత సులభంగా గురవుతారు. హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో పాల ఉత్పత్తులు, పనీర్, నెయ్యి, వెన్న, కోవా, చికెన్, మసాలా పొడులు, బేకరీ ఉత్పత్తులు, సాస్‌లు, అల్లంవెల్లుల్లి పేస్ట్ వంటి ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఏర్పడింది. అయితే నాణ్యమైన ఉత్పత్తి, పర్యవేక్షణ అంతేవేగంగా పెరగకపోవ డంతో అక్రమార్కులకు అవకాశం దొరికింది. ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో నెయ్యిలో వనస్పతి కలపడం, పనీర్ స్థానంలో చీజ్ అనలాగ్ ఉత్పత్తులు విక్రయించడం, గడువు ముగిసిన ముడి పదార్థాలతో స్వీట్లు తయారు చేయడం, రంగులు, సువాసనలతో నాసిరకం ఉత్పత్తులను నాణ్యమైనవిగా చూపించడం వంటి అక్రమాలు బయటపడు తున్నాయి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం హైదరాబాద్‌లో కల్తీ ఆహార నేరాలను అరికట్టేందుకు పోలీసులు ఏర్పాటు చేసిన హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్ ఫాస్ట్) తక్కువ కాలంలోనే సంచలన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చింది. మార్చిలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక బృందం కేవలం మూడు నెలల్లోనే 61కిపైగా కేసులు నమోదుచేసింది. 64 మందిని అరెస్టు చేసింది. 14,685 కిలోల కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం చేసుకుంది. 400 లీటర్ల కల్తీ ద్రవ పదార్థాలను గుర్తించింది దాడుల్లో రోజువారీ వినియోగించే పనీర్, పాల ఉత్పత్తులు, అల్లం వెల్లుల్లి పేస్ట్, టీ పొడి, నెయ్యి, వంట నూనెలు, బేకరీ ఉత్పత్తులు, చాక్లెట్లు, చికెన్, మసాలాలు, స్నాక్స్ తదితర ఉత్పత్తుల్లో కల్తీ జరుగుతున్నట్లు బయటపడింది. గడువు ముగిసిన ఉత్పత్తులకు కొత్త లేబుళ్లు అతికించడం, కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లిని రసాయనాలతో శుభ్రపరచి పేస్ట్ తయారు చేయడం, టీ పొడిలో కృత్రిమ రంగులు, గడువు ముగిసిన ఆకులు కలపడం, పనీర్ పేరుతో చీజ్ అనలాగ్ ఉత్పత్తులు విక్రయించడం, చిన్నారుల చాక్లెట్లలో గడువు ముగిసిన ఫ్లేవర్ల వినియోగం, అపరిశుభ్ర పరిస్థితుల్లో బేకరీ ఉత్పత్తుల తయారీ, పాడైన చికెన్ నిల్వ చేసి విక్రయించడం, భారీ మొత్తంలో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా చేయడాన్ని గుర్తించారు. మల్లేపల్లిలో నిర్వహించిన దాడిలో 1,090 కిలోల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, 875 కిలోల ముడిసరుకు, అసిటిక్ యాసిడ్, కృత్రిమ రంగులు స్వాధీనం చేసుకున్నారు. టీ పొడి రాకెట్‌పై దాడుల్లో 3,000 కిలోల కల్తీ టీ పొడి, 1,500 కిలోల గడువు ముగిసిన టీ పొడి గుర్తించారు. తాజాగా 825 కిలోల పనీర్, చీజ్ అనలాగ్ ఉత్పత్తులు, 325 కిలోల పాడైన చికెన్, అలాగే 90 టన్నుల చికెన్ వ్యర్థాలు కూడా పట్టుబడ్డాయి. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఒక యూనిట్‌పై చర్యలు తీసుకున్న వెంటనే మరో పేరుతో కొత్త యూనిట్ ఏర్పాటు చేసి అదే వ్యాపా రాన్ని కొనసాగిస్తున్నట్లు అనేక కేసుల్లో గుర్తించారు. తయారీ, నిల్వ, ప్యాకింగ్, రవాణా, మార్కెటింగ్ వంటి ప్రతి దశలో వేర్వేరు వ్యక్తులు ఉండటంతో మొత్తం నెట్‌వర్క్‌ను ఛేదించడం సవాలుగా మారుతోంది. ●

చట్టరీత్యా సరైన చర్యలు లేకపోవడం వల్ల అక్రమార్కులు పుట్టగొడుగుల్లా పుట్టుకు రావడమే కాకుండా, చిన్నచిన్న జరిమానాలతో తిరిగి పరిశ్రమలను మరో పేరుతో ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్లోకి నకిలీ, కల్తీ ఉత్పత్తులను జొప్పిస్తున్నారు. కల్తీఆహారాన్ని అరికట్టేందుకుప్రతిజిల్లాలో ప్రత్యేక ఆహారనిఘా బృందాలు ఏర్పాటుచేయాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సుల డిజిటల్ పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. హోటళ్లు, బేకరీలు, క్యాటరింగ్ సంస్థలపై నెలవారీ తనిఖీలు నిర్వహించాలి. గోదాములు, కోల్డ్ స్టోరేజీలపై ప్రత్యేక నిఘా పెట్టాలి. కల్తీ నిరూపితమైతే లైసెన్సులనుశాశ్వతంగా రద్దు చేయాలి. పునరావృత నేరాలకు కఠినశిక్షలు అమలు చేయాలి. ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల సంఖ్య పెంచడంతోపాటు ప్రత్యేక న్యాయవ్యవస్థద్వారా కేసుల విచారణ వేగవంతం చేయాలి. ప్రభుత్వం, పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఎంత చురుకుగా ఉన్నా వినియోగదారులు అప్రమత్తంగా లేకపోతే ఈ పోరాటం విజయవంతంకాదు. ప్రతి కొనుగోలుకు బిల్లుతీసుకోవాలి. తయారీ, గడువు తేదీలు పరిశీలించాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నుధృవీకరించాలి. అసాధారణంగా తక్కువ ధరలకు లభించే ఉత్పత్తులవిషయంలో అప్రమత్తంగా ఉండాలి. అనుమానాస్పద ఉత్పత్తులపైవెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఒక వ్యక్తి జేబులోని డబ్బును దొంగిలిస్తే అదిఆర్థికనేరం. కానీ అతను తినే ఆహారాన్నే కలుషితంచేసి ఆరోగ్యాన్నిదెబ్బతీస్తే అది సమాజంపైనే దాడి. తెలుగు రాష్ట్రాల్లో వెలుగుచూస్తున్న వరుస కల్తీకేసులు ఇదేవాస్తవాన్ని గుర్తుచేస్తున్నాయి. ఆహార భద్రత అనేది ఒక్క ప్రభుత్వ బాధ్యత కాదు. రైతునుంచి తయారీదారువరకు, వ్యాపారి నుంచి హోటల్ యజమాని వరకు, పోలీసు నుంచి ఫుడ్‌సేఫ్టీ అధికారి, చివరకు వినియోగదారుడి వరకుప్రతి ఒక్కరూ ఈగొలుసులో భాగస్వాములే. ఆహార భద్రతను ప్రజా ఉద్యమంగా మార్చగలిగితేనే'ఆహారమే ఔషధం అనే భావనను మళ్లీ సార్థకం చేయగలం.

---

రాష్ట్రం

మహారాష్ట్ర

# చీలికల కాలం!

**ఎ.వి.వి ప్రసాద్**

పార్టీలలో చీలికలే ప్రస్తుత రాజకీయ పరిణామాలుగా కనిపిస్తున్నాయి. ఏ పార్టీలో ఎందుకు చీలిక వస్తున్నదో, చీలిన గ్రూపు ఏ పార్టీలో కలుస్తున్నదో అంతాఅనూహ్యంగా ఉంటోంది. తాజాగా మమతా బెనర్జీ పార్టీ ఎదుర్కొంటున్న సంక్షోభం మరుగున పడకుండానే మహారాష్ట్రలోని శివసేనలో కూడా కొత్త సంక్షోభం మొదలయింది. గత శుక్రవారానికి ఆరు పదులవయసు నిండి షష్టిపూర్తి చేసుకొన్న ఆ పార్టీ రెండోసారి పెద్ద కుదుపునకు గురికావడం ఆశ్చర్యం కలిగించే విషయమే. అరవయ్యేళ్ల క్రితం బాల్ థాకరే ఆ పార్టీని ఏర్పాటు చేసినప్పుడు అదో గొప్ప సంచలనం. మరాఠీ ప్రజల హక్కులు, మహారాష్ట్ర ప్రాంతీయ గుర్తింపు భావజాలంతో 1966 జూన్ 19 న ఆయన పార్టీని ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా ఏర్పడి జాతీయ రాజకీయాలను సైతం ఎంతగానో ప్రభావితం చేసింది. మహారాష్ట్రలో శివసేనతో పొత్తు కుదరకపోతే గెలవలేని పరిస్థితిని జాతీయ పార్టీలకు సైతం కల్పించింది. సింహం సింగిల్ గానే పోరాడుతుందన్నట్లు శివసేన కూడా రెండు దశాబ్దాల పాటు ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగింది. తర్వాత అనివార్య పరిస్థితుల్లో ఒకసారి కాంగ్రెస్‌తో, మరోసారి బిజెపితో కలిసి పోటీ చేసింది. ఎవరితో చేతులు కలిపినా చివరికి పైచేయి శివసేనది గానే ఉండేది. అధికారంలో ఉన్నా, లేకపోయినా బాల్‌థాకరే ఉన్నంతకాలం'పెద్దపులి' తరహాలోనే శివసేన కనిపించేది. ఆ తర్వాత కాలం మారింది. 2022 లో ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో జరిగిన తిరుగుబాటు శివసేనకు ఓ పెద్ద కుదుపు అనే చెప్పాలి. బాల్ థాకరే కుమారుడు ఉద్ధవ్ థాకరే పార్టీని సమైక్యంగా ఉంచలేకపోయారో, లేక ఇతరేతర ప్రభావాలు పనిచేశాయో గాని శివసేన మొదటిసారి రెండుగా చీలిపోయింది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో షిండే శివసేనకు 57సీట్లు రాగా, ఉద్ధవ్ సేనకు 20 మాత్రమే వచ్చాయి. బిజెపి అండతో షిండే మంచి ఊపుమీద ఉన్నా, ఉద్ధవ్ మాత్రం పార్టీ ఉనికిని కాపాడుకొనే యత్నంలో కొట్టుమిట్టాడుతున్నారు. బాల్ థాకరే ఉన్నప్పుడు సమైక్య పార్టీకి 20శాతం పైగా ఓట్లుఉండగా, పార్టీతో పాటు ఓట్లు కూడా చీలిపోయి షిండే గ్రూపునకు దాదాపు 12శాతం, ఉద్ధవ్ గ్రూపునకు 9 శాతం ఓట్లు వచ్చాయి. ఈ దశలో ఉద్ధవ్ సేనలో మరో చీలిక అనివార్యంగా కనిపించడం ఆశ్చర్యకరమైన పరిణామమే. 'ఆపరేషన్ టైగర్' పేరుతో అధికార పార్టీ చేపట్టిన ఆకర్షణ ప్లాన్ ఇప్పుడుచాలామంది ఎంపీలపై వలవేసింది. గతవారం ఆ వలలో ఆరు గురు ఉద్ధవ్ఎంపీలు పడడం అందరిని ఉలికి పాటుకు గురి చేసింది. ఆ ఆరుగురు ఇంతకాలం ఉద్ధవ్ గ్రూపులో ఎంతో విధేయత కలిగినవారే. సంజయ్‌జాదవ్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ పాటిల్, నగేశ్ పాటిల్, నింబాల్కర్, బాబాసాహెబ్ వాక్చౌరే గత బుధవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరారు. దానిని స్పీకర్



ఉద్ధవ్ థాకరే

వెంటనే ఆమోదించేశారు కూడా. అక్కడితో ఉద్ధవ్ శివసేన రెండుగా చీలినట్లయింది. ఇక ఉద్ధవ్ వైపు మిగిలింది ముగ్గురు ఎంపీలే. షిండే బలం 13 ఎంపీలకు పెరిగింది. నాలుగు సంవత్సరాల క్రితం శివసేనలో షిండే చీలిక తెచ్చినపుడు అతడేం చేయగలడనే అంతా భావించారు. కానీ ఆయన వెంటనే సిఎం కావడమే గాక తర్వాత వచ్చిన ఎన్డీయే ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం పదవి చేపట్టారు. అందుకు కారణాలు వేరే ఉన్నాయి. ఇప్పుడు బలంపెరగడంతో ముందు ముందు ఆయన స్థాయి మళ్లీ మారవచ్చు. కేంద్ర మంత్రి కాగలరనే మాట కూడా వినిపిస్తోంది. శుక్రవారం శివసేన షష్టిపూర్తి సమావేశంలో ఉద్ధవ్ మాట్లాడుతూ తాను పార్టీ నాయకత్వం నుంచి తప్పుకొనడానికి సిద్ధంగా ఉన్నానంటూ ఎంతోవేదనగా అన్నారు. అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానన్న ఉద్ధవ్ ఇక పార్టీని ఏం ఉద్ధరిస్తారనే అనుమానం అందరిలో కలిగించారు. మరో సమావేశంలోషిండే మాట్లాడుతూ 'ఇది ట్రైలర్ మాత్రమే, అసలు సినిమా ముందుంది' అనడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. బహుశా మిగిలిన ముగ్గురు ఉద్ధవ్ ఎంపీలు కూడా జారిపోవచ్చనే అనుమానం అందరిలో కలుగుతోంది. ఎంతో ఉన్నతస్థానానికి ఎదిగిన శివసేన ఇలా ముక్కల వడానికి ఉద్ధవ్ బలహీనతలు కూడా కారణమనే చెప్పాలి. సొంత అనుచరగుణానికి పార్టీలో ఇచ్చిన ప్రాధాన్యం నిబద్ధతతో పనిచేసిన నాయకులకు ఇవ్వలేదనే ఆరోపణలు ఉద్ధవ్‌పై ఉన్నాయి. ఆయన కుమారుడు ఆదిత్యథాకరే పెత్తనం ఎక్కువ కావడం, ఆయన కనుసన్నల్లోని వారికే పార్టీపదవులు లభిస్తూండడం తిరుగుబాట్లకు ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. తన గ్రూపును కాంగ్రెస్‌లో విలీనం చేయాలని ఒకసారి, బిజెపిలో విలీనం చేయాలని మరోసారి ఉద్ధవ్ భావించడం కూడా పార్టీలో వ్యతిరేకతను పెంచింది. ఆయన వద్ద ఒక స్థిరమైన ఆలోచన లేనందువల్లే పార్టీలో తాజా చీలికకు దారితీసిందని కూడా అంటున్నారు. లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడం కోసం బిజెపియే పార్టీల్లో చీలికలను ప్రోత్సహిస్తున్నదనే ఆరోపణలున్నా, పార్టీలు దృఢంగా ఉంటే ఏం చేయగలుగుతుందనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఉద్ధవ్ శివసేనలో చీలిక వార్తలు వినిపిస్తున్న తరుణంలోనే సమాజ్‌వాదీపార్టీ, శరద్‌పవార్ ఎన్సీపీలో కూడా చీలికలు రాబోతున్నాయనే వార్తలు గుప్పుమన్నాయి. ఎన్సీపీలోని అంతర్గత విభేదాలవల్ల దాదాపు 25మంది ఎంపీలు గోడ దాటే ప్రయత్నం చేస్తున్నట్లుగా వినిపిస్తోంది. అలాగే శరద్ ఎన్సీపీలో 8మంది ఎంపీలుండగా, ఐదుగురు ఫ్లేటు ఫిరాయించవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఏక్షణంలో ఏదైనా జరగవచ్చు. రాజకీయ పరిణామాలుహఠాత్తుగా సంభవిస్తున్నాయి. గోడమీద పిల్లులు ఎక్కువవుతున్నాయి. ఇండియా కూటమిబలపడకుండా చేయడమనే వ్యూహం కూడా ఈ పరిణామాల వెనుక ఉండవచ్చు. ఏదిఏమైనా ప్రాంతీయ పార్టీలకు ఇది చీలికల కాలమనే అనుకోవాలి. ●

---

దేశం

బొలీవియా

# అట్టుడుకుతున్న అంతర్గత సంక్షోభం

**గన్ని మోహన్**

అశాంతి, అల్లర్లు, విధ్వంసం రాస్తారోకో దిగ్బంధనాలతో అట్టుడికిపోతున్న దేశాల్లో ఇప్పుడు దక్షిణ అమెరికా దేశం బొలీవియా కూడా చేరింది. ఐదుదేశాల సరిహద్దులున్న ఈ చిన్న దేశంలో అధ్యక్షుడు తక్షణమే రాజీనామా చేయాలన్న ఏకైక డిమాండ్‌తో 40రోజులుగా జరుగుతున్న ఆందోళనఉధృత రూపం దాల్చడంతో దేశం మొత్తం అత్యవసర స్థితిని ప్రకటించారు. అధ్యక్షుడు రోడ్రిగో పాజ్ ఎన్నికై కేవలం ఆరునెలలే అయినప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలోఘోరంగా విఫలమయ్యారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ విస్మరించారని పేర్కొంటూ ఆయన అధ్యక్ష పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని తక్షణమే దిగిపోవాలంటూ నిరసనకారులు అందోళనలు చేస్తున్నారు. రాజధాని లాపాజ్, టిలాటా, ఇంగావి ప్రావిన్స్, ఎల్ ఆల్టో వంటినగరాల్లో ఆందోళనకారులు రహదారులన్నింటినీ మూసివేయడంతో ఇతర ప్రాంతాలతో ఈ నగరాలు కటాఫ్ అయ్యాయి. దేశవ్యాప్తంగా ఆహారం, మందులు, నిత్యావసరసరుకుల రవాణాకు తీవ్రమైన ఆటంకాలు ఏర్పడటం, ఇంధన కొరత కూడా పతాకస్థాయికి పెరిగిపోయి సంక్షోభంలోకి నెట్టివేసింది. నిత్యావసర వస్తువులు అందుబాటులోకి రావడంలేదు. దేశంలో రాజకీయ ఆర్థికసంక్షోభం మరింతగా ముదురుతుండటంతో ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకే అత్యవసర స్థితి విధించాల్సి వచ్చిందని, చర్చలకు వారు అంగీకరించడం లేదని ప్రభుత్వ వర్గాలు ప్రకటించడంతో ఆందోళనలు మరింత ఉధృతం అయ్యాయి. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, వేతనాలు తక్కువగాఉండటంతో ప్రజల్లో అసంతృప్తి పేరుకునిపోయింది. తమ మద్దతుతో ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన అధ్యక్షుడు తమ సమస్యలు పెడచెవిన పెట్టారని నిరసనకారులు ఆక్రోశిస్తున్నారు. ఏడునెలలకాలంలోనే అధ్యక్షుడు రోడ్రిగోపాజ్‌పై పతాకస్థాయిలో అసమ్మతి రాజుకుంది. ప్రతిపక్ష కుట్రఅనేందుకు కూడా వీలులేని విధంగా దేశంమొత్తం రైతులు, కార్మికులు, ఉద్యోగులు అందరూ ఆందోళనల్లో పాల్గొనడంతో పాజ్‌కు గడ్డుపరిస్థితులు ఏర్పడ్డాయి. బొలీవియాలో రెండుదశాబ్దాలపాటు అధికారంలో ఉన్న మూవ్‌మెంట్‌టు వార్డ్ సోషలిజం ఎంఎఎస్ పార్టీ పాలనకు ముగింపు పలికి అధ్యక్షుడు రోడ్రిగో పాజ్‌కు పట్టం కట్టారు. కానీ పాలనలోకి వచ్చి ఏడునెలలు అవుతున్నా ప్రజామోదయోగ్యమైన పనులు ఏ ఒక్కటీ చేపట్టలేదన్న అక్కసుప్రజల్లో పెరిగిపోయింది. గతంలో సైనిక చర్యల కారణంగా పలువురు బొలీవియా అధ్యక్షులు పదవులు కోల్పోయారు కూడా. ఇప్పుడు అత్యవసరపరిస్థితి అమలుకు వస్తే పాజ్ పరిస్థితి కూడా అదే అవుతుందన్న భావన కూడా అధికార పార్టీలో వ్యక్తం అవుతోంది. బ్రెజిల్, పరాగ్వే, పెరూ, చిలీ దేశాల సరిహద్దులతో ఉన్న బొలీవియా దిగువ మధ్యాదాయ దేశాల జాబితాలో ఉంది. తలసరి జిడిపి 4421 డాలర్లు మాత్రమే. జిడిపి కూడా 80.74 బిలియన్‌డాలర్లు. దేశ జనాభా కూడా 12.7 మిలియన్ల మందిమాత్రమే



రోడ్రిగో పాజ్

ప్రతి చదరపు కిలోమీటరుకు 10.5 మంది మాత్రమే నివసించే వీలున్న ఈ చిన్నదేశంలో ఒక్కసారిగా ప్రజల్లో పాలకులపై అసమ్మతి రాజుకుంది. ఇంధన ధరలు స్థిరీకరించాలని, అనవసర భూసంస్కరణలు రద్దుచేయాలన్న డిమాండ్లతోపాటు వేతనాలు పెంచాలని, ఇంధనం, డాలర్ నిధుల కొరతను అరికట్టాలని కోరుతూ పాజ్ తక్షణమే రాజీనామా చేయాలని పట్టుబడుతున్నారు. నిరసనలకు పాల్పడుతున్న గ్రూపుల్లో అత్యధిక శాతం మాజీ వామపక్ష అధ్యక్షుడు ఇవో మోరేల్స్‌కు చెందినవారే ఉన్నారని రోడ్రిగో వర్గం ఆరోపిస్తోంది. దేశంలోని సుమారు 90 రహదారులన్నింటినీ దిగ్బంధనం చేయడంతోనే సంక్షోభం పతాకస్థాయికి చేరకుండా కట్టడిచేయాల్సి వస్తోందని పాజ్ చెపుతున్నారు. అయితే ఆందోళనకారులు మాత్రం పాజ్ దిగిపోయేంతవరకూ తగ్గేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. పరిస్థితులను చూస్తుంటే అత్యవసరస్థితి నిబంధనలు ఉల్లంఘించేటట్లు కనిపిస్తున్నది. ఇక సైనిక చర్య తప్పదన్న భావన కూడా ప్రభుత్వంలో ఉంది. అదే జరిగితే గత అధ్యక్షులకు ఎదురయినఉద్వాసన పరిస్థితులే రోడ్రిగోను కూడా చుట్టుముడతాయని ఆదేశ రాజకీయ పండితులు నిర్వచిస్తున్నారు. గతంలోని వామపక్ష అధ్యక్షుడు దేశంలో ఉన్న అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీని బహిష్కరించారు. ఆ తర్వాత 18ఏళ్లకు ఇప్పుడు బొలీవియా యుఎస్‌తో కలిసి డ్రగ్స్ మాఫియా కట్టడికి సంయుక్త కార్యాచరణ అమలు చేస్తున్నది. దీనితో ఇప్పుడు నిరసనల్లో డ్రగ్ కార్టెల్ హస్తం కూడా ఉండి ఉంటుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో అధ్యక్షుడు పాజ్‌కు పరిసరాల్లోని చిన్న దేశాల మద్దతు సంపూర్ణంగా ఉంది. ఎలాంటి పరిస్థితుల్లో అయినా కూడా బొలీవియాకు అండగా నిలుస్తామని వారంతా గత ఫ్లోరిడా సదస్సులోనే పాజ్‌కు భరోసా ఇచ్చారు. కొకైన్ తయారీలో ఉపయోగించే కోకాను ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో ప్రపంచంలోనే మూడో దేశంగా బొలీవియా నిలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు దేశంలో ఉన్న అంతర్గత సమస్యలను చక్కదిద్దాల్సిన బాధ్యత పాజ్ భుజాలపైనే ఉంది. ఇందుకోసం ఆయన అమెరికా, చైనా వంటి దేశాలతోపాటు అగ్ర రాజ్యాల సహకారం కూడా అనివార్యం అని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే చైనా బొలీవియాకు వాణిజ్య మిత్ర దేశంగా ఉంది. పెట్టుబడులు అధికంగా వస్తేనే ఉపాధి రంగం కుదుటపడుతుందన్నది తెలిసిందే. ఇప్పుడు ఈ దిశగా కృషిచేస్తే తప్ప బొలీవియా కొత్త అధ్యక్షుడికి పదవీగండం తప్పేటట్లు లేదని ఆందోళన ఉధృతి చెప్పకనే చెపుతోంది. అత్యవసర పరిస్థితిలో సైనిక చర్యలతో ఉక్కుపాదం మోపితే గత అధ్యక్షుల పరిస్థితే ఎదురవుతుందన్న హెచ్చరికల ను కూడా పరిగణనలోనికి తీసుకుని ఇప్పుడు రోడ్రిగో ముందుకు వెళ్లాల్సిన సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారనే చెప్పాలి. ఈ అంతర్గత సంక్షోభాన్ని పాజ్ ఎలా అధిగమిస్తారన్నది కాలమే నిర్ణయించాలి. ●

---

# అధిక సంతానంతో ఆర్థిక స్థితి చక్కబడుతుందా?

**బొల్లిముంతసాంబశివరావు**

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ప్రజలకు అమూల్యమైన్న సందేశం ఇచ్చారు. పిల్లలే కుటుంబాలకు సంపద. ప్రతి కుటుంబం నలుగురు పిల్లలను కనండి, మూడోకాన్పుకి 30వేలు, నాలుగోకాన్పుకి 40 వేలు ఇస్తానని ఆయన సందేశంలో చెప్పారు. ఎంత మంది పిల్లలను కనాలని చంద్రబాబుగారు ఎలా చెబుతారు. అది భార్యాభర్తల ఇష్టం మీద, ముఖ్యంగా స్త్రీ ఇష్టం మీద పిల్లల సంఖ్య ఆధారపడి ఉంటుంది. స్త్రీలు, పిల్లలను కనే యంత్రాలుగా ఎలా చూస్తాము! నలుగురు పిల్లలను కనమంటున్న చంద్రబాబు, తన మంత్రివర్గ సహచర కుటుంబాలను నలుగురు పిల్లలను కనమని చెప్పవచ్చు గదా! నలుగుర్ని కనమని చెబుతున్న చంద్రబాబు అంతర్యం ఏమిటి? పేదరికం, అధిక జనాభా గురించి కార్ల్‌మార్క్స్ అభిప్రాయం పేదరిక, ఆకలి నిరుద్యోగం అనేది జనాభా పెరుగుదల వల్ల కాదని, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని అసమానతల వల్ల వస్తోందని కార్ల్‌మార్క్స్ ప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రామికులు పేదరికంలో ఉంటారు. తమ కుటుంబానికి ఆసరాగా శ్రామిక కుటుంబాల పిల్లలను కంటారు. పెట్టుబడిదారులు లాభాలను గడించడానికి యంత్రాలు ఉపయోగిస్తారు. ఫలితంగా కార్మికులకు పని దొరకని కారణంగా నిరుద్యోగులుగా మారతారు. ఈ నిరుద్యోగ సైన్యాన్ని ఉపయోగించి కార్మిక వేతనాలను తగ్గించి లాభాలు పెంచుకుంటారని పేర్కొన్నారు. జనాభా పెరుగుదల గురించి మార్క్స్ అభిప్రాయానికి భిన్నంగా అంబేద్కర్ అభిప్రాయం ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థకు, పేదరిక నిర్మూలనకు జనాభా పెరుగుదల పెద్ద అడ్డంకిగా ఆయన భావించారు. కుటుంబ నియంత్రణను, చిన్న కుటుంబాలను గట్టిగా సమర్థించారు. జనాభాని నియంత్రించకుండా పేదరికాన్ని రూపు మాపడం అసాధ్యమన్నారు. జనాభా నియంత్రణకు క్లినిక్లు ఏర్పాటు చేయాలన్నారు. పేదరికం గురించి కార్ల్మార్క్స్ ఇలా చెప్పారు. పేదరికం అనేది వ్యక్తిగత వైఫల్యం లేదా వనరుల కొరత కాదు. అది పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికవర్గంపై పెట్టుబడిదారులు చేసే దోపిడీకి ప్రత్యక్ష ఫలితం. సమాజంలో పరిశ్రమలు, భూమి వంటి ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది పెట్టుబడిదారుల, భూస్వాముల చేతుల్లో కేంద్రీకృతమై ఉంటాయి. వీటిని కోల్పోయిన తమ జీవనం కోసం తన శ్రమను అమ్ముకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతుంది. తానుఉత్పత్తి చేసే విలువలో కొంత భాగం మాత్రమే వేతనంగా అందుతుంది. మిగిలిన అదనపు విలువను పెట్టుబడిదారుడు దోచుకుంటాడు. ఫలితంగా కార్మికుడు నిరంతరం పేదరికంలో ఉంటాడు. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందే కొద్దీ సంపద కొద్ది మంది వద్దే పోగవుతుంది. కార్మికుడి పరిస్థితి మరింత దిగజారుతుంది. మరింత పేదరికాన్ని ఎదుర్కొంటాడు. పరిశ్రమలు, భూమి, సహజ వనరులు సమాజంపరమైతేనే పేదరికం తొలుగుతుంది. అంబేద్కర్, పేదరికానికి అధిక జనాభా కారణమని, జనాభాని నియంత్రించాలని చెప్పారు. సంపద కేంద్రీకరణ గురించి గాని, పరిశ్రమలు, భూమిపై కార్మికులకు, గ్రామీణ పేదలకు హక్కు ఏర్పడితేనే పేదరికం పోతుందనిచెప్పలేదు. జనాభా పెరుగుదల వస్తువుల వినియోగదారుడిగా, శ్రామికుడిగా కీలక పాత్రపోషిస్తుంది. జనాభా పెరిగే కొద్దీ మార్కెట్లో శ్రామికుల సంఖ్య పెరుగుతుంది. దానివల్ల పెట్టుబడిదారులు తక్కువ వేతనాలకే కార్మికులను నియమించుకునే అవకాశం ఏర్పడుతుంది. పెట్టుబడిదారులు ఉత్పత్తిచేసే వస్తువుల కొనుగోలుకు జనాభా అవసరం. జనాభా పెరిగేకొద్దీ మార్కెట్ పరిమాణం విస్తరించి లాభాలు పెరుగుతాయి. అందుకే పెట్టుబడిదారులకు పేదల జనాభా పెరుగుదల అవసరం. పేదరికం, జనాభా పెరుగుదల గురించి మార్క్స్ చెప్పిన నిర్వచనం భారతదేశానికి సరిపోతుంది. అధికార మార్పిడి జరిగిన నాటి నుంచి నేటి వరకు పాలక ప్రభుత్వాలు అనుసరించిన, అనుసరిస్తున్న సామ్రాజ్యవాద, బడా పెట్టుబడిదారుల అనుకూల విధానాల వల్ల దేశ సంపద అత్యధిక భాగం అతికొద్దిమంది వద్ద పోగుబడి ఉంది. నిరుద్యోగం ,ఉపాధిలేమి, చాలీచాలని వేతనాల వల్ల



అత్యధిక మంది పేదలు పేదరికాన్ని అనుభవిస్తున్నారు. పారిశ్రామిక వేత్తల దోపిడీకి గురవుతున్నారు. పేదకుటుంబాలు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థికపరిస్థితుల్లో, పిల్లలను కూడా కుటుంబ పోషణలో భాగస్వాములను చేస్తున్నారు. పిల్లలను చదువుకి, ఆటలకు దూరం చేసి పనులకు పంపుతారు. వారి ద్వారా లభించే ఆదాయం కూడా కుటుంబ ఆర్థిక పరిస్థితుల్లో ఏమార్పు తీసుకురాలేదు. పిల్లలకు సమకూర్చే ఆర్థిక చేయూత కన్నా కుటుంబ ఖర్చు ఎక్కువగా ఉంటుంది కాబట్టి, కుటుంబాల ఆర్థిక సంక్షోభం, పేదరికం కొనసాగుతూనే ఉంటుంది. పేద కుటుంబాల అధిక సంతానం వల్ల శ్రామికుల సంఖ్య పెరుగు తుందేగాని, సంపద చేకూరదు. శ్రామికులకు ఉద్యోగ, ఉపాధి కల్పించలేని ప్రభుత్వ విధానాల వల్ల, ప్రభుత్వసంస్థలను ప్రైవేటు చేయడం, మూసివేయడం వల్ల నిరుద్యోగం తీవ్రం అవుతుంది. ఫలితంగా నిరుద్యోగ సైన్యం పెరిగింది. పారిశ్రామిక వేత్తలకు చౌకగా శ్రామిక శక్తి మార్కెట్లో దొరుకుతుంది. పేదకుటుంబాల పిల్లలు బాలకార్మికులుగా మారుతారు. చౌకగా శ్రామిక శక్తి దొరకటం వల పారిశ్రామికవేత్తలకు ఎక్కువ లాభాలు వచ్చి, వారి సంపద పెరుగుతున్నది. పారిశ్రామికవేత్తల అధిక లాభాల కోసం కార్మిక హక్కులు హరిస్తూ కేంద్ర ప్రభుత్వం చట్టాలను చేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన నలుగురు సంతానం వల్ల పారిశ్రామిక వేత్తలకు శ్రామికులు చౌకగా దొరకడానికి, వారి సంపద పెరగటానికి ఉపయోగపడుతుంది. పేదలకు సంపదసృష్టి లేకపోగా, కుటుంబానికి మరింత భారం పెరుగుతుంది. 1975లోఎమర్జన్సీ విధించబడింది. జనాభా నియంత్రణ కోసమంటూ సంజయ్గాంధి, బలవంతంగా విచ్చలవిడిగా, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాడు. నలుగురు పిల్లలను కనడం కోసం చంద్రబాబు ప్రభుత్వం కుటుంబాలపై వత్తిడి పెడుతుందా! జనాభా పెరగకపోవడం మంచిది కాదని, ఇద్దరికి మించి పిల్లలను కనాలని 2019లో అమరావతి సమీపంలో నేలపాడులో నిర్వహించిన పసుపు, కుంకుమ కార్యక్రమంలో చంద్రబాబు మహిళలకు పిలుపు ఇచ్చారు. మోడీ నాయకత్వాన ఎన్డిఎ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి దేశంలో మతవిద్వేషాలు ఎక్కువ అయ్యాయి. ముస్లింల జనాభా పెరుతుందని, హిందువులు కూడా ఎక్కువ మంది పిల్లలను కనాలని, కొంత మంది నాయకులు మాట్లాడుతున్నారు. కర్ణాటకలోని ఉడిపిలో హిందూ పరిషత్ ఆధ్వర్యాన జరుగుతున్న ధర్మ సంపద్కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సాధారణ ఎన్నికల ప్రచారంలో సంపద సృష్టించి పథకాల అమలుతో పాటు, పేదరికాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తానని, ఉద్యోగ, ఉపాధి కల్పిస్తానని ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చి రెండుసంవత్సరాలు పూర్తి అవుతూ ఉంది. సంపద సృష్టిలేకపోవడమే కాకుండా 3.5 లక్షలకోట్ల రూపాయలకుపైగా అప్పును మాత్రం చంద్రబాబు సృష్టించారు. సంవత్సరానికి ఐదులక్షల ఉద్యోగాలు కల్పిస్తాననిచెప్పి, కల్పించకపోగా, ఉన్నఉద్యోగాలనే ఊడబెరుకుతున్నారు. ఫలితంగా పేదరికం నిరుద్యోగం పెరుగుతూ ఉంది. అమలు సాధ్యంకాని పీ 4పథకం ద్వారా పేదరికాన్ని తొలగిస్తానని చెప్పారు. ఆచరణలో విఫలం అయింది. ఇప్పుడు ఆ పథకం గురించి మాట్లాడటం లేదు. చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం, తాను చేసిన వాగ్ధానాలను అమలు చేయడంలో విఫలంఅయ్యింది. రెండు లేక మూడు వాగ్ధానాలను అరకొరగా మాత్రమే అమలు జరిపింది. రెండుసంవత్సరాలుగా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు 15 వందలు ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదు. విద్యార్థుల ఫీజురీయింబర్స్‌బెంట్ బకాయిలు ఇవ్వలేదు. ఆరోగ్య శ్రీ పథకానికి ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో, ప్రైవేట్హాస్పటల్స్ ఆరోగ్యశ్రీ పథకాన్ని నిలిపివేశాయి. ఎన్టీఆర్ రైతు భరోసా మొదటి ఏడాది రైతులకు ఇవ్వలేదు. రైతుల పంట కొనుగోళ్ల బాధ్యత తీసుకోలేదు. అందరికీ విద్యా, వైద్యం అందిస్తానని చెప్పి, ఆరెంటినీ ప్రైవేటీకరణ చేస్తున్నది. మెడికల్కాలేజీలను, పోర్టులను పీపీపీ పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తున్నది. ఫలితంగా ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతను దారి మళ్లించడానికి, పారిశ్రామికవేత్తలను శ్రామిక శక్తిని చౌకగా అందించడానికి నలుగురు పిల్లల అంశాన్ని ముందుకు తెచ్చారు. ●

# డిఎంకెతో పొత్తుకు ఐయుఎంఎల్ గుడ్ బై

## తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామం

## సిఎం విజయ్ టివికెకు ఐయుఎంఎల్ మద్దతు

**చెన్నై,జూన్ 20:** తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. డిఎంకెకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. అటు అన్నాడిఎంకే నుంచి సొంత ఎమ్మెల్యేలు పార్టీ వీడుతుంటే ఇటు డిఎంకే నుంచి మిత్రపక్షాలు దూరం అవుతున్నాయి.టివికెకు మద్దతు కారణంగా కాంగ్రెస్ డిఎంకే మధ్య బంధం తెగిపోయింది. ఇక 1962 నుంచి డిఎంకేతో కలిసి రాజకీయ ప్రయాణం చేస్తున్న ఇండియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) గుడ్ బై చెప్పింది. విజయ్‌తో కలిసి తమ రాజకీయ ప్రయాణం కొనసాగించాలని నిర్ణయించింది.

తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ కాలంగా అధికార ద్రావిడ మున్నేట్ర కజగం (డిఎంకే) కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఆ కూటమికి గుడ్ బై చెప్పటం సంచలనంగా మారుతోంది. ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఎన్నికలకే పరిమితం కాకుండా సామాజిక సమీకరణాల్లోనూ ప్రముఖ పాత్ర పోషిస్తూ వచ్చింది. గత కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న తీవ్ర భేదాభిప్రాయాలు, శ్రేణుల మధ్య అసంతృప్తి చివరకు కూటమి నుంచి శాశ్వత ఉపసంహరణకు దారితీశాయి. ఒక బలమైన మైనారిటీ భాగస్వామిని కోల్పోవడం అధికార డిఎంకే శ్రేణులకు గట్టి ఎదురుదెబ్బగానే విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

ఎన్నికల్లో సీట్ల కేటాయింపు విషయంలో తలెత్తిన జటిలమైన సమస్యలుగా తెలుస్తోంది. విజయ్ కేబినెట్‌లో చేరటంతో గత కొంత కాలంగా జరిగిన ఎన్నికల్లో ముస్లిం లీగ్ ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కలేదు. ఐయుఎంఎల్ బలంగా ఉన్న ఉత్తర మరియు దక్షిణాది జిల్లాల్లో డిఎంకే స్థానిక నేతల పెత్తనం పెరగడం ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఆగ్రహాన్ని కలిగించింది.

మరోవైపు, పార్టీ సీనియర్ల అభిప్రాయం ప్రకారం, ఐయుఎంఎల్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా డిఎంకే ప్రవర్తించడం కూడా ఈ నిర్ణయానికి దారితీసింది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లింలీగ్ మూడు స్థానాల్లో పోటీ చేసి రెండు సీట్లు గెలుచుకుంది.

విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతుగా నిలిచిన సమయంలో డిఎంకేతో కొనసాగటం పైన సందేహాలు మొదలయ్యాయి.

ముస్లిం లీగ్ ఎమ్మెల్యే ఏ.ఎం. షాజహాన్ టివికె ప్రభుత్వంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు చేపట్టారు. డిఎంకెతో దశాబ్దాలుగా ఉన్న స్నేహాన్ని వదులుకోవడం కష్టమైనప్పటికీ, రాష్ట్రంలో వచ్చిన రాజకీయ మార్పులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐయుఎంఎల్ జాతీయ అధ్యక్షుడు కె.ఎం. ఖాదర్ మొహిదీన్ స్పష్టం చేశారు.





# దక్షిణ లెబనాన్‌పై ఆగని ఇజ్రాయెల్ దాడులు

## మరో ఐదుగురి మృతి, పలు ఇళ్లు, కార్యాలయాలు ధ్వంసం

**బీరూట్,జూన్ 20:** పశ్చిమాసియాలో యుద్ధాన్ని నివారించి ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి అమెరికా సిద్ధమవుతుంటే ఈ ప్రయత్నాలకు ఇజ్రాయెల్ గండికొడుతోంది. లెబనాన్‌పై వరుసగా దాడులు చేస్తోంది. శనివారం కూడా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌పై ఈ రోజు ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఐదుగురు మరణించారు. హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే ఇజ్రాయెల్ దాడికి దిగడం విశేషం. ఈ దాడిపై లెబనాన్ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం దక్షిణ లెబనాన్‌లోని నబాతే జిల్లాలోని అనేక ప్రదేశాలపై ఇజ్రాయెల్ డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేక ఇండ్లు, బిల్డింగులు ధ్వంసమయ్యాయి. ఐదుగురు మరణించారు. ఫిరంగి దాడులుకూడా జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా వరుసగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. అంతకు ముందు శుక్రవారం జరిపిన దాడుల్లో కూడా 16 మంది మరణించారు. అనేకమంది గాయపడగా, పలువురు కూలిన బిల్డింగులు, ఇండ్ల శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఇజ్రాయెల్ దాడులపై అమెరికా ఆగ్రహంగా ఉంది.

ఒకపక్క ఇరాన్‌తో అమెరికా శాంతి ఒప్పందం కుదుర్చుకుని, యుద్ధాన్ని ముగించాలని భావిస్తుంటే.. ఇజ్రాయెల్‌మాత్రం ఇరాన్ మిత్రదేశమైన లెబనాన్‌పై దాడులు చేస్తోంది. అక్కడ ఇరాన్ మద్దతుతో నడుస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద శిబిరాల్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడి చేస్తోంది. ఈ దాడుల్ని ఇరాన్ ఖండిస్తోంది. ఇజ్రాయెల్ వైఖరి కారణంగా, స్విట్జర్లాండ్‌లో ఇరాన్, అమెరికా మధ్య జరగాల్సిన తుదిదశ చర్చలు కూడా వాయిదాపడ్డాయి. దీంతో ఇజ్రాయెల్ వైఖరిపై అమెరికా ఆగ్రహంగా ఉంది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహుతో ట్రంప్ మాట్లాడారు. శాంతి ఒప్పందం సమయంలో కాస్తబాధ్యతతో వ్యవహరించాలని నెతన్యాహుకు ట్రంప్ సూచించారు. దాడుల్ని వెంటనే ఆపాలనికోరారు. ట్రంప్ మాటల్ని లెక్కచేయకుండా ఇజ్రాయెల్ మాత్రం దాడులు చేస్తూనే ఉంది.

# నీట్ విద్యార్థి ఆత్మహత్య



**ఘజియాబాద్,జూన్ 20:** ఉత్తర ప్రదేశ్‌లోని ఘజియాబాద్ విజయ్‌నగర్ పరిధిలో గుండెల్ని పిండేసే మరో విషాదకర ఘటన వెలుగు చూసింది. నీట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న జతిన్ కుమార్ అనే 22 ఏళ్ల విద్యార్థి మానసిక ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. జతిన్ తన తల్లిదండ్రులకు ఉన్న ఒకే ఒక్క కుమారుడు. కాగా, అతని తండ్రి రాజేష్ కుమార్ సహారన్‌పూర్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మెడికల్ సీటు సాధించడమే లక్ష్యంగా శ్రమిస్తున్న జతిన్‌కు 2026 మే నెలలో జరిగిన నీట్ పరీక్ష ఐదో ప్రయత్నం. ఆ పరీక్ష ముగిసినప్పటికీ, మళ్లీ జరగబోయే నీట్ పరీక్ష కోసం అతను విజయ్‌నగర్ సెక్టార్9లోని తన గదిలో ఉంటూ తిరిగి ప్రిపరేషన్ సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయం వరకు తన గదిలో చదువుకుంటూనే ఉన్నాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు అతడిని నిద్ర లేపడానికి గదిలోకి వెళ్లేసరికి జతిన్ నిర్జీవంగా ఫ్లోర్‌పై పడి ఉండటం చూసి తల్లడిల్లిపోయారు. ఉరివేసుకున్న సమయంలో ఫ్యాన్‌కుకట్టిన తాడు తెగిపోవడంతో మృతదేహం కింద పడినట్లు గుర్తించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సిటీ కొత్వాలీ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఉపాసన పాండే, విజయ్‌నగర్ పోలీసులు, ఫోరెన్సిక్ బృందంతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

# ఆలయంపైకప్పు కూలి ఆరుగురు మృతి

## శిథిలాలకింద 20 మంది భక్తులు



**పర్బని, జూన్ 20:** మహారాష్ట్రలోని పర్భనీ జిల్లాలో ఉన్న యశ్వాడి ఆలయంలో ఇవాళ ఓ అపశృతి చోటు చేసుకుంది. ఆలయ నిర్మాణ పనులు జరుగుతుండగా గర్భాలయం ముందున్న పైకప్పు ఉన్నట్లుండి ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న భక్తులపై ఈ కప్పు శిధిలాలు పడిపోయాయి. దీంతో సుమారు 40 మంది భక్తులు శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. వెంటనే అధికారులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఆలయం పైకప్పు కూలిన ఘటనలో భారీగా భక్తులు చిక్కుకుపోయినట్లు తెలియడంతో హుటాహుటిన అధికారులు అక్కడికి చేరుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పర్భనీ జిల్లా సివిల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఆలయం ఛత్రపతి శంభాజీనగర్ నుండి సుమారు 190 కిలోమీటర్ల దూరంలో ఉన్న యశ్వాడి గ్రామంలో ఉంది. శనివారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో ఆలయ సభా మండపం (బయటి హాలు) పైకప్పు కూలిపోయిందని పోలీసులు తెలిపారు. పోలీసులతో పాటు జిల్లా యంత్రాంగం తమ బృందాలను ఘటనా స్థలానికి పంపాయయన్నారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అయితే ఈ ఘటనలో ఇప్పటివరకూ ఆరుగురు చనిపోయినట్లు తెలుస్తోంది. మిగతా వారిని రక్షించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి.

అయితే, ఘటనా స్థలం నుంచి వెలువడిన ఫోటోలు, వీడియోల ఆధారంగా మండపం నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని జిల్లా అధికారులు తెలిపారు. ఘటనా స్థలాన్ని బ్లాక్ చేసి సహాయక చర్యలను ముమ్మరం చేశారు.. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. హనుమాన్ ఆలయం ఉండటం, శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు కార్యక్రమం జరుగుతుండగా, మండపం పైకప్పు అకస్మాత్తుగా కూలిపోయింది. ఘటనా స్థలంలో పెద్ద సంఖ్యలో భక్తులు ఉండడంతో ఆరుగురు మృతిచెందారు మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందనిఅధికారులు చెబుతున్నారు.

# శ్రీరాముని విగ్రహం నిలిపివేతపై వెల్లువెత్తిన నిరసన

**ఢాకా,జూన్ 20:** ఒక ఫోటో చుట్టూ మొదలైన వివాదం ఇప్పుడు దేశవ్యాప్త ఉద్యమంగా మారుతోంది. బంగ్లాదేశ్‌లో రాముడి విగ్రహ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఇస్లామిక్ వర్గాలు చేసిన చర్యలు హిందూ సమాజంలో తీవ్ర ఆగ్రహం రేపాయి. రాముడి చిత్రాన్ని అవమానించారనే ఆరోపణలతో వేలాది మంది హిందువులు శుక్రవారం ఢాకావీధుల్లోకి వచ్చారు. జై శ్రీరామ్ నినాదాలతో భారీ ర్యాలీలునిర్వహించారు. ఢాకాలోని షాబాగ్ ప్రాంతం నిరసనకారులతో కిక్కిరిసిపోయింది. రాముడి చిత్రాన్ని అవమానించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల ప్రారంభంలో గైబంధా జిల్లాలో జరిగిన ఓ నిరసన కార్యక్రమంలో కొందరు మత ఛాందసవాదులు రాముడి చిత్రంపై చెప్పు ఉంచారని హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదైనా ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని అంటున్నాయి. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ 72 గంటలగడువు విధించాయి. అప్పటిలోగా చర్యలు తీసుకోకపోతే మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించాయి. ఉత్తర బంగ్లాదేశ్‌లోని పలాష్‌బారిలో 81 అడుగుల ఎత్తుతో రాముడి విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఇది పూర్తైతే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రాముడి విగ్రహంగా నిలిచేది. దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఆలయ సముదాయంలో 50 అడుగుల కృష్ణుడి విగ్రహం, 30 అడుగుల శివుడి విగ్రహం కూడా నిర్మించాలనే ప్రణాళిక ఉంది.విగ్రహ నిర్మాణానికి వ్యతిరేకంగా కొన్ని ఇస్లామిక్ సంస్థలు బెదిరింపులకు దిగినట్లు ఆలయ కమిటీ చెబుతోంది. ఓ మత బోధకుడు బుల్డోజర్‌తో విగ్రహాన్ని కూల్చేస్తానని హెచ్చరించాడని ఆరోపించింది. దీంతో శాంతి భద్రతల దృష్ట్యా పనులు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. వివాదాలు వద్దనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

విగ్రహ నిర్మాణానికి అడ్డంకులు తొలగించకపోతే, బంగ్లాదేశ్‌లోని 64 జిల్లాల్లో ఒక్కో రామాలయం నిర్మిస్తామని హిందూ మహాజోట్ ప్రకటించింది. శనివారం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించనున్నట్లు పూజా ఉత్సవాల జాతీయ కమిటీ తెలిపింది. దీంతో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. బంగ్లాదేశ్ జనాభాలో హిందువులు సుమారు 8 శాతం మంది ఉన్నారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 133 సామాజిక, మత ఘర్షణల ఘటనలు నమోదైనట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి.

# ఐఇడి బాంబులు పేలి ఏడుగురు మృతి

## ముగ్గురికి గాయాలు

**పెషావర్, జూన్ 17:** పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫుక్తున్వా ప్రావిన్సులో పేలుళ్ల ఘటన జరిగింది. బన్నూ జిల్లాలోని మర్యా బేరే ఏరియాలో రోడ్డుపై నాటిన ఐఇడి బాంబులు పేలాయి. ఈ ఘటన ఏడు మంది మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. అయితే ఇప్పటి వరకు ఏ గ్రూపు కూడా పేలుళ్లకు బాధ్యత ప్రకటించలేదు. బన్నూ జిల్లా పోలీసు అధికారి మాట్లాడుతూ.. రోడ్డుపై నాటిన ఐఇడి పేలడం వల్ల ఓవ్యాన్‌లో వెళ్తున్న వారిలో అయిదుమంది మృతిచెందారు. రెస్క్యూ మిషన్‌లో భాగమైన మరో వాహనం కూడా ఐఇడి పేలుడుకు లోనైట్లు పోలీసు అధికారి చెప్పారు. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మృతుల దేహాలను, గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించారు. హాథీ కేల్ గ్రామం నుంచి బన్నూ సిటీకి వెళ్తున్న ప్రయాణికుల వ్యాన్‌ను టార్గెట్ చేస్తూ ఐఇడి పేలుడు జరిగింది.ఆ ప్రాంతాన్ని సెక్యూర్టీ దళాలు, పోలీసులు చుట్టుముట్టారు. బ్లాస్ట్ సైట్ నుంచి ఆధారాలను సేకరించారు. సిఎం సోహేల్ అఫ్రిదీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

# ఫిక్స్‌డ్‌డోస్ కాంబినేషన్ మందులపై నిషేధం



**న్యూఢిల్లీ,జూన్ 20:** దేశంలో రోగుల భద్రతను బలోపేతం చేయడం, ఔషధాల హేతుబద్ధ వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ మందుల తయారీ, అమ్మకం, పంపిణీపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ వెల్లడించింది. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం, 1940లోని సెక్షన్ 26ఏ కింద ఈ నిషేధాన్ని విధించారు. భారత మార్కెట్‌లో అందుబాటులో ఉన్న ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ మందులపై సమగ్ర సమీక్ష జరపాలని సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ మందులను కలిపి ఒకే ఔషధంగా తయారు చేయడాన్ని ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ అంటారు. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (టిడిఎబి) ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దేశంలోని వివిధ ఎఫ్‌డిసి మందులపై ఈ కమిటీ లోతైన శాస్త్రీయ విశ్లేషణ జరిపింది. వాటి భద్రత, సమర్థత, చికిత్సా విలువలను అంచనా వేసింది. ఈ సమీక్షలో 16 రకాల ఎఫ్‌డిసి మందులకు సరైన చికిత్సాపరమైన హేతుబద్ధత లేదని, వాటిని వాడటం వల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని కమిటీ తేల్చింది. ఈ మందుల వల్ల కలిగే ప్రయోజనాల కంటే వాటితో ముడిపడి ఉన్న నష్టాలే ఎక్కువగా ఉన్నాయని తన నివేదికలో పేర్కొంది. నిపుణుల కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఈ 16 మందులను నిషేధించాలని నిర్ణయించింది. నిషేధిత మందుల జాబితాలో కొన్ని చర్మ సంబంధిత (డెర్మటలాజికల్) ఉత్పత్తులు, నొప్పి నివారణ మందులు, కడుపునొప్పిని తగ్గించే యాంటిస్పాస్మోడిక్ డ్రగ్స్‌తో పాటు కొన్ని యాంటీబయాటిక్ ఆధారిత ఫార్ములేషన్లు కూడా ఉన్నాయి.

# జనరల్‌బోగీలో ప్రయాణీకుడిని చితకబాదిన తోటిప్రయాణీకులు

**న్యూఢిల్లీ,జూన్ 20:** రాజధానిలోని షాదరా రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కే క్రమంలో జరిగిన ఘర్షణ ఒక ప్రయాణికుడి ప్రాణాలను బలితీసుకుంది. ప్లాట్ ఫారమ్ నంబర్3పై యోగా ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలోకి ఎక్కేందుకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని కొందరు తోటి ప్రయాణికులు అత్యంత దారుణంగా కొట్టి చంపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్‌కు చెందిన పంకజ్ ధామా అనే వ్యక్తి హరిద్వార్ వెళ్లేందుకు ఉదయం 6గంటల ప్రాంతంలో షాదరా స్టేషన్‌కు చేరుకున్నాడు. యోగా ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారమ్ పైకి రాగానే జనరల్ బోగీలోకి ఎక్కేందుకు ప్రయాణికుల మధ్య ఒక్కసారిగా తోపులాట మొదలైంది. ఈ క్రమంలో పంకజ్‌కు కొందరు ప్రయాణికులతో స్వల్ప వివాదంతలెత్తింది. ఆగ్రహంతో ఊగిపోయిన తోటి ప్రయాణికులు పంకజ్‌పై దాడి చేసి, కిందపడేసి కాళ్లతో, చేతులతో విచక్షణారహితంగా బాదారు. ఘటనా స్థలంలో ఉన్న ఒక ఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ జోక్యం చేసుకుని పంకజ్‌ను గుంపు నుంచి విడిపించారు. ఆ తర్వాత అతడిని ప్లాట్ ఫారమ్ ఫ్లోర్‌పై లాగి అలాగే వదిలేశారు. సకాలంలో వైద్యం అందక పంకజ్ ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

# 'కాస్త నోరు మూసుకుంటారా?'

## ఇజ్రాయెల్ రాయబారి, ఐరాస ప్రతినిధి మధ్య వాగ్వాదం




**న్యూయార్క్, జూన్ 20:** ఐక్యరాజ్యసమితిలో రసాభాస చోటుచేసుకుంది. ఇజ్రాయెల్ రాయబారి, ఐరాస సెక్రటరీ జనరల్ ప్రత్యేక ప్రతినిధి మధ్య వాగ్వాదం నడిచింది. ఘర్షణల సమయంలో లైంగిక హింస నిర్మూలన అంశంపై న్యూయార్క్‌లో జరిగిన సమావేశంలో మాటల యుద్ధం చోటుచేసుకోవడంతో ఇతర సభ్యులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?**

సంక్షోభ ప్రదేశాల్లో లైంగిక హింసపై ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన వార్షిక నివేదిక వివాదాస్పదంగా మారింది. దీనిలో రష్యా, ఇజ్రాయెల్ దళాల పేర్లను కూడా చేర్చడంతో ఆ దేశాలు మండిపడ్డాయి. దాదాపు 15 యేళ్ల క్రితం మొదలైన ఈ నివేదికలో తొలిసారి ఇజ్రాయెల్ పేరును చేర్చారు. పాలస్తీనాలో ఆ దేశ దళాలు చేస్తున్న హింసకు ఫలితంగానే ఐరాస ప్రతినిధి ప్రమీలా పాటెన్ దీనిని ప్రవేశపెట్టారు. అయితే పాటెన్ పక్షపాతంతో వ్యవహరించారని, ఆమె రాజీనామా చేయాలని ఈ సమావేశంలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ డిమాండ్ చేశారు. అలాగే ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పైనా విమర్శలు గుప్పించారు. దీంతో మరో యుఎన్ ప్రతినిధి వానెస్సా ఫ్రేజియర్ స్పందించారు. సభా మర్యాద కాపాడాలని, వ్యక్తిగత దాడులకు దూరంగా ఉండాలంటూ ఆమె కాస్త అరిచి చెప్పారు. అలాగే తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. 'ఇజ్రాయెల్ ఐరాసలో సభ్య దేశం. మీరు యుఎన్‌లో పని చేస్తున్నారు. కాస్త నోరు మూసుకోండి. ఆ రిపోర్టు సిగ్గుచేటు. మీరు ఈ పదవిని ఎందుకు తీసుకున్నారో నాకు తెలుసు. మాకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారంలో మిమ్మల్ని భాగం కానివ్వబోం' అంటూ ఫ్రేజియర్‌ను ఉద్దేశించి ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. కాగా.. పాలస్తీనాలో చిన్నారుల హక్కుల ఉల్లంఘనల ఘటనలు పెరగడంపై గుటెరస్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తాజా పరిణామం చేటుచేసుకుంది.

# పాక్‌లో మీడియాకు స్వేచ్ఛ లేదు

## యుఎస్ ఉపాధ్యక్షుడు వాన్స్



**వాషింగ్టన్, జూన్ 20:** పాకిస్థాన్‌లో మీడియాకు స్వేచ్ఛ లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ అన్నారు. అందువల్లే ఇరాన్‌తోకుదుర్చుకున్న ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను విడుదల చేయడంలో జాప్యం జరిగిందని తెలిపారు. అమెరికా-ఇరాన్ డీల్‌కు ఖతార్‌తో కలిసి పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. జూన్ 15న మధ్యంతర శాంతి ఒప్పందాన్ని ట్రంప్ ప్రకటించగా. రెండు రోజుల తర్వాత ఈ ఒప్పందం అధికారిక పత్రం విడుదలైంది. పాకిస్థాన్, ఖతార్‌లో పత్రికా స్వేచ్ఛ సరిగ్గా లేకపోవడం, పారదర్శకతపై ఉన్న ఆందోళనల కారణంగానే వివరాలను విడుదల చేయడానికి వాషింగ్టన్ సమయం తీసుకుందని వాన్స్ పేర్కొన్నారు. దేశంలో భావప్రకటనా స్వేచ్ఛ, పత్రికా స్వేచ్ఛ, మత స్వేచ్ఛకు భంగం కలిగించే చట్టాలను ప్రభుత్వం అమలు చేయడాన్ని అమెరికా రాజ్యాంగం నిషేధిస్తుందని జెడి వాన్స్ పేర్కొన్నారు. పాక్‌లో అటువంటి రాజ్యాంగపరమైన రక్షణలు లేకపోవడంతోనే ఈ ఆలస్యం జరిగిందన్నారు. ఇరాన్‌తో చేసుకున్న ఒప్పందంలో ఆ దేశానికి గణనీయమైన రాయితీలు ఇచ్చే అవకాశం ఉన్నందున.. అమెరికా అవగాహన ఒప్పందం వివరాలను గోప్యంగా ఉంచుతోందని వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు.

# సంక్షిప్త వార్తలు

## లింకన్‌మెమోరియల్‌వద్ద అంతర్జాతీయ యోగా డే



**వాషింగ్టన్,జూన్ 20:** అమెరికా రాజధాని వాషింగ్టన్‌లోని చారిత్రక లింకన్ మెమోరియల్ వద్ద 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. భారత రాయబార కార్యాలయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది యోగాభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీంతో నేషనల్ మాల్ ప్రాంతం బహిరంగ యోగా శిబిరంతో కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో భారత సంతతి ప్రజలతో పాటు స్థానికులు, యోగా శిక్షకులు, యోగా పట్ల ఆసక్తి గల ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వాషింగ్టన్ మాన్యుమెంట్, రిఫ్లెక్టింగ్ పూల్ నేపథ్యంగా యోగామ్యాట్‌లు పరుచుకుని శ్వాసవ్యాయామాలు, ఆసనాలు, ధ్యానం నిర్వహించారు.

## పార్టీ వీడిన నేతలపై రౌత్ ఆగ్రహం



**ముంబయి,జూన్ 20:** మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం చెలరేగింది. శివసేన (యుబిటి) ఎంపీ సంజయ్ రౌత్ పార్టీని వీడిన నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ధారాశివ్ ఎంపీ ఓంరాజే నింబాల్కర్, హింగోలి ఎంపీ నగేశ్ పాటిల్ అస్టికర్‌లను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. పార్టీ ఇచ్చిన అవకాశాలతోనే రాజకీయంగా ఎదిగిన నేతలు ఇప్పుడు పార్టీని వీడడం ద్రోహమని రౌత్ అన్నారు. ఒకప్పుడు ఉద్ధవ్ ఠాక్రేను ఎప్పటికీ వదిలిపెట్టనని చెప్పిన నేతలే ఇప్పుడు మారిపోయారని ఎద్దేవా చేశారు. పేడలో పుట్టిన పురుగులు మళ్లీ పేడలోకే వెళ్లాయి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై కూడా రౌత్ విమర్శలు సంధించారు.

## ఉద్రిక్తతలమధ్య శివసేన 60వ వ్యవస్థాపక వేడుకలు

**ముంబయి, జూన్ 20:** శివసేన పార్టీ 60వ వ్యవస్థాపక వేడుకలు ముంబైలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతల నడుమ జరిగాయి. పార్టీ వ్యవస్థాపకుడు బాలాసాహెబ్ థాకరే ఆశయాలకు తామే అసలైన వారసులమంటూ ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గం, మాజీ సిఎం ఉద్ధవ్ థాకరే (యుబిటి) వర్గం విడివిడిగా భారీ బహిరంగసభలను నిర్వహించాయి. గోరెగావ్‌లో జరిగినసభలో ఏక్‌నాథ్ షిండే మాట్లాడుతూ విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కొన్నిరోజులుగా కొందరునేతలు తమపై గుంపులుగా మొరుగుతున్నారని, అయితే పులిఎప్పుడూ ఒంటరిగానేనడుస్తుందని, అదే అసలైన శివసేన అని వ్యాఖ్యానించారు.

## హిజాబ్ ధరించలేదని గాయనికి 74 కొరడా దెబ్బలు



**టెహ్రాన్, జూన్20:** ఇరాన్‌కు చెందిన గాయని పరాస్తూ అహ్మదీ చేసిన ఒక యూట్యూబ్ వీడియో ఫలితం 74 కొరడా దెబ్బల శిక్ష అంటూ వచ్చిన తాజా తీర్పు ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. హిజాబ్ ధరించకుండా ఆన్‌లైన్ సంగీత కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఆమెతో పాటు ప్రొడక్షన్ బృందంలోని సభ్యులకు కఠిన శిక్షలు విధించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 2024లో అహ్మదీ తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ సంగీత కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ కార్యక్రమంలో ఆమె హిజాబ్ లేకుండా, చేతులు పూర్తిగా కనిపించే నల్లటి దుస్తుల్లో పాటలు పాడింది. పురుష సంగీతకారులతో కలిసి చేసిన ఈ ప్రదర్శన సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## కోల్‌కతా ఎయిర్‌పోర్టులో గన్‌తో వ్యక్తి హల్‌చల్

**కోల్‌కతా,జూన్ 20:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా ఎయిర్‌పోర్ట్‌లో ఒక వ్యక్తి గన్‌తో హల్ చేశాడు. అక్కడి సెక్యూరిటీ సిబ్బంది అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఆ ఎయిర్‌పోర్ట్‌లో విమానం దిగినప్పుడు ఈ సంఘటన జరిగింది. ఈ నేపథ్యంలో తన భద్రతపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చేతిలో పిస్టల్ ఉన్న అతడు బిజెపి వ్యక్తి అని, ఎంతకైనా తెగించడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు. అభిషేక్ బెనర్జీ శనివారం దీని గురించి ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు.

# జయశంకర్ త్యాగాన్ని స్మరించుకున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 20:** తెలంగాణ జాతిపిత, స్వరాష్ట్ర స్వాప్నికులు ప్రొఫెసర్ కె. జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడి త్యాగాన్ని, కృషిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించు కున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలుగా ఆయన జీవితాన్ని గడిపారని గుర్తు చేసుకున్నారు. ఆ మహనీయుడి త్యా గాన్ని తెలంగాణ సమాజం, ప్రజా ప్రభుత్వం సదా గుర్తుంచు కుంటుందని తెలి పారు. ఆ మహనీయుడి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు కోసం ప్రజాప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంటుం దని స్పష్టం చేశారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ సార్ వ్యతిరేకించారని తెలిపారు. ఏపీలో విలీనంతో జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు.

# ఎస్సీ సంక్షేమ గురుకులాల్లో 550 ఖాళీలు

## సొసైటీకి నివేదికను సమర్పించిన జోనల్ అధికారులు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన గురుకులాల్లో వివిధ పోస్టులకు సంబంధించి 550 ఖాళీలు ఉన్నాయని అధికారులు లెక్క తేల్చారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇప్పటికే మంజూరైన పోస్టుల్లో ఉన్న ఖాళీలపై పూర్తిస్థాయిలో పరిశీలన చేసిన జోనల్ స్థాయి అధికారులు దానికి సంబంధించిన నివేదికను శనివారం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శికి సమర్పించారు. ఈ నివేదిక ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ గురుకులాల్లో జేఎల్ కేటగరీకి సంబంధించి 222 పోస్టులు, టీజీటీ 106 పోస్టులు, పీజీటీ 105 పోస్టులు, డీఎల్ 40 పోస్టులు, పీఈటీ, పీడీ 19 పోస్టులు, ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్ 31 పోస్టులు, హెచ్ఎస్ 9 పోస్టులు, లైబ్రేరియన్‌కు సంబంధించి 18 పోస్టులు ఖాళీ ఉన్నట్లు జోనల్ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. అయితే శాశ్వత ప్రాతిపదికన మంజూరు చేసిన ఈ పోస్టుల్లో ప్రాధాన్యతా క్రమంలో పార్ట్ టైమ్ టీచర్లతో భర్తీ చేయాలని గురుకుల సొసైటీ నిర్ణయించినట్లు అధికారవర్గాల ద్వారా వెల్లడైంది. ఇప్పటికే సొసైటీ పరిధిలో సుమారు వెయ్యికి పైగా పార్ట్‌టైమ్ ఉద్యోగులు పనిచేస్తున్నట్లు తెలియవచ్చింది. ఇప్పుడు మజూరైన శాశ్వత పోస్టుల స్థానంలో మళ్లీ పార్ట్‌టైమ్ ఉద్యోగులను నియమించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలియవచ్చింది.

# కాన్సులేట్ రోడ్డుకు ట్రంప్ పేరు ఉపసంహరించుకోవాలి

## నిరసన కార్యక్రమాలకు లెఫ్ట్ పార్టీల పిలుపు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ రోడ్డుకు ట్రంప్ పేరు ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తనిరసన కార్యక్రమాలకు లెఫ్ట్ పార్టీలు పిలుపునిచ్చాయి. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని అమెరికన్ కాన్సులేట్ వద్ద ఒక ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ పేరుతో డొనాల్డ్ ట్రంప్ అవెన్యూగా పెట్టాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపట్ల లెఫ్ట్ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల సంపదను కొల్లగొట్టడానికి నేడు అమెరికా ప్రజల మీద యుద్ధాలను రుద్దుతున్నదని, ప్రపంచ ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేస్తున్నదని వామపక్ష పార్టీల నేతలు విమర్శించారు. మనదేశం మీద ట్రంప్ ఆంక్షలు దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోడీ సహకారం తోడవటంతో దేశం నష్టపోతుందన్నారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ రహదారికి డొనాల్డ్ ట్రంప్ అవెన్యూగా పేరు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 22న బషీర్‌బాగ్‌లోని బాబూజగ్జీవన్‌రాం విగ్రహం నుండి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టాలని నిర్ణయించినట్టు వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఈ నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని లెఫ్ట్ పార్టీలు విజ్ఞప్తి చేశాయి.

# నేటితో ఇ-సెట్ వెబ్‌ఆప్షన్ల ముగింపు

## కౌన్సెలింగ్‌కు అర్హత కలిగిన అభ్యర్థులు 11,576 మంది

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఈ సెట్-2026 కౌన్సెలింగ్‌కి సంబంధించి రిజిస్టర్ చేసుకొని స్లాట్‌బుక్ చేసుకోవడానికి గడువు ముగిసింది. వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి నేడు(ఆదివారం) తుది గడువు. ఈ నెల 18 వరకు ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకొని స్లాట్ బుక్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, ఈ సెట్ అడ్మిషన్స్ కన్వీనర్ శ్రీదేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈ నెల 19తో ముగిసింది.

గడువు ముగిసే సమయానికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ హాజరైన వారిలో 11,576 మంది అర్హత కలిగిన అభ్యర్థులున్నట్టు తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమైన వెబ్ ఆప్షన్ల ప్రక్రియ నేటి(ఆదివారం)తో ముగియనుంది. ఇప్పటి వరకు 7992 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చినట్టు కమిషనర్ ప్రకటనలో తెలిపారు. మొత్తం 2,30,542 వెబ్ ఆప్షన్లు ఇవ్వగా అత్యధికంగా 350 వెబ్‌ఆప్షన్లు వచ్చినట్టు తెలిపారు. ఈ నెల 24న మొదటి విడత సీట్ల కేటాయింపు చేపట్టనున్నట్టు కమిషనర్ ప్రకటనలో తెలిపారు.

# విద్యుత్ భద్రతపై రాజీలేదు

## క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు

### ఎన్పీడిసిఎల్ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ భద్రతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్యుత్ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. అలాగే అనుమతి లేని వ్యక్తులకు ఎల్‌సీలు ఇవ్వడం తీవ్ర తప్పిదమన్నారు. అనధికారంగా ఎవరిని కూడా లైన్లు ఎక్కించి పనులు చేయించడం నేరమని అన్నారు. ఆపరేషన్ సిబ్బంది హెడ్‌క్వార్టర్స్‌లో ఉంటూ పనులు చేపట్టాలని చెప్పారు. లైన్ క్లియరెన్స్‌లు తప్పనిసరిగా ఎల్సీ యాప్ ద్వారానే జరగాలని లేని పక్షములో క్రమశిక్షణా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. ప్రాణం కంటే విలువైనది ఏది కాదని, విద్యుత్ పనులు చేపట్టే సమయంలో అన్ని భద్రతా పరికరాలు తప్పనిసరిగా వినియోగించాలని, భద్రతా నిబంధనలు పాటించని వారిపై జరిమానాలు విధించాలన్నారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ పనులు నిర్వర్తించేటప్పుడు కచ్చితంగా వన్ మినిట్ రూల్ పాటించాలని హడావుడిగా చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. ప్రతి అధికారి, ఉద్యోగి తమ పరిధిలోని విద్యుత్ నెట్‌వర్క్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రమాదభరితంగా ఉన్న డబుల్ ఫీడింగ్ పాయింట్లు, లూజ్ లైన్లు, వంగిన విద్యుత్ స్తంభాలు, తక్కువ ఎత్తులో ఉన్న లైన్లు, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలను గుర్తించి వెంటనే సరిచేయాలని సూచించారు. ప్రతి సర్కిల్ పరిధిలో ఆర్టిజన్లు, లైన్‌మెన్‌లకు విద్యుత్ భద్రతపై శిక్షణా తరగతులు నిర్వహించాలని, వినియోగదారులతో సత్ప్రవర్తనతో మెలుగుతూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వెల్లడించారు. ప్రతి ఒక్కరిలో విద్యుత్ భద్రత పరంగా మార్పు రావాలని ఆ మార్పు అందరికి దిక్సూచిగా ఉండాలన్నారు. అకస్మాత్తుగా సంభవించే భారీ వర్షాలు, ఈదురుగాలుల వలన స్థంబాలు విరిగి , లైన్లు దెబ్బ తింటున్నాయి కనుక విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని తెలిపారు. నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మోహన్‌రావు, సి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 'సర్'పై ఆందోళన వద్దు.. సహకరించండి

## ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదు

### ఏర్పాట్లపై మీడియాతో మాట్లాడిన సిఇఒ సుదర్శన్‌రెడ్డి




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 20:** రాష్ట్రంలో ఈ నెల 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం బిఆర్‌కెఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 15 నుంచి 24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుందని.. ఈనెల 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. మిస్‌అయిన వారికి ఫాం-6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబరు 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుంని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్రోల్మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదు స్పష్టం చేశారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి గణన ఫారమ్స్ (ఎన్యుమరేషన్ ఫార్మ్స్) ను పంపిణీ చేసే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ2026 కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారని తెలిపారు. గణన ఫారమ్‌ల పంపిణీ, సేకరణ కోసం బిఎల్‌ఓలు ఇంటింటికీ వచ్చినప్పుడు ఓటర్లందరూ సర్ ప్రక్రియకు సహకరించాలని సీఈవో విజ్ఞప్తి చేశారు.

# ప్రైవేటుకు వ్యతిరేకంగా యాదాద్రి పవర్ ప్లాంట్‌లో నిరసనలు

## ఆంధ్ర పెత్తనం పెరిగే ప్రమాదం

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కీలకమైన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో వివిధ విభాగాలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగులు నిరసనలకు దిగారు. విద్యుత్ ఇంజనీర్లు, ఉద్యోగులు థర్మల్ పవర్ ప్లాంట్ ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. యాష్ హ్యాండ్లింగ్, బొగ్గు హ్యాండ్లింగ్ ప్రైవేటీకరణ టెండర్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణను మిగులు విద్యుత్తు రాష్ట్రంగా చేసేందుకు ఏర్పాటు చేసిన వైటీపీఎస్‌ను ఉద్యోగుల కొరతను సాకుగా చూసి ప్రైవేటీకరణ చేయడం సరికాదన్నారు. స్థానికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించి వెంటనే టెండర్ల ప్రక్రియను రద్దు చేయాలని, లేకుంటే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇవాళ యాదాద్రి ప్లాంట్ తో మొదలైన ప్రైవేటీకరణ రేపు అన్ని పవర్ ప్లాంట్లకు విస్తరించే ప్రమాదం ఉందంటూ హెచ్చరించారు.

కాగా మూడేళ్ల కాల పరిమితితో, రూ.255 కోట్ల వ్యయంతో పవర్ ప్లాంట్ నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఈ నెల 12వ తేదీన మొదలైన టెండర్ల ప్రక్రియ 29వ తేదీన ముగియనుంది. జూలై 2 న టెండర్లు ఓపెన్ చేయనున్నారు.

అయితే ప్రైవేటీకరణ చేస్తే ఆంధ్రా కంపెనీల చేతిలోకి వెళ్లిపోతుందని, ఆంధ్రా పెత్తనం పెరిగిపోతుందని ప్లాంటులోని ఉద్యోగులందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోనే అతిపెద్ద పవర్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అప్పగిస్తే స్థానికుల ఉద్యోగాల సంగతి ఏంటని ప్రశ్నించారు. ఇంకా 700 మందికి ఉద్యోగాలు రావాల్సి ఉన్నదని తెలిపారు. ప్రస్తుతం ప్లాంటులో 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన జరుగుతోంది. అత్యాధునిక సూపర్ క్రిటికల్ టెక్నాలజీని ఉపయోగించడంతో విద్యుత్ ఉత్పత్తిలో బొగ్గు వినియోగం, కాలుష్యం తగ్గి పర్యావరణ సమస్యలు తగ్గనున్నాయి. ప్లాంటు నిర్మాణ వ్యయం భారీగా పెరగడంతో యాదాద్రిలో ఉత్పత్తయ్యే కరెంటు యూనిట్‌కు సగటున రూ.5.50 నుంచి రూ.6 అవుతుంది. బయటి మార్కెట్‌లో రూ.4 నుంచి రూ.5కే లభిస్తోంది.

వేసవి కాలంలో విద్యుత్తుకు ఉండే పీక్ డిమాండ్ సమయంలో రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను అందించడంలో ఈ యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ ముఖ్య భూమికను పోషిస్తోందని కార్మికులు చెబుతున్నారు.

# చిన్నారులు, మహిళల సంక్షేమం కోసం పథకాలను పకడ్బందీగా అమలుచేయాలి

## మిషన్ వాత్సల్య, సాక్షం అంగన్‌వాడీ కార్యక్రమాలపై సీతక్క, సీతా దయాకర్‌రెడ్డి సమీక్ష




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 20:** చిన్నారులు, మహిళల సంక్షేమం కోసం ప్రభు త్వాలు అమలు చేస్తున్న పథకాలు క్షేత్ర స్థాయిలో ఆశించిన ఫలితాలు ఇవ్వాలంటే అధికారులు మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని మహి ళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచిం చారు. బాల్య వివాహాలు, చిన్నారులపై వేధింపులు, దాడులు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చే లక్ష్యంతో పని చేయాల న్నారు. యూసుఫ్ గూడలోని జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంస్థ(ఎన్ఐఎంఎస్ఎంఈ)లో తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య, సాక్ష్యం అంగన్‌వాడీ కార్యక్రమాల పురోగతిపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అధ్యక్షురాలు సీతా దయాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై, తెలంగాణ ప్రభుత్వం మహిళలు, పిల్లల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. బాల్య వివాహాలు ఇంకా కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్నందున, శాఖలోని ప్రతి అధికారి, సిబ్బంది వాటి నివారణకు కృషి చేసి తెలంగాణను బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని మంత్రి గారు సూచించారు. అలాగే పిల్లల రక్షణ చర్యలను మరింత బలోపేతం చేయడం, పిల్లలపై జరుగుతున్న దుర్వినియోగం, పోక్సో కేసులను తగ్గించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనితా రామచంద్రన్ సమావేశంలో పాల్గొని, మహిళలు, పిల్లల సంక్షేమానికి సంబంధించిన విధానాలను సమర్థ వంతంగా అమలు చేయడానికి అధికారులు తమ అత్యుత్తమ సామర్థ్యంతో పనిచేయాలని సూచిం చారు. ఈ సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకురాలు ఎన్. మోతి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారులు, అలాగే తెలం గాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మర్రిపల్లి చందన. బండి అపర్ణ, కంచర్ల వందన గౌడ్, ప్రేమలత అగర్వాల్, గోగుల సారిత, బుర్కా వచన్ కుమార్ పాల్గొన్నారు.

# బిసిల సాధికారతే లక్ష్యం

## జూలై 14 నుంచి 24 వరకు హెచ్‌ఎండిఏ గ్రౌండ్స్‌లో కుల వృత్తుల ప్రదర్శన: మంత్రి పొన్నం ప్రభాకర్




**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీసీల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుం దని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విద్య, సంక్షేమం, ఉపాధితో బీసీల సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ప్రతి హాస్టల్ విద్యా వికాసానికి కేంద్రం గా మారాలన్నారు. బోనాల పండుగ నేపథ్యంలో జూలై 14 నుంచి 24 వరకు హెచ్‌ఎండిఏ గ్రౌండ్స్‌లో కుల వృత్తుల ప్రదర్శన చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని జిల్లా బీసీ అభివృద్ధి అధికారులు, సహాయ బీసీ అభివృద్ధి అధికారులు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ఇతర అధికారులతో ప్రజాభవన్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల విద్యా, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా బీసీ యువత సాధికారత కలిగిన వర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు 96.05 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో బీసీ హాస్టళ్లలో 51.63 శాతం ఉత్తీర్ణత, రెండో సంవత్సరం పరీక్షల్లో 71.85 శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు యూనిఫాం క్లాత్, నోట్‌బుక్స్, బెడ్‌షీట్లు, ట్రంక్ బాక్స్, స్కూల్ బ్యాగ్, ట్రాక్‌సూట్, షూస్, సాక్స్, బ్లాంకెట్లు, స్టేషనరీ సామగ్రితో సమగ్ర వెల్‌కమ్ కిట్ అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. హాస్టళ్లలో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, రిజర్వేషన్ విధానం ప్రకారం అడ్మిషన్లు చేపట్టాలని అధికారులకు సూచించారు.

నెలాఖరులోపు అన్ని హాస్టళ్లలో పేరెంట్, టీచర్ సమావేశాలు నిర్వహించి విద్యార్థుల పురోగతి, హాస్టల్ సౌక ర్యాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిర్ణీత డైట్ మెనూను కచ్చితంగా అమలు చేయడంతో పాటు నాణ్యమైన బియ్యం, పప్పులు, కూరగాయలు, గుడ్లు, పాలు సరఫరా చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థికి అకడమిక్ ప్రొఫైల్, ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించి వారి విద్యా పురోగతి, ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్య వేక్షించాలని మంత్రి అధికారులను ఆదేశిం చారు. బోనాల పండుగ సందర్భంగా జూలై 14 నుండి 24 వరకు హెచ్‌ఎండిఏ గ్రౌండ్స్‌లో కుల వృత్తుల ప్రదర్శన, మట్టి కుండల స్టాల్స్ ఏర్పాటు చేయాలని అధికా రులను ఆదేశించారు. బీసీ, ఈబీసీ వర్గాలకు సంబంధించిన కళ్యాణ లక్ష్మి పథకం దరఖాస్తుల పెండింగ్ లేకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బీసమీక్షా సమా వేశంలో బీసీ సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారు వి. హన్మంతరావు, బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాలమాయదేవి, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టు, ఎంబీసీ కార్పొరేషన్ సీఈవో అలోక్ కుమార్, బీసీ స్టడి సర్కిల్స్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జిల్లా బీసీ అభివృద్ధి అధికారులు, సహాయ బీసీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# బిజెపి ఎంపి తేజస్వీసూర్య తెలంగాణకు వస్తే అడ్డుకుంటాం

## ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్

**హైదరాబాద్,జూన్20,ప్రభాతవార్త:** తెలంగాణ ఏర్పాటును అవమానించేలా పాకిస్థాన్‌తో పోల్చి తప్పుగా మాట్లాడిన తేజస్వీసూర్య తెలంగాణకు వస్తే ఆయనను అడ్డుకొంటామని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ తేజస్వీసూర్య నోటి నుంచి బిజెపి తెలంగాణ వ్యతిరేకవిధానాన్ని చెప్పకనే చెప్పారనీ దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో ఆనాడు తేజస్వీసూర్య మాటలను ఖండించలేని బిజెపి, నేత లు.. ఇప్పుడు తేజస్వీసూర్యను తెలంగాణకు ఆహ్వానిస్తున్నారని విమర్శిం చారు. ఆనాటి మాటలకు క్షమాపణ చెప్పకుండా నమో జెన్‌జీ కాంక్లేవ్ పేరుతో హైదరాబాద్‌లో మీటింగ్ పెట్టి, సూర్య హాజరైతే తప్పకుండా అడ్డు కుంటామన్నారు. మీటింగ్ పెట్టాలనుకుంటే ముందు బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఇప్పటివరకు సూర్య మాటలను, బిజెపి నేతలు ఖండించలేదు. తమ అస్థిత్వాన్ని, తమ సెంటిమెంట్‌ను ఎగతాళి చేసి మాట్లాడిన సూర్య తెలంగాణకు వస్తే. ఆవేశంతో ఉన్న యువకుల ఆగ్రహం చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను ఎవరు దెబ్బతీసిన ఊరుకునేది లేదన్నారు. తెలంగాణ అంటేనే భావోద్వేగం, సెంటిమెంట్, అలాంటి సెంటిమెంట్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని హితవు చెప్పారు. దేశంలో పేపర్ లీకులు చేసి, విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బిజెపికి గుణపాఠం చెబుతారని అన్నారు, తెలంగాణలో జెన్‌జీ యూత్‌తో సదస్సులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిజెపి కుట్రలకు బలవుతున్న జెన్‌జి యువతనే బిజెపి పాలకులపై పోరాటం చేస్తోందని అన్నారు. అలాంటి బిజెపికి ఎలాంటి సమాధానం చెప్పాలో జెన్‌జి యువతకు బాగా తెలుసన్నారు. ఇప్పటికే పోరాటాన్ని ఉధృతం చేశారు, మోడీ ప్రభుత్వం చేసిన పాపాలకు ప్రజల చేతుల్లో శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు.

# నీట్ అభ్యర్థులు ఒత్తిడికి లోనుకాకుండా పరీక్ష రాయాలి

## ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాం

### పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 20:** నీట్ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులందరికీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పునర్నిర్వహిస్తున్న ఈ పరీక్షలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు, ఒత్తిళ్లకు గురికాకుండా పూర్తి ఆత్మవిశ్వాసంతో, ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షి ంచారు. ఈ మేరకు సీఎం శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. వైద్య విద్యలో ప్రవేశానికి ముఖ్యమైన ఈ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతోకాలంగా కృషి చేశారని పేర్కొన్నారు. తమ శ్రమ, పట్టుదలపై నమ్మకం ఉంచి అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నీట్ పరీక్షకు సంబంధించి తెలంగాణలో సుమారు 208 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు.

విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. విద్యార్థులు చివరి నిమిషం వరకు వేచి ఉండకుండా ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన మనసుతో పరీక్ష రాయాలని తెలిపారు. విద్యార్థులందరూ తమ లక్ష్యాలను సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షి ంచారు.



# అణగారిన వర్గాలకు అండగా కోమటిరెడ్డి ప్రతీక్ పౌండేషన్

## అభినందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** పేదలు అణగారినవర్గాలకు అండగా కోమటిరెడ్డి ప్రతీక్ పౌండేషన్ ఉండటమే కాకుండా ఎంతో మందికి విద్య,వైద్యం ,మహిళా ఆర్థికస్వావలంభకు ఉద్దీపన ఇచ్చే నైపుణ్యాభివృద్ధి సేవలను అందించి వారికి ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉంటుందని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కితాబు నిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సౌత్ ఇండియా సిఎస్ఆర్ సదస్సు 2026 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో, కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సిఇఒ ఎం. వి. గోనా రెడ్డి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోనా రెడ్డి స్పీకర్‌కి ప్రతీక్ ఫౌండేషన్ మ్యాగజైన్, ఫౌండేషన్ లోగోతో కూడిన క్లాత్ బ్యాగ్, చేనేత కాటన్ శాలువాను బహూకరించారు. అలాగే నల్లగొండ జిల్లా బొట్టుగూడలో నూతనంగా నిర్మించిన కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల" ఫోటోలను అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయం, ఆరోగ్య రంగం మహిళా సాధికారత రంగాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను గోనా రెడ్డి స్పీకర్ కు వివరించారు. ఫౌండేషన్ కార్యకలాపాలను విన్న అనంతరం గడ్డం ప్రసాద్ కుమార్ హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు. త్వరలో నల్లగొండకు వచ్చి, బొట్టుగూడలో నూతనంగా నిర్మించిన పాఠశాలను సందర్శిస్తాననీ తెలిపారు. సామాజిక బాధ్యతతో ప్రతిఒక్కరు వ్యవహరిస్తే ప్రతి వ్యక్తిలో నిగూఢంగా ఉన్న శక్తిని వెలికితీయడంతోపాటు దేశ ఆర్థిక ప్రగతికి వారి యుక్తిని వాడుకోవడానికి మార్గం సుగమం అవుతోందని అన్నారు. ఎంతో మందికి ఉన్నత విద్య మధ్యలో ఆగిపోకుండా కోమటిరెడ్డి ప్రతీక్ పౌండేషన్ దారులు వేసిందని అదే విధంగా వైద్యం ఆరోగ్యం వంటి బాధ్యతలు నిర్వహించిందని అన్నారు.

# ఇక దాడికి ప్రతిదాడి తప్పకుండా చేస్తాం.. ఎట్టిపరిస్థితిలో వదలం

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** ప్రభుత్వంలో ఉన్నామనే ఓపికతో వెళ్తున్నామని అదే మేము తలుచుకుంటే కెటిఆర్ ఒక్క రోజు కూడా నిద్రపోలేవ ఇకపై దాడికి ప్రతిదాడి తప్పకుండా చేస్తామనీ ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టబోమని, బిఆర్ఎస్ నేతలకు సినిమా చూపిస్తామని మాజీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. శనివారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడితే కుదరదు విపక్షంలోనూ అట్టర్ ఫ్లాప్ అయ్యారనీ అన్నారు. కెటిఆర్ ప్రతిదానికి ఎందుకు అంతలా ఉలిక్కిపడుతున్నావ్ అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను అడ్డుకోవమే కెటిఆర్, హరీశ్ రావు పనిగా పెట్టుకున్నారని ధాన్యం సేకరణ విషయంలో ఈ ఇద్దరూ లారీలను అడ్డుకున్నారని ఆరోపించారు. మేం రౌడీయిజం చేసేటోళ్లం కాదని ప్రజాసేవ చేస్తున్నామనీ,రౌడీలకు బుద్ధి చెబుతూ హీరోయిజం చేసేటోళ్లం అన్నారు. మల్కాజిగిరికి వస్తానంటున్నావ్ నేను సిరిసిల్లాకు రాలేనా అని ప్రశ్నించారు. కెటిఆర్ దమ్ముంటే మల్కాజ్‌గిరికి వచ్చి పోటీ చేయాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ నేతలపై, తమపై ఇష్టానుసారం మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పనైపోయిందని తెలిసి కెటిఆర్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు.

# గుండ్ల సింగారంలో పేదల గుడిసెల కూల్చివేతను నిలిపివేయాలి

## పునర్నిర్మాణానికి అవకాశం కల్పించాలి

### సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలోని సురవరం సుధాకర్‌రెడ్డినగర్‌లో పేదలు వేసుకున్న గుడ సెలపై రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేయడం నిలిపి వేయాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. గుడిసెల పునర్నిర్మాణానికి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేయడం సమంజసం కాదన్నారు. పక్కనే పెద్ద పెద్ద భవనాలు కట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, పేదలు వేసుకున్న 300 గుడిసెలను కూల్చివేయడం అన్యాయమన్నారు. ఉండడానికి ఇండ్లు లేని నిరుపేద కుటుంబాలకు చెందిన ప్రజలని వారిని ఆదుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ భూములు దేనికి పనికిరావని, పేదలకు నివాసయోగ్యంగా ఉంటాయని అన్నారు. ఖమ్మం జిల్లాలో వెలుగుమట్లలో కూడా రాత్రికి రాత్రే పేదల గుడిసెలను కూల్చివేశారని, అదే తరహాలో ఇప్పుడు గుండ్ల సింగారంలో చేశారని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పేదలు గుడిసెలను పునర్ నిర్మించుకోవడానికి అవకాశం కల్పించుకోవడం కొరకు స్పష్టమైన ఆదేశాలు అధికారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# విబి జి రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

## కేంద్రానికి మంత్రి సీతక్క నిరసన లేఖ

### ఉపాధి హక్కు, పంచాయతీల అధికారాలను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరిన మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 20:** వీబీజీ రామ్‌జీ చట్టం గ్రామీణ పేదల ఉపాధి హక్కును బలహీనపరుస్తోందని, ఈ చట్టాన్ని ఉపసంహరించుకుని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)ను యథాతథంగా కొనసాగించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి సీతక్క మూడు వేర్వేరు లేఖలు రాసి తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలు, సూచనలను తెలియజేశారు. వీబీజీ రామ్‌జీ చట్టం అమలుకు సంబంధించి కేంద్రం రూపొందించిన నిబంధనల్లో అనేక అంశాలు పేదలు, దళితులు, ఆదివాసీ గిరిజనులు, భూమిలేని గ్రామీణ కుటుంబాల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ముఖ్యంగా నిధుల కేటాయింపును రాష్ట్ర స్థాయిలో నిర్ణయించడం వల్ల గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న వాస్తవ ఉపాధి అవసరాలు విస్మరణకు గురవుతున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, ములుగు, నాగర్‌కర్నూల్ వంటి వెనుకబడిన జిల్లాల్లో అధిక ఉపాధి అవసరాలు ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా పరిగణించడం వల్ల ఆ ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీల్లో గత ఐదేళ్లలో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగా నిధుల కేటాయింపుకు 80 శాతం ప్రాధాన్యం ఇవ్వాలని, ఆర్థిక సంఘం ప్రమాణాలకు 20 శాతం మాత్రమే వెయిటేజీ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే నిధుల పంపిణీ, పనితీరు ప్రమాణాల విషయంలో కేంద్రానికి అపరిమిత అధికారాలు ఇవ్వడం చట్టం ఉద్దేశానికి విరుద్ధమని, రాష్ట్రాలతో సంప్రదింపుల అనంతరమే నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. ఇందిరమ్మ ఇండ్ల వంటి రాష్ట్ర గృహ నిర్మాణ పథకాలను వీబీజీ రామ్‌జీ పరిధిలో చేర్చాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

# నైరుతి మందగమనం

## ఏడు జిల్లాల్లో తీవ్రలోటుతో వర్షాభావం

### ఉత్తర, దక్షిణ, మధ్య జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ

### భద్రాచలం ప్రాంతాల్లో నిలిచిన రుతుపవనాలు

### రాష్ట్రమంతా 23 నాటికి విస్తరించే అవకాశం

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** నైరుతి రుతుపవనాల మందగమనంతో రాష్ట్రంలో కొన్ని రోజులుగా తీవ్ర వడగాలులు, ఉకపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా ఏర్పడిన ఎల్‌నినో రుతుపవనాల వేగాన్ని దెబ్బతీసిందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర భారతదేశంలో వీచిన గాలులు రుతుపవనాలు లోపలికి చొచ్చుకుపోవడానికి అడ్డంకిగా మారాయి. దీనికి తగినట్లుగా అరేబియా సముద్రం, బంగాళాఖాతం ప్రశాంతంగా ఉండటం వల్ల బలమైన అల్పపీడనాలు ఏర్పడలేదని తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో ప్రస్తుతం రుతుపవనాలు ఉత్తర సరిహద్దు హైదరాబాద్, భద్రాచలం ప్రాంతాల చుట్టుపక్కల నిలిచిపోయాయని పేర్కొంది. ఫలితంగా రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం కారణంగా వర్షాభావ పరిస్థితులకు దారితీస్తోందని తెలిపింది. మరోపక్క తెలంగాణ వ్యాప్తంగా ఈరోజు, రేపు వడగాలుల పరిస్థితులు నెలకొంటాయని వాతావరణ శాఖ అంచనా వేయడమే కాకుండా, రాష్ట్రంలోని ఉత్తర, దక్షి ణ, మధ్య జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ కాలంలో కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షాలు, ఈదురు గాలులు, తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆ శాఖ సూచించింది. ఇక ఈ ఏడాది జూన్‌లో సగటున 30 శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యం గా నిజామాబాద్, మహబూబాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల, సిద్దిపేట, పెద్దపల్లి, హ నుమకొండ జిల్లాల్లో 60 నుంచి 80 శాతం లోటు వర్షపాతం నమోదైనట్టు పేర్కొన్నది. నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లా ల్లో మాత్రమే అధిక వర్షపాతం నమోదు కాగా, మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం న మోదైనట్టు తెలిపారు. గడిచిన 24 గంటల్లో సూర్యాపేటలో 5.08 సెం.మీ, నల్లగొండలో 5.01, హైదరాబాద్‌లో 4.24, యాదాద్రి భువనగిరిలో 4.01, నాగర్‌కర్నూల్‌లో 3.25 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. అయితే రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ఈ నెల 21న తిరిగి పుంజుకొని పలు ప్రాంతాల్లో వర్షాలు ప్రారంభమై, 23 నాటికి రాష్ట్రమంతా విస్తరించే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. వాతావరణంలో మార్పులతో నాలుగు రోజుల్లో మిగిలిన జిల్లాల్లోకి ప్రవేశించి వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, కపిలవాయి దిలీప్‌కుమార్ తదితరులు

# హైడ్రా రాత్రికిరాత్రే కూల్చదు.. పేదల జోలికి వెళ్లదు

## ఆక్రమణలుగా నిర్ధారించుకున్నాకే చర్యలు

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్,జూన్ 20,ప్రభాతవార్త:** హైడ్రా కార్యకలాపాలను నగర ప్రజలు క్షుణ్ణంగా గమనించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హితవు పలికారు. హైడ్రా వల్ల జరిగే ప్రయోజనాలపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాను కబ్జా చేసి.. రూ. వందల కోట్లు కొల్లగొట్టేవారి దుష్ప్రచారాన్ని నమ్మవద్దని హితవు పలికారు. హైడ్రా కార్యకలాపాలు, గొలుసుకట్టు చెరువులు, ప్రకృతి పరిరక్షణలో హైడ్రా పాత్ర అనే అంశంపై శనివారం తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దల్ పార్టీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్సీ, టీఆర్ ఎల్‌డీ పార్టీ అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సదస్సులో హైడ్రా కార్యకలాపాలను కమిషనర్ వివరించారు. కబ్జాలకు పాల్పడుతున్న వారికి హైడ్రా అంటే గిట్టడంలేదని వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ.. ప్రభుత్వ భూములు కొల్లగొట్టారన్నారు. వారి నుంచి వందలు, వేల ఎకరాల భూములను హైడ్రా వెనక్కి తీసుకుందన్నారు. రాత్రికి రాత్రి హైడ్రా కూల్చదని పేదల జోలికి వెళ్లదన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో 862 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాం. ఏడాది పాటు అధ్యయనం చేసి.. అన్ని రికార్డులు పరిశీలించాకే ఈ చర్యలు తీసుకున్నాం. హైడ్రా వల్ల పేదవాళ్లకు ఎక్కడా అన్యాయం జరగలేదు. హైడ్రా ఏర్పడి రెండేళ్లు అవుతోంది.. 2450 ఎకరాల భూమిని కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించామన్నారు. ఇందులో పెద్దలకు చెందిన కబ్జాలే ఉన్నాయన్నారు. చెరువుల పునరుద్ధరణలో గుడిసెలు కోల్పోయిన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు వచ్చేలా హైడ్రా ప్రభుత్వానికి సిఫారసు చేసిందని రంగనాథ్ పేర్కొన్నారు.

# పాడి రైతులకు బకాయిల్లేని చెల్లింపులు

## 27 లక్షల మంది విద్యార్థులకు పాలు

### విజయ డెయిరీ బలోపేతానికి చర్యలు

### డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క



**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీనం సాగిస్తున్న రైతులకు బకాయిల్లేని పేమెంట్లు ఇవ్వనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాడి రైతులను ఆదు కోవడంతో పాటు, విజయా డైరీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుం టుందని చెప్పారు. హైదరాబాద్‌లో శనివారం పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కృత నిశ్చయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు రాష్ట్రంలోని వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు విజయ పాలను అందించనున్నట్లు వెల్లడించారు.. రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు సమర్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలన్నారు.

రైతుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలని పేర్కొన్నారు. రైతులకు బకాయులు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలని తెలియచేశారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడ తారని, ఈ నేపథ్యం లో వారికి సమయా నికి డబ్బులు చెల్లిస్తే సంబంధిత కుటుం బాలు ఆర్థికంగా బలోపేతం అవుతా యన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభ సాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

# పబ్లిక్ హెల్త్ కేపిటల్‌గా తెలంగాణ

## ఆరోగ్యమే అభివృద్ధికి అసలైన సూచిక

### వ్యాధి చికిత్స కంటే నివారణే మిన్న

### డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 20:** ప్రజల ఆరోగ్యమే అత్యున్నతమైన అభివృద్ధికి అసలైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇండియా హెల్త్ సమిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్య రంగ నిపుణులు, ప్రముఖ వైద్యులు, హాస్పిటల్స్, ఫార్మా, బయోటెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగానికి చెందిన ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆరోగ్యం అనేది కేవలం ఒక ప్రభుత్వానికి సంబంధించిన అంశం కాదన్నారు. ప్రతి ఒక్కరి ప్రాథమిక అవసరమని పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా కుప్పకూలిపోతుందని, వారి జీవితాంతం దాచుకున్న పొదుపు మొత్తం ఒక్క క్షణంలో కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదవాడు ఎటువంటి భయం లేకుండా ఆసుపత్రిలో అడుగుపెట్టేలా తక్కువ ధరకు వైద్యం అందుబాటులో ఉండాలన్నారు. దేశం ఆర్థికంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలోనే తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎయిమ్స్ వంటి ఉన్నతమైన వైద్య విద్యాసంస్థలను స్థాపించి దేశానికి ఒక దిశను చూపించారన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో వచ్చిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, ఆశావర్కర్ల వ్యవస్థ గ్రామీణ ఆరోగ్య ముఖచిత్రాన్ని మార్చివేసిందని గుర్తుచేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం పేదవాడి ఆరోగ్యానికి భరోసా ఇచ్చిందన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చావుకు దగ్గర కాకూడదని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి నిదర్శనమని అన్నారు.రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందిస్తూ, గుండె, కిడ్నీ వంటి ఖరీదైన జబ్బులకు సైతం పేదవాడు ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా ఈ పథకం అండగా నిలిచిందన్నారు.

వైద్య రంగంలో వస్తున్న టెక్నాలజీ, టెలిమెడిసిన్, సరికొత్త పరికరాలు కేవలం కార్పొరేట్ వర్గాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు సైతం అందాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుత వైద్య విధానం వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స అందించే ఇల్‌నెస్ కేర్ గా మాత్రమే ఉండిపోకూడదన్నారు. వ్యాధి రాకుండా ముందే నివారించే వెల్‌నెస్ కేర్‌గా మారాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఐసీయూల కంటే వ్యాధి నివారణే అత్యంత చౌకైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు.

# నరహరి బ్యాంకు లాకర్లలో రూ.1.5 కోట్ల నగదు, రెండు కిలోల బంగారం

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో అరెస్టయిన మల్టీ జోన్-2 సర్వే లాండ్ రికార్డుల డిప్యూటీ డైరక్టర్ సుంకరి నరహ రి అక్రమా స్తులు మరిన్నింటిని ఎసిబి అధికారులు వెలికి తీశారు. ఈ నెల 16వ తేదీన నరహరిని ఎసిబి అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే . ఈ సందర్భంగా ఆయన వద్ద 13 కోట్ల రూపాయలకు పైగా నగదు, నగలు పట్టుబడడం విదితమే. బహిరంగ మార్కెట్లో వీటి విలువ 150 కోట్ల రూపాయల వరకు వుంటుందని ఎసిబి అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో మరిన్ని అక్రమాస్తులను గుర్తించేందుకు నరహరి బ్యాంకు లాకర్లను తెరిచేందుకు ఎసిబి అధికారులు తాళాలు ఇవ్వాలని నరహరితో పాటు ఆయన కుటుంబ సభ్యులను కోరగా వారు అందుకు అంగీకరిం చలేదు. దీంతో ఎసిబి కోర్టు అనుమతితో శనివారం నాడు పాతబస్తీలోని శాలిబండలో గల కెనరా బ్యాం కులో గలనరహరికి చెందిన రెండు లా కర్లను బద్దలు కొట్టగా అందులో ఒక దాంట్లో కోటిన్నర రూపాయల నగదు, ఇంకోదాంట్లో 12 బంగారు బిస్కట్లు (ఒక్కో బిస్కట్ వంద గ్రాము లు వుంది), వజ్రాలు పొదిగిన బంగారు నెక్లెస్ వెలుగులోకి వచ్చాయి. వీటి విలువ రెండు కిలోలుగా నిర్ధారించారు. వీటిని జప్తు చేసిన ఎసిబి అధికారులు నరహరి అక్రమాస్తుల చిట్టాను మరోసారి విడుదల చేశారు. తాజాగా అతని ఆస్తుల విలువ 16 కోట్ల 50 లక్షల రూపాయలుగా తేలింది.

# తెలంగాణపై బిజెపి ఫోకస్.. నెలాఖరున నబీన్ పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 20:** తెలంగాణ బిజెపి ఫోకస్ పెంచింది. గత నెలలో ప్రధాని మోడీ రాగా, తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటన ఖరారైంది. ఈనెల 28,29,30 తేదీల్లో ఆయన పర్యటించనున్నారు. 3 రోజుల పాటు సాగే ఈ పర్యటనలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వరంగల్,హైదరాబాద్,రంగారెడ్డి జిల్లాల్లో పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహించనున్నారు. జిహెచ్ఎంసీ,వరంగల్ మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉన్న నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై బిజెపి సన్నాహక సమావేశం**

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై బీజేపీ సన్నాహక సమావేశం నిర్వహించింది. బీజేపీ రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావు అధ్యక్షతన జరుగుతున్న ఈ భేటీలో 9 జిల్లాల అధ్యక్షులు, జిల్లా ఇన్‌ఛార్జులు, రాష్ట్ర పదాధికారులు హాజరయ్యారు. పార్టీ సంస్థాగత బలోపేతం, తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో 3 మేయర్ పీఠాల గెలుపే లక్ష్యంగా ప్రణాళికపై చర్చ జరిగింది.



## స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్స్‌ను ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 20:** దేవాలయ పరిపాలనలో నైపుణ్యాభివృద్ధి, ఆధునిక నిర్వహణ విధానాల అమలుకు ఉద్దేశించిన స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్స్ (ఎస్ఐటిఎ) శిక్షణలో దేవాదాయ శాఖ దేశంలోనే ఉన్నతస్థానంలో నిలుస్తుందన్న నమ్మకముందని మంత్రి కొండా సురేఖ అన్నారు. అర్చకులు, ఉద్యోగులు కలిసి సమన్వయంతో పనిచేస్తేనే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. దైవాజ్ఞ లేనిదే ఏ కార్యం జరగదనీ, దేవాదాయశాఖ మంత్రిగా తన చేతులు మీదుగా ఈ కార్యాలు జరగాల్సి వుండటం దైవేచ్ఛ అని మంత్రి సురేఖ తెలిపారు. శనివారం సాయంత్రం దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యాలయం (ధార్మిక భవన్)లో రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, డైరెక్టర్ ఎం. హను మంతరావు తదితరులు పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేవాదాయ శాఖలో ఉద్యోగుల సంక్షేమం, పాలనా సంస్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ఎస్ఐటిఏ ఆధ్వర్యంలో కొత్త దిశను నిర్దేశించనున్నామని అన్నారు. దేవాదాయ శాఖను సరికొత్తగా ఆవిష్కరించే దిశలో ఎస్ఐటిఏ కార్యాచరణ వుండోబోతున్నదని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత 12 ఏళ్ళకు ఎస్ఐటిఏను పునః ప్రారంభించుకోవడం ప్రజా ప్రభుత్వ తీరుకు నిదర్శనమన్నారు. కింది స్థాయి ఉద్యోగుల నుంచి ఉన్నతస్థాయి ఉద్యోగుల వరకు, దేవాలయ సిబ్బంది మొత్తం ఈ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందితే వచ్చే ఫలితాలు అద్భుతంగా వుంటాయని పేర్కొన్నారు.

# మరోమారు పెరగనున్న పాల ధరలు

## 3 నుండి 4 శాతం పెంపునకు డెయిరీల ప్లాన్

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** నిత్యావసర వస్తువులతో పాటు, ఇంధన ధరలు ఆకాశాన్ని అంటిన నేపథ్యంలో తాజాగా సామాన్యుడికి ఇంకో షాక్ తగలనుంది. దేశంలో పాల ధరలు మరోమారు పెరగబోతున్నట్లు తెలుస్తోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల దేశంలో రుతుపవనాలు బలహీనపడి, వర్షపాతం తగ్గడం వల్ల పాల ధరలు పెంచడం అనివార్యం కాబోతున్నట్లు డెయిరీ సంస్థలు చెబుతున్నాయి. సాధారణంగా వర్షాలు సరిగ్గా పడకపోతే పశుగ్రాసం, తాగునీటి కొరత తీవ్రమవుతుంది. దీంతో పాల ఉత్పత్తి తగ్గడంతో పాటు, ఈ భారం భరించలేక రైతులు తమ పశువుల సంఖ్యను తగ్గించుకుంటారు. ప్రస్తుతం దేశంలో నైరుతి రుతుపవనాలు ఆశించిన స్థాయిలో లేవు. అయితే ఇప్పటికే గత నెలలో పాల ధరలు లీటర్ కు 2 నుండి 3 శాతం వరకు పెరగ్గా, వచ్చే జూలై లేదా ఆగస్టు నాటికి ఇవి మరింత ప్రియమయ్యే అవకాశం ఉందని డెయిరీ పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వర్షాభావ పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలోని ప్రముఖ డెయిరీల వివిధ రకాల పాల ప్యాకెట్ల ధరలు మరో 3 నుండి 4 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని సంబంధిత సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. కాగా పరిస్థితిని ముందే ఊహించిన మహారాష్ట్ర ప్రభుత్వం రైతులు అప్రమత్తం చేసింది. పశుగ్రాసం కొరత ఏర్పడే ముప్పు ఉందని, రైతులు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ పశుగ్రాస పంటల సాగుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ కమిషనర్ కిరణ్ పాటిల్ హెచ్చరించారు.

మరోవైపు ప్రముఖ డైరీ బ్రాండ్లు అయిన అమూల్, మదర్ డైరీ సంస్థలు కూడా పరిస్థితిని నిరంతరం సమీక్షి స్తున్నాయి. అయితే ప్రస్తుతానికి ఎల్‌నినో ప్రభావం పాల లభ్యతపై పడలేదని వర్షపాత కొరత అనేది కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతుంది కాబట్టి రుతుపవనాల పురోగతిని చూసి తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడిస్తున్నాయి. కాగా ఇప్పటికే ఎండల తీవ్రత కారణంగా తమిళనాడుకు చెందిన ఆవిన్ డైరీ పాల సరఫరాను తగ్గించగా, మిగిలిన ప్రముఖ బ్రాండ్లు కూడా ధరల పెంపునకు మొగ్గ చూపుతుండటంతో పాల వినియోగదారులపై అదనపు భారం పడటం తప్పనిసరి కానున్నట్లు డెయిరీ సంస్థలు పేర్కొంటున్నాయి.

# క్షేత్రస్థాయి పోలీసులకు కేసుల విచారణపై పోలీసు అకాడమిలో శిక్షణ

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ స్థాయి వరకు సిబ్బందికి కీలక కేసుల విచారణకు సం బంధించి హిమాయత్ సాగర్‌లో గల రాష్ట్ర పోలీసు అకాడమిలో వారం రోజులుగా జరుగుతున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ శనివారం ముగిసింది. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిలో ఈ కేడర్ వారే ఎక్కువగా వుండడంతో వీరికి కేసుల విచారణలో శాస్త్రీయంగా వ్యవహరించం ఎలా అనే దా నిపై శిక్షణ ఇచ్చారు.

నేరాలు జరిగిన సమయలో ఘటనా స్థలాల్లో క్లూస్ టీం సభ్యులు ఎలా వ్యవహరించాలి? ఏయే సాక్షాలు సేకరించాలి? అనే అంశంపై ఫోరెన్సిక్ నిపుణులతో పాటు నిపుణులు అనేక అంశాలపై బోధించారు. హత్యలతో పాటు తీవ్రమైన నేరాలు జరిగిన సమ యంలో మృతదేహాల వద్ద సేకరించాల్సి న ఆధారాలు ఏమిటి? వీడియోలు, ఫోటోలు ఎలా తీయాలి? వాటిని ఎలా జాగ్రత్తగా వుంచాలి? వాటిని పైఅధికారులకు ఎలా పంపాలి? వాటిని శాస్త్రీయంగా ఎలా విశ్లేషిం చాలి? దీని తరువాత శవాలను ఎలా భద్రపరచాలి? పోస్టు మార్టం సమయంలో ఏయే ఆధారాలు సేకరించాలి...? అనే అంశాలపై శిక్షణ కోసం వచ్చిన పోలీసులకు ఒక బొమ్మను వుంచి దీనిని మనిషిగా చూపుతూ, హత్య జరిగినట్లు చెబుతూ తదుపరి ఎలా వ్యవహరించాలి? అనే దానిపై శిక్షణ కోసం వచ్చిన వారికి అకాడమి అధికా రులు వివరించారు. నూతన క్రిమినల్ చట్టాల ప్రకారం తప్పనిసరి అయిన ఆడియో, వీడియో రికార్డింగ్ వి ధానాలపై శిక్షణకు వచ్చిన వారికి అ కాడమి అధికారులు వివరించారు. ముఖ్యంగా డిజిటల్ సాక్షాధారాల ప్రాముఖ్యతను వారికి అధికారులు వివరించారు. క్లూస్ టీం వాహనాలు, నేరాలు జరిగిన ప్రాంతాలలో ఉపయోగించే ఫోరెన్సిక్ కిట్లపై ప్రత్యేకంగా మరో సెషన్ నిర్వహించారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మాక్ క్రైం సీన్లను ఏర్పాటు చేసి శిక్షణకు వచ్చిన వారికి అవగాహన కల్పించారు. అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రం జరిగింది. శిక్షణ విభా గం ఇంఛార్జిలుగా ధరజ, నరహరి వ్యవహరించారు.

# హెచ్‌సిఎ కోరితేనే స్టేడియం నిర్మాణానికి సహకారం

## సుప్రీంకోర్టు దాకా వెళ్లిన కేసును వక్రీకరించడం సరికాదు:

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, జూన్ 20,ప్రభాతవార్త:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ -విశాఖ ఇండస్ట్రీస్ కేసు అంశం పై జరుగుతున్న అసత్య ప్రచారం వాస్తవాలకు విరుద్ధమని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు కావాలనే తప్పడు ప్రచారం చేస్తున్నారని, ఇది ఏవ్యక్తి నిర్ణయం వల్ల ఏర్పడిన అంశం కాదని, సుప్రింకోర్టు వరకు వెళ్లి వచ్చిన న్యాయ ప్రక్రియ ఫలితమని ఆయన స్పష్టం చేశారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప్పల్ స్టేడియం నిర్మాణ సమయంలో జరిగిన పరిణామాలను వివరించారు. 2004లో ఉప్పల్ స్టేడియం నిర్మాణం జరగుతున్న సమయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులో ఉందని, స్టేడియం నిర్మాణానికి



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

హెసీఏ కార్యదర్శి శివలాల్ యాదవ్ ఇతర ప్రజాప్రతినిధులు తన తండ్రి కేంద్ర మాజీ మంత్రి కాకా వెంకటస్వామిని కలిసి స్టేడియం నిర్మాణానికి నిధులు కావాలని కోరారని ఆయన ఆదేశాల మేరకు తాను అంతఙ్జాతీయ స్థాయిలో స్టేడియం నిర్మాణానికి సహకారం అందించానని తెలిపారు. విశాఖ ఇండస్ట్రీస్ ఎవరి ఒత్తిడి లేకుండా హెసిఏ అభ్యర్థన మేరకు మాత్రమే సహకారం అందించిందని హెచ్‌సిఏ సభ్యులంతా దీన్ని ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. అనంతరం విశాఖ ఇంటర్నేషనల్ స్టేడియంగా పేరు పెట్టాల్సి ఉండగా స్వర్గీయ రాజీవ్ గాంధి పేరు పెడతామని అప్పటి ముఖ్యమంత్రి దివంగత వైఎస్ఆర్ తెలుపడంతో ఆయన మీద గౌరవంతో సమ్మతించామన్నారు. అదే సమయంలో పేరు మార్చినప్పటికీ మిగిలిన హక్కులు కొనసాగు తాయని సమ్మతి తెలిపారని అన్నారు. 2011లో ఒప్పందాన్ని హెచ్‌సిఏ రద్దు చేయగా దీంతో విశాఖ ఇండస్ట్రీస్ ఆర్బిట్రేషన్‌కు వెళ్లాల్సి వచ్చిందన్నారు. అయితే ప్రస్తుతం కేసు కోర్టులో ఉండగ కొందరు నిరాధారమైన ఆరోపనలు చేయడం సరికాద న్నారు. విశాఖ ఇండస్ట్రీస్‌కు ఇప్పటికీ నయా పైసా కూడా దక్కలేదని, ఆటలపై ఉన్న మమకారంతో తన తండ్రి వెంకటస్వామి పేర వచ్చిన నిధులను మళ్లీ గ్రామీణ క్రికెట్ క్రీడలకు కేటాయిస్తామని తెలపారు. కోర్టులో ఉన్న విషయం పై తప్పుగా ప్రకటనలు చేయడం సరికాదని ఈవిశయాన్ని ప్రజలందరు గమనిస్తున్నారని, తప్పడు ఆరోపణ లకు కచ్చితంగా కోర్టులో సమాధానం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# స్కోచ్ అవార్డు అందుకున్న నెహ్రూ జూలాజికల్ పార్క్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్20:** అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణుల సంరక్షణలో తెలంగాణ అటవీ శాఖ చేపడుతున్న కృషికి మరో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. మౌస్ డీర్ సంరక్షణ, బ్రీడింగ్ మరియు అడవుల్లోకి పునరావాసం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసినందుకు నెహ్రూ జూలాజికల్ పార్క్ ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డును అందుకుంది. వన్యప్రాణుల సంరక్షణ విభాగంలో ఈ అవార్డును అందుకున్న దేశంలోని తొలి జూపార్క్‌గా నెహ్రూ జూలాజికల్ పార్క్ నిలిచింది. కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ కార్యక్రమలో భాగంగా అందించే ఈ అవార్డుల కార్యక్రమం ఢిల్లీలో జరిగింది. నెహ్రూ జూలాజికల్ పార్క్ క్యూరేటర్ వసంత ఈ అవార్డును స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అటవీ దళాల అధిపతి డా. సీ. సువర్ణ, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ వినయ్ కుమార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు అందించిన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం వల్లే ఈ ప్రతిష్టాత్మక అవార్డు సాధ్యమైందన్నారు. అలాగే మౌస్ డీర్ సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన జూ సిబ్బంది, సాంకేతిక బృందం, సహచర ఉద్యోగుల కృషిని ఆమె అభినందించారు.

# సిఏఆర్ జవాన్లకు ట్రాఫిక్ నిర్వహణపై శిక్షణ

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర సాయుధ పోలీసు కానిస్టేబుళ్లకు ట్రాఫిక్ నిర్వహణపై రాష్ట్ర పోలీసు అకాడమిలో పది రోజుల పాటు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. సిటీ పోలీసు విభాగంలో సివిల్ పోలీసులకు తోడుగా సాయుధ బలగం సిబ్బంది కూడా పాల్గొంటుండడం తెలిసిందే. ఈ క్రమంలో సాయుధ పోలీసు కానిస్టేబుళ్లకు ట్రాఫిక్ నిర్వహణపై తప్పనిసరిగా అవగాహ న వుండాల్సి న అవసరం వుందని భావించిన ఉన్నతాధికారులు విడతల వారిగా వారికి అకాడమిలో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి మొద టి బ్యాచ్‌కు చెందిన 24 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తి కాగా వారికి అకాడమి అధికారులు సర్టిఫికేట్లను ప్రధానం చేశారు. ఈ శిక్షణలో రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో స్థానిక అధికారులకు ఎలా సహకరించాలి...? బాధితుల కు తక్షణ సహాయం ఎలా అందించాలి...? తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి...? అనే అంశాలపై అకాడమి అధికారులు సాయుధ బలగం కానిస్టేబుళ్లకు శిక్షణ ఇచ్చారు. దీంతో పాటు రవాణా శాఖకు సంబంధించిన చట్టాల గురించి వారికి తర్ఫీదునిచ్చారు. రెండవ బ్యాచ్ జవాన్లకు త్వరలో శిక్షణ మొదలవుతుంది.

# ఈ యేడాది వెంకన్నకు రెండు బ్రహ్మోత్సవాలు

## సెప్టెంబర్ 15 నుంచి సాలకట్ల, అక్టోబర్ 11నుంచి నవరాత్రి బ్రహ్మోత్సవాలు



**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అత్యంత వైభవంగా జరిగే సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిదిరోజులు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగవైభవంగా జరిగే 'బ్రహ్మోత్సవాలు' ప్రధానం. ప్రతి మూడేళ్ళకోసారి అధికమాసం రావడంతో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు టిటిడి నిర్వహిస్తుంది. సాధారణంగా సెప్టెంబర్‌మాసంలో జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండువారాల తేడాతో జరిపించేలా ముహూర్తం ఖరారుచేస్తారు. భారతదేశంలోనే మరే ఆలయంలోనూ జరగని విధంగా ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలేశుని ఆలయంలో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్సవాలు"కు దేశవిదేశాల నుండి లక్షలాదిమంది భక్తులు నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివస్తారు. ఇష్టదైవమ్ వాహనసేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిదిరోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకారభూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. శ్రీవారి భక్తులకు ఈ ఏడాది అధికమాసం కావడంతో రెండుదఫాలు ఉత్స వాలు జరగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 15వతేదీ నుండి 23వరకు ,తిరిగి అక్టోబర్ 11నుండి 20వతేదీ వరకు కన్నులపండువగా బ్రహ్మాండనాయకుడి బ్రహ్మోత్సవాలకు తేదీలు ఖరారుచేశారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు శ్రీవేంకటేశ్వరస్వామి ఎంతో ఆనందంతో, ప్రసన్నంగా వుంటారని, తనను సేవించ వచ్చిన భక్తులను చిరుదరహాసంతో కటాక్షిస్తారని అర్చకస్వాముల వాక్కు. వాహనసేవల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారు కోరిన వరాలను ప్రసాదిస్తారనేది ఐతిహ్యం. ఉదయం పూట వాహనసేవలు 8గంటలకే మొదలవుతాయి. రాత్రి వేళ వాహనసేవలు 7గంటలకు ఆరంభవుతాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 14వతేదీ సాయంత్రం అంకురార్పణం, 15న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారంపడుతుంది. సెప్టెంబర్ 19న రాత్రి గరుడసేవ ,23వతేదీ చక్రస్నానంతో ముగుస్తాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. అక్టోబర్ 11న రాత్రి పెద్దశేషవాహనసేవ, 15న గరుడసేవ, 20వతేదీ చక్రస్నానం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శన సమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సారధ్యంలో దేవదేవుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.



## నారా భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** నారా భువనేశ్వరికి సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచి భార్య, తల్లి, వ్యాపారవేత్తగా మా జీవితాలకు భువనేశ్వరి వెలుగు అని కొనియాడారు. ఆమె సౌమ్యత, దయాగుణం ఎంతోమందికి స్ఫూర్తినిచ్చాయని, సమాజంలో మంచి మార్పు తీసుకురావాలనే ఆమె తపన ఎంతోమందికి స్ఫూర్తిఅని అన్నారు. ఒక అద్భుత వ్యక్తిని నా జీవిత భాగస్వామిగా పొందానని,జీవిత ప్రయాణాన్ని పంచుకుంటున్నందుకు ఎంతగానో కృతజ్ఞుడనై ఉన్నానని అన్నారు. ప్రతిరోజూ మా జీవితాలను ప్రకాశవంతంగా మారుస్తున్నందుకు ధన్యవాదాలన్నారు. రాబోయే కాలం భువనేశ్వరికి ఎంతో అద్భుతంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

## అమ్మకు జన్మదిన శుభాకాంక్షలు: మంత్రి లోకేశ్

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి నారా లోకేశ్ తల్లి భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనే ధైర్యం ఆమె సొంతం అని, ఇతరులకు



సాయం కోసం ఆమె చూపిస్తున్న అంకితభావం గొప్ప స్ఫూర్తి అని కొనియాడారు. ప్రేమ, మార్గదర్శకత్వంతో రోజూ జీవితాన్ని తీర్చిదిద్దుతున్న విలువలకు నా ధన్యవాదాలని అన్నారు. ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో ఉంటూ ఇలాగే సేవలందించాలని ఆకాంక్షించారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సిఎం, డి.సిఎం పుట్టిన రోజు శుభాకాంక్షలు

**విజయవాడ,జూన్ 20, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పుట్టినరోజు శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రపతికి రాజకీయ ప్రముఖులు శుభాకాంక్షలు చెబుతున్నారు. సోషల్ మీడియా ఎక్స్‌వేదికగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బర్త్ డే విషెస్ తెలియజేశారు. ద్రౌపది ముర్ము మంచి ఆరోగ్యంతో ఉండాలని, దేశానికి ఆమె అందిస్తున్న గొప్ప సేవల్లో విజయం సాధించాలని ఆకాంక్షిన్నాను అంటూ చంద్రబాబు పోస్ట్ చేశారు. నాయకులు కావాలనుకునే ప్రతి ఒక్కరికీ రాష్ట్రపతి ముర్ము నిజమైన స్ఫూర్తి దాయకమని పవన్ అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. నగర్ పంచాయతీ కౌన్సిలర్‌గా సేవలందించడం నుంచి భారతదేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగే వరకూ ఆమె సాగించిన ప్రయాణం అద్భుతమన్నారు. దేశసేవలో ఆమెకు మంచి ఆరోగ్యం,దృఢత్వం, దీర్ఘాయుష్షును ప్రసాదించాలని జగన్నాథస్వామిని ప్రార్థిస్తు న్నాను అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## అరుదైన వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక పాలసీ

**విజయవాడ,జూన్ 20, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుదైన వ్యాధిగ్రస్థులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ప్రత్యేక పాలసీ రూపొందించేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైనట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ పాలసీ ఫర్ రేర్ డీసీ జెస్2021కు అనుగుణంగా నూతన పాలసీని త్వరగా తయారు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వైద్య సేవలు, బాధితులకు తోడ్పాటును అందించేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి చెప్పారు. అలాగే మూడు రిఫరల్ కేంద్రాలు, ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ రిజిస్ట్రీ ఏర్పాటు, వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు పాలసీ తయారీపై సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు సత్యకుమార్ తెలిపారు. మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని పాలసీ తయారీకి సలహాలు, సూచనలు ఇచ్చినట్లు చెప్పారు. అతి త్వరలో పాలసీని రూపొందించి అరుదైన వ్యాధిగ్రస్థులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి సత్యకుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# తిరుమల సమాచారం

## నేడు గోవిందరాజస్వామి పుష్పయాగానికి అంకురార్పణ

**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం నిర్వహించే పవిత్ర పుష్పయాగ మహోత్సవానికినేటి ఆదివారం సాయంత్రం 5.30 గంటల నుండి రాత్రి 8.30 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. 22న (రేపు)ఉదయం 9.30 గంటలకు స్నపన తిరుమంజనం, అనంతరం మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4 గంటల వరకు పుష్పయాగ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సుగంధభరితమైన వివిధ రకాల పుష్పాలు, పవిత్ర పత్రాలతో గోవిందరాజస్వామికి విశేష అభిషేకం, అర్చనలు నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామివారి వీధి ఉత్సవం భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తనుంది. పుష్పయాగ సేవలో పాల్గొనదలచిన గృహస్తులు (ఇద్దరు) 516 రూపాయలు టికెట్‌ను కొనుగోలు చేసి ఈ దివ్యసేవలో భాగస్వాములు కావచ్చని ఆలయ అధికారులు తెలిపారు. ఈ ఏడాది మే 23 నుండి 31 వరకు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు, నిత్యకైంకర్యాలలో అర్చకులు, పరిచారకులు, అధికారులు, సిబ్బంది, భక్తుల వల్ల తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ పుష్పయాగాన్ని నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు వివరించారు. ఈ దివ్య పుష్పయాగ మహోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని టిటిడి కోరింది.



## వర్షాభావ పరిస్థితులెదురవుతున్నా వరుణయాగం జరిపించరా?
### సనాతనధర్మం ఇదేనా అంటూ భక్తుల ఆగ్రహం



**తిరుమల, జూన్ 20 ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణంగా వేసవికాలంలో అందునా నైరుతిరుతు పవనాలు సకాలంలో ప్రభావం చూపాల్సి ఉన్నా వర్షాలు కురవడంలేదు. పైగా నైరుతి ఈ ఏడాది పెద్దగా సహకరించదనేది వాతావరణ శాస్త్రవేత్తల సమాచారం. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. శేషాచలం కొండల్లోని తిరుమలలోనూ వర్షాభావంతో ఐదు ప్రధాన జలాశయాల్లో నీరు క్రమేణా తగ్గిపోతోంది. ప్రస్తుతానికి 80రోజులకు సరిపడే నీరు మాత్రమే అందుబాటులో ఉంది. జూన్ మూడవ వారం వచ్చేస్తున్నా అటు వర్షాలుగానీ ఇటు నైరుతి రుతుపవనాలు గానీ సానుకూలత చూపడం లేదు. దీంతో వర్షాభావం తప్పదని శాస్త్రవేత్తల సూచన. ఈ నేపథ్యంలో దేశం,రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉండేందుకు టిటిడి ఆగమ పండితులుఆధ్వర్యంలో కరవు పోవడానికి, సమృద్ధిగా వర్షాలు కురవడానికి తిరుమలలో కారేరీష్టి వరుణయాగం, మహావరుణజపం నిర్వహించడం పరిపాటి. దీనివల్ల పుష్కలంగా వర్షాలు కురుస్తాయి. ఇప్పుడు జూన్ మూడవ వారంలోనూ ఎండతీవ్రత ఏప్రిల్,మేనెలను తలపింపజేస్తోంది. వర్షాభావ పరిస్థితులు తలెత్తుతున్నాయి. లోకకల్యాణార్థం కారేరీష్టి వరుణయాగం నిర్వహించాలని భక్తులు, ఆగమసలహామండలి కూడా చెబుతున్నారు. అయితే టిటిడి బోర్డుగానీ, టిటిడి అధికారులుగానీ ఆ దిశగా ఆలోచన చేయ లేక పోగా నిర్లక్ష్యంగా ఉంటున్నారనేది విమర్శలు. పైగా దేవునిపై నమ్మకంతో ఈ వరుణజపాలు, యాగాలు చేపడితే వరుణదేవుడు కరుణిస్తాడని అర్చకుల విశ్వాసం. మరీ టిటిడి పెద్దలు ఆ దిశగా ఎందుకు ఆలోచన చేయడంలేదనేది మాత్రం కొసమెరుపే. ఆగమపండితులు కూడా టిటిడి బోర్డుకు, అధికారులకు ఎందుకు సూచనలు చేయడం లేదనేది ఇప్పుడు అర్చకుల్లో చర్చనీయాంశం.

## కమాండ్ కంట్రోల్ సెంటర్ చొరవతో
# తప్పిపోయిన బ్యాగ్ అప్పగింత

**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలపై భక్తుల రద్దీనియంత్రణతోబాటు సాఫీగా క్యూలైన్లు కదిలేలా, భక్తుల కదలికలను గమనించేలా ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. భక్తులు తప్పిపోయినా, విలువైన వస్తువులు మరచిపోయినా వెంటనే కనిపెట్టి భక్తులకు అందిస్తున్నారు. తాజాగా తెలంగాణకు చెందిన భక్తుడు వంగ మల్లేష్ గౌడ్ అలిపిరి చెక్ పాయింట్ (స్కానర్) వద్ద తన బ్యాగును అనుకోకుండా తిరుమలకు దర్శనార్థం వస్తూ మరచి పోయారు. వెంటనే ఆయన తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేయగా, సిబ్బంది సిసిటీవీ ఫుటేజీల ఆధారంగా బ్యాగును తీసుకెళ్లిన వాహనాన్ని గుర్తించారు. తిరుమల కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. దీంతో మల్లేష్ గౌడ్ రాత్రి శుక్రవారం 11:30 గంటలకు తిరుమల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సిబ్బంది వాహనాన్ని కనిపెట్టారు. తెల్లవారుజామున



3:30 గంటలకు బాలాజీ గెస్ట్ హౌస్ నంబర్ 4 వద్ద ఆ వాహనంలోని భక్తులను గుర్తించారు. వారిలో లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ స్కానింగ్ సమయంలో పొరపాటున ఆ బ్యాగు తమ వద్దకు వచ్చిందని, స్వామివారి దర్శనం కోసం వచ్చినట్లు తెలిపారు. ఆ బ్యాగ్‌ను పరిశీలించగా అందులోని అన్ని వస్తువులతో పాటు 50 గ్రాముల బంగారం కూడా యథాతథంగాఉండటంతో బ్యాగును వంగ మల్లేష్‌గౌడ్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా భక్తుడు కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది చొరవ, అప్రమత్తతకు కృతజ్ఞతలు తెలిపారు.

# దీర్ఘకాలిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిద్దాం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, జూన్ 20 ప్రభాతవార్త:** కాగితంపై ఉండే వివరాలు, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే ఇబ్బందులను సరిగ్గా బేరీజు వేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావడంలో రెవెన్యూ వ్యవస్థ సమర్ధవంతంగా పని చేస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో జరిగిన రెవెన్యూ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. రెవెన్యూ వ్యవస్థ కీలక సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ ఉద్యోగులను సత్కరించారు. ఈ సంధర్భంగా మాట్లాడిన రామ్మోహన్ నాయుడు రాజ్యాలు నపడడానికి రాజుల కాలాల నాటి నుండే రెవెన్యూ వ్యవస్థ ఉండేదని వేల సంవత్సరాల చరిత్ర కలిగిన శాఖలో ఆ గౌరవాన్ని కాపాడుకుంటూ వస్తున్న ఉద్యోగ వర్గానికి రెవెన్యూ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుత విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలు కార్యరూపం దాల్చాలంటే రెవెన్యూ వ్యవస్థ అత్యంత కీలకమైందని మంత్రి అన్నారు. దీర్ఘకాలిక సమస్యలను ముందుగా గుర్తించి నెలకు ఒక సమస్యపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించి పరిష్కార మార్గంతో ప్రజా ప్రతినిధులను సంప్రదించే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని కలెక్టర్‌ను రామ్మోహన్ నాయుడు కోరారు.

పరిష్కారమే ప్రధానంగా రెవెన్యూ వ్యవస్థ సమస్యలను తీసుకోవాలని రామ్మోహన్ నాయుడు అన్నారు. పేపర్‌పై కనిపించే అంకెలకి క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే పరిస్థితులకు ఎంతో వ్యత్యాసం ఉందని వాటిని సరిగ్గా బేరీజు వేసుకుని ప్రజలకు లబ్ధి చేకూర్చడంలో రెవెన్యూ వ్యవస్థ విలువైన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తోందని కితాబిచ్చారు. వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్న శ్రీకాకుళం జిల్లాలో రెవెన్యూ అధికారులు తీసుకునే నిర్ణయాలు అత్యంత కీలకమని తెలిపిన రామ్మోహన్ నాయుడు వారి సహకారంతోనే జిల్లాలో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కార మార్గాలను చూపించాలని స్పష్టం చేశారు.

పలాస ఎయిర్‌పోర్ట్ నిర్మాణంలో ప్రజలకు అనుమా నాలను నివృత్తి చేసి జరిగే అభి వృద్ధిపై అవగా హన కల్పించాలని రెవెన్యూ అధికారులను రామ్మో హన్ నాయుడు కోరారు. 1866లో ప్రారంభమైన రెవెన్యూ వ్యవస్థ నేటికీ ప్రభుత్వ పరిపాలనలో కీలక పాత్ర పోషిస్తోం దన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతిని ధులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. వివిధ మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ పరిపాలనా సిబ్బంది మరియు రెవెన్యూ సర్వీసెస్ అసోసి యేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టాలి

## ఎపి జెఎసి ఛైర్మన్ ఎ.విద్యాసాగర్

**విజయవాడ, జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని ఎ పి జె ఎ సి ఛైర్మన్ఎ.విద్యాసాగర్ అన్నారు విద్యాసాగర్ అధ్యక్షతన శనివారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రటేరియట్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని కీలక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించడం, ఉద్యోగులపై నమోదైన కేసులను ఉపసం హరించుకోవడం, రూ.21 వేల కోట్ల బకాయిలను చెల్లించడం, ఉద్యోగ విరమణ



వయస్సును 62 సంవత్సరాలకు పెంచడం, మెమో 57 పై సానుకూల ఉత్తర్వులు, 8 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ ప్రక్రియకు ఆమోదం తెలిపి ప్రక్రియను ప్రారంభం చేయడం వంటి నిర్ణయాలను స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే ఉద్యోగుల ప్రధాన డిమాండ్ అయిన వేతన సవరణ కమిషన్ నియామకంపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. 2023 నుంచి పీఆర్సీ లేకపోవడంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. జే ఏ సి రాష్ట్ర సెక్రటరీ జనరల్ కె ఎస్ ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం లో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరి పట్ల ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. జూలై నెలాఖరులోగా ప్రభుత్వం స్పందించకపోతే, జూలై 26వ తారీఖున రాష్ట్రవ్యాప్తంగా ఏపీజేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేసి కార్యాచరణ చేయాలి. ఈ విషయంలో ఉద్యమానికి గాని, ఐక్య ఉద్యమాలకు గాని వెనుకాడే ప్రసక్తి లేదన్నారు.

## అందరికీ శుభాలు కలగాలి: నందమూరి మోక్షజ్ఞ



**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** నందమూరి బాలకృష్ణ కుమారుడు నందమూరి మోక్షజ్ఞ త్వరలోనే సినీరంగంలోకి అడుగుపెట్టనున్నారు. శనివారం ఉదయంఆయన తిరుమలకు వచ్చారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం ఆయనకు వేదశీర్వచనం అందించిస్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన మోక్షజ్ఞను చూడటానికి అభిమానులు ఉత్సాహం చూపారు.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.20 లక్షలు విరాళం

**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా ఉచిత అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన వడ్లమూడి లలిత్ కుమార్, యలమంచిలి కృష్ణారావులు వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు ఇద్దరూ కలసి 20 లక్షలు రూపాయలు విరాళాలు అందించారు. దాతలు టిటిడి ఛైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం చెక్కులను అందజేశారు.



# ఉగ్రకుట్ర కేసులో రెండో నిందితుడిపై ఛార్జ్‌షీట్

## విజయవాడ ప్రత్యేక కోర్టులో అభియోగపత్రం సమర్పించిన దర్యాప్తు సంస్థ
## ఒక వర్గం నేతలను లక్ష్యంగా దాడులకు ప్లాన్ చేసినట్లు ఎన్ఐఏ వెల్లడి

**విజయవాడ,జూన్ 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసం పేలుడు పదార్థాలను సేకరించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో రెండో నిందితుడిపై శుక్రవారం విజయవాడలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులో అభియోగపత్రం (ఛార్జ్‌షీట్) దాఖలు చేసింది. షేక్ మన్సూర్ అలియాస్ మహమ్మద్ అలీ అలియాస్ విజయకుమార్‌ను నిందితుడిగా పేర్కొంటూ ఎన్ఐఏ ఈ ఛార్జ్‌షీట్‌ను సమర్పించింది. అతనిపై చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం , భారతీయ న్యాయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద అభియోగాలు మోపింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ అమానుల్లా అలియాస్ అబూబకర్ సిద్ధిఖీకి మహమ్మద్ అలీ అత్యంత సన్నిహితుడని, కుట్రలో కీలక పాత్ర పోషించాడని ఎన్ఐఏ వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటికే అమానుల్లాపై ఫిబ్రవరి 2026లో ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా, ఇప్పటివరకు ముగ్గురిని అరెస్టు చేశారు. 2025లో అమానుల్లా నివాసంలో జరిపిన సోదాల్లో పేలుడు పదార్థాలు, ఇతర కీలక సామాగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమానుల్లానే మహమ్మద్ అలీని ఉగ్రవాదం వైపు ప్రేరేపించి, బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చాడని దర్యాప్తులో తేలింది. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని ఒక రహస్య ప్రాంతానికి పేలుడు పదార్థాలను తరలించడంలో అలీ సహకరించాడని, అతను నకిలీ పత్రాలతో తన గుర్తింపును దాచి నివసిస్తున్నాడని ఎన్ఐఏ పేర్కొంది. ఒక వర్గానికి చెందిన నేతలను లక్ష్యంగా చేసుకుని హత్యలు చేయడం ద్వారా సమాజంలో భయాందోళనలు సృష్టించి, దేశంలో షరియా చట్టాన్ని స్థాపించాలనే ఎజెండాతో వీరిద్దరూ కుట్ర పన్నారని ఎన్ఐఏ వివరించింది. మహమ్మద్ అలీ 1999లో తమిళనాడులో జరిగిన బాంబు పేలుళ్ల కేసులోనూ నిందితుడిగా ఉండి, పరారీలో ఉన్నట్లు దర్యాప్తు సంస్థ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి ఈ కేసును స్వీకరించిన ఎన్ఐఏ, లోతైన దర్యాప్తును కొనసా గిస్తోంది. ఈ క్రమంలో అవసరమైతే అదనపు ఛార్జ్‌షీట్లు దాఖలు చేసే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

# సాయికృష్ణ అదృశ్యం కేసు దర్యాప్తు ముమ్మరం

## స్వర్గపురి శ్మశానవాటికను పరిశీలించిన పోలీసులు

**విజయవాడ,జూన్ 20. ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో సాయికృష్ణ అదృశ్యం కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సాయికృష్ణ డెడ్‌బాడీని స్వర్గపురి శ్మశానవాటికలో దహనం చేశారని ఆరోపణలు వస్తుండటంతో అక్కడ ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. మే 24, 25 తేదీల్లో స్వర్గపురి శ్మశానంలో జరిగిన గుర్తుతెలియని మృతదేహాల దహనంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మే 23వ తేదీ రాత్రి 8 గంటలకు రెండు గుర్తుతెలియని మృతదేహాలను స్వర్గపురికి తీసుకువచ్చినట్లు సిబ్బంది చెబుతున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత స్వర్గపురిలోకి మృతదేహాలకు ప్రవేశం ఉండదు. దీంతో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లో చెప్పటంతో రెండు మృతదేహాలను సిబ్బంది స్వర్గపురి మార్చురీలో ఉంచారు. రెండు మృతదేహాలను మే 24న ఖననం చేసినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ రెండు మృతదేహాలు 40 ఏళ్లు పై బడిన వారివిగా రికార్డుల్లో నమోదు అయ్యింది. 23 ఏళ్ల యువకుడిని దహనం చేసినట్లుగా ఎలాంటి రికార్డు నమోదు కాలేదు. స్వర్గపురిలో ఎలక్ట్రిక్ దహనాలు చేసే బాషాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విచారణ నిమిత్తం బాషాను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాషా ఫోన్‌ను సీఐ పవన్ కిషోర్ స్వాధీనం చేసుకున్నారు. సాయికృష్ణ అదృశ్యంపై కృష్ణలంక పీఎస్‌లో విచారణ చేప ట్టారు. ఏసీపీ దైవప్రసాద్ బృందం టాస్క్‌ఫోర్స్ పోలీసులను ప్రశ్నిస్తున్నారు. మార్కాపురం నుంచి సాయికృష్ణను విజయవాడ తీసుకొచ్చారా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. ఏసీపీ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సిబ్బంది నుంచి స్టేట్‌మెంట్లు రికార్డ్ చేస్తున్నారు. ఇక తాజా సమాచారాన్ని అనుసరించి సాయికృష్ణ అదృశ్యం కేసు. మలుపులు తిరుగుతూ స్వర్గపుర్తి శ్మశానవాటికకు చేరింది. సాయికృష్ణను హత్య చేసి, అతని డెడ్‌బాడీని స్వర్గపురిలో గుట్టుచప్పుడు కాకుండా దహనం చేశారనే ఆరోపణల నేపథ్యంలో... పోలీసులు అక్కడకు వెళ్లి ఆధారాలు సేకరిస్తున్నారు. మే 23వ తేదీ రాత్రి 8 గంటలకు గుర్తు తెలియని మృతదేహాలను శ్మశానవాటికకు తీసుకు వచ్చినట్టు సిబ్బంది చెబుతున్నారు.

మే 24న వాటిని దహనం చేయడంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. రికార్డుల్లో మృతదేహాలు 40 ఏళ్లకు పైబడిన వారివిగా ఉన్నాయి. సాయికృష్ణలాంటి యువకుడి దహన రికార్డులు ఎక్కడా లేవు. ఈ వ్యవహారంలో స్వర్గపురిలో ఎలక్ట్రిక్ దహనాలు నిర్వహించే బాషా అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీఐ పవన్ కిశోర్ అతని ఫోన్‌ను స్వాధీనం చేసుకుని లీగల్ కాల్ డేటాను పరిశీలిస్తున్నారు.

# మొదలైన బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

## సిద్ధమవుతున్న మాడవీధుల సూచిక బోర్డులు




**తిరుమల,జూన్ 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఈ ఏడాది జరగనున్న రెండు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు సాఫీగా కొండ ముస్తాబు చేసేందుకు అవపరమైన పనులు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, అలం కరణలు, మాఢవీదుల్లోకి వెళ్ళేందుకు ప్రవేశ నిష్క్రమణ మార్గాల సూచికబోర్డులు, అవసరమైన స్టాండ్‌లు ఇలా మెల్లగా సకల సౌకర్యాల కల్పన పనులు మొదలయ్యాయి. శ్రీవారికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు జరుగుతుంటాయి. వీటిల్లో సంవత్సరానికోసారి జరిగే తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత వుంది. సాక్షాత్తు బ్రహ్మదేవుడే కలియుగానికి విచ్చేసి దేవదేవునికి ఉత్సవాలు నిర్వహిస్తాడని ప్రతీతి. భక్తులు కూడా లక్షలాదిమంది ఈ తొమ్మిది రోజులు తిరుమలలోనే వుండి తమ ఇష్టదైవం వాహనసేవల్లో పాల్గొంటూ ముక్తికోసం తపిస్తుంటారు. ఈ ఏడాది అధికమాసం రావడంతో తిరుమలేశునికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా చూడనున్నారు. దానికితోడు అదే సెప్టెంబర్‌లో పెరటాసి శనివారాలు కూడా రానుండటంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశాలు ఉన్నాయి.

# ఆరోగ్య 'యోగం'

హిందూఆధ్యాత్మిక సంప్రదాయంలోభాగమైనయోగాన్నిశాస్త్రీయంగా క్రోడీకరించిన ఆధ్యుడుపతంజలి.క్రీ.పూ.100 500వశకము మధ్య కాలములో పతంజలి యోగ సూత్రాలను రచించినట్లు పరిశోధనల ద్వారా తెలుస్తోంది. వేదములు, పురాణములు, ఉపనిషత్తులు, రామా యణము, మహాభారతము, భాగవతము, భగవద్గీతలలో యోగా ప్రస్థావన కలదు. వాటి నుంచి పతంజలి క్రోడీకరించినవే యోగ సూత్రాలు. సూత్రము అంటే దారము. దారములో మణులను చేర్చినట్లుగా యోగ సూత్రాలను పతంజలి ఒకచోట కూర్చి మనకు అందించెను. వాటిలో హఠయోగ ప్రదీపిక, శివ సంహిత ప్రధాన భాగాలు. అంతర్భాగ్యాలైన కర్మ యోగము, జ్ఞానయోగము, రాజ యోగము, భక్తియోగము మొదలగు నవి హిందూతత్త్వములో భాగాలు. భగవద్గీతలో యోగములు 18 అధ్యాయములుగా విభజించిచెప్ప బడినవి. యోగము అనే పదము యుజ్ అనే ధాతువు నుండి ఉత్పన్నమైనది. యుజ్ అంటే కలయిక. 'యుజ్యతే ఏతదితి యోగః' 'యుజ్యతే అనేన ఇతియోగః': వంటి నిర్వచనాల ద్వారా ఏర్పడినది. యోగమనగా ఇంద్రియములను వశపరచుకొని చిత్తమును ఈశ్వరుని యందు లయంచేయుట, ఇంద్రియములను వశపరచ కొనుటకు శారీరిక వ్యాయామ ప్రక్రియలనే లౌకికంగాయోగా అని వ్యవహారించటం జరుగు తోంది. ఇంద్రియ నిగ్రహము కలిగి నప్పుడు మనసు ఏకాగ్రత తో ధ్యాన సాధన చేసి మోక్షసాధన చేయ గలము. ఇటు వంటి




ఏకాగ్రతతో పరమార్థ తత్త్వము టనకు త్రోవ చేసుకొని పోవచ్చును. ఆత్మతనలోని గూఢంగా ఉన్న నిజశక్తిని సాధిస్తుంది .ఇలా ఆంత రంగికమైన శిక్షణకుభిన్న మార్గాలు న్నాయి. వాటిని వివిధ యోగ విధానాలలో సూత్రకారులు విభ జించారు. యోగము అనగాసాధన, అదృష్టము అనే రెండు అర్థాలు న్నాయి. భారతీయ తత్త్వశాస్త్రము లోని ఆరు దర్శనాలలో 'యోగ' లేదా 'యోగ దర్శనము' వ్యాయా మసాధనల సమాహారాల ఆధ్యాత్మిక రూపం. ఇది హిందుత్వ ఆధ్యాత్మిక సాధనలో ఒక భాగము. మోక్ష సాధనలో భాగమైన ధ్యానం, అంత: దృష్టి, పరమానంద ప్రాప్తిలాంటి ఆధ్యా త్మిక పరమైన సాధనలకు పునాది. హఠయో గములో భాగమైన శారీరక ఆసనాలు శరీరారోగ్యానికి, మానసిక వికాశానికి, శరీరధారు ఢ్యానికి, ముఖ వర్చస్సు ఇనుమ డింప చేయటానికి దోహదం చేస్తాయి. నిత్యము ఆసనములను క్రమబద్ధముగా చేయుచూ నూరు వసంతాల జీవితము ఆరోగ్యంగా, సంతోషంగా జీవించవచ్చును. భారతదేశములో 21 జూన్ 2016 నుంచి యోగా దినోత్సవము జరుపు కుంటున్నాము. ఆరోగ్యమే మనకు ప్రధాన భాగ్యము కనుక ఆరోగ్యంతో ఉంటే అభివృద్ధికి బాటలు వేయాలనే ఆలోచన కలుగుతుంది. ప్రయత్నిస్తే తప్పక కార్య రూపందాల్చి అభివృద్ధికి బాటలు వేస్తుంది. అందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు.

**డా.దేవులపల్లి పద్మజ**

**సంగీ చిత్ర లేఖనం, ఇలా లలిత కళలు ఐదు. కానీ మిగతా వాటికి భిన్నమైన దారి సంగీతానిది. సంగీతానిది ఎలాంటి ఎల్లలూ, హద్దులూ లేవని విశ్వభాష. సంగీతం మనసుకు హాయిని కలిగిస్తుంది కొన్ని రకాల అనారోగ్యాలను తొలగిస్తుంది.**

ముఖ్యంగా మానసిక ఆరోగ్యానికి సంగీతంతో చికిత్స చేయవచ్చు. జూన్ 21న

## విశ్వభాష సంగీతం



ప్రపంచ సంగీతం దినోత్సవం. ఈ సందర్భంగా సంగీతం మనిషి జీవితంతో ఎంతగా పెనవేసుకుని పోయిందో, అన్ని రోజులూ మన వీనులకు విందుగా వించే సంగీతానికే ప్రత్యేకంగా ఓ రోజుంటూ కేటాయించారు. మనకు నచ్చన పాట లేదా మనకు హత్తుకునే సంగీతం విన్నప్పుడు మనకు తెలీకుండానే ఒక రకమైన తన్మయత్వం కలుగుతుంది. ఎప్పుడైనా కాస్త డీలా పడినట్లు, ఒత్తిడికి లోనైనట్లు అనిపించి నప్పుడు ఒక మంచి పాట, వీనుల విందైన సంగీతం వింటే ఒత్తిడి మొత్తం ఎగిరిపోతుంది.

**సంగీతం.. సార్వజనీయం....** పొత్తిళ్లలోని పాపాయి ఉంగా ఉంగా అని చేసి శబ్దంలో ఉంది సంగీతం. తల్లి తన బిడ్డను ఊయలలూ పుతూ పాడే లాలిపాటల్లో ఉంది సంగీతం, ఏడుస్తున్న పసిబిడ్డ ఆ ఏడుపు ఆపి హాయిగా కేరింతలు కొట్టేట్లు చేయగల అమ్మలు, బామ్మల జోలపాటల్లో ఉంది సంగీతం, శ్రమైక జీవులు తమకు అలుపు తెలీకుండా పాడుకునే పాటల్లో ఉంది సంగీతం. ఇవన్నీ కూడా ఎలాంటి శాస్త్రీయపద్ధతిని పాటించక పోయిన ప్పటికీ ఒక సొగసైన తాళం, రమ్యమైన లయతో సాగుతుంటాయి. మనషులే కాదు ఇతర ప్రాణులకూ ఉంది సంగీత జ్ఞానం. నాగస్వరం విన్న సర్పాలు సొగసుగా నాట్య మాడటం, చైత్రమాసాన లేత మామిడి చివుళ్ల తిన్న కొయిలమ్మ కుహూ కుహూ రాగమాలపించటం, సంగీతం వింటూ ఆవులు పాలు సమృద్ధిగా ఇవ్వడం మనకు తెలిసిందే.


**ఐక్యరాజ్యసమితి ప్రకటన ...** ప్రజల మనస్సుల్లో, ఆలోచనల్లో సంగీతాన్ని నిత్య నూతనంగా ఉంచాలన్న ఉద్దేశ్యంతో ఐక్యరాజ్య సమితి జూన్ 21ని ప్రపంచ సంగీత దినోత్సవంగా నిర్వహించాలని ప్రతిపాదించింది. దీని ప్రకారం ప్రతి ఏడాది ప్రపంచమంతటా జూన్ 21ని వరల్డ్ మ్యూజిక్ డేగా పాటించాలని ప్రకటించింది. ఇది క్రమంగా అన్ని దేశాలకు, నగరాలకు వ్యాపించి వరల్డ్‌మ్యూజిక్ డేకు ప్రాచుర్యంలభించింది. ◻

# నాన్నా ! నీ మనసే వెన్న !

**ప్రకృతిలో ప్రతి జీవికీ ఒక పునాది ఉంటుంది. మానవ జీవిత నిర్మాణంలో ఆ పునాది రాయి 'నాన్న'. అమ్మ ప్రేమ ఒక వెచ్చని కౌగిలి అయితే, నాన్న ప్రేమ ఒక కొండంత భరోసా. సమాజంలో, కుటుంబంలో ఒక వ్యక్తి స్థిరంగా నిలబడా లన్నా, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలన్నా, కష్టాల కడలిని ఈదాలన్నా నాన్న అందించే స్ఫూర్తి కవచంలా పనిచేస్తుంది.**




ప్రపంచంలో ఏ సంబంధమైనా ఏదో ఒక ప్రతిఫలాన్ని ఆశిస్తుంది, కానీ నాన్న ప్రేమ మాత్రం ఏ ప్రతిఫలం ఆశించదు. తన కష్టాన్ని, అలసటను, అనారోగ్యాన్ని సైతం మనసులోనే దాచుకుని, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించే ఏకైక నిస్వార్థ జీవి నాన్న. ఒక బిడ్డకు బాహ్య ప్రపంచంతో పరిచయం పెంచే మొదటి గురువు, గమ్యాన్ని చేరుకోవడానికి మార్గదర్శకం చేసే అద్భుత శిల్పి నాన్నే. పితృదినోత్సవం వెనుక ఎంతో స్ఫూర్తి దాయకమైన కథనాలు ఉన్నాయి. ఈ రోజు కేవలం ఆధునిక కాలపు వేడుక మాత్రమే కాదు. దీని వెనుక ఒక మహత్తర మైన త్యాగశీలత ఉంది. 1910లో అమెరికాలోని వాషింగ్టన్ రాష్ట్రానికి చెందిన 'సోనోరా స్మార్ట్ డాడ్' అనే మహిళ, తనను మరియు తన ఆరుగురు తోబుట్టువులను ఒంటరిగా పెంచి, తండ్రిగా మరియు తల్లిగా బాధ్యతలు నిర్వర్తించిన తన తండ్రి "విలియం జాక్సన్ స్మార్ట్" త్యాగనిరతికి గుర్తింపుగా ఈ పితృ దినోత్సవాన్ని ప్రారంభించారు. అప్పటి నుండి ఇది ప్రపంచవ్యాప్తంగా తండ్రుల అపారమైన త్యాగానికి చిహ్నంగా నిలిచింది. నాన్న ఒక అంతులేని అనుబంధం, ఒక బాధ్యతకు మారుపేరు. అమ్మ ప్రేమకు చిరునామా అయితే నాన్న బాధ్యతకు, భద్రతకు మారుపేరు. బయట ప్రపంచంలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా, ఎంతటి కఠినమైన పరిస్థితులు ఎదురైనా వాటన్నింటినీ వదిలేసి ఇంటి లోపలికి రాగానే పిల్లలతో కలిసి నవ్వుతూ కనిపించే గొప్ప ప్రేమామృతమూర్తి నాన్న. పిల్లల కళ్లలో ఆనందం కోసం తన సొంత ఇష్టాలను, ఆశలను పక్కన పెట్టి వారిని గెలిపించడానికి తన జీవితాన్ని దారపోసే యోధుడు నాన్న. పిల్లలకు ప్రపంచాన్ని పరిచయం చేయడమే కాదు, ఆ ప్రపంచంలో వారు ఎలా బతకాలో, విలువలతో కూడిన జీవితాన్ని ఎలా గడపాలో తన ప్రవర్తన ద్వారానే నేర్పిస్తారు. పిల్లలు పెంపకంలో కూడా నాన్నది ప్రత్యేకమైన బాట. నాన్న పెంపకం అమ్మ పెంపకం కంటే భిన్నమైనది. అమ్మ ఓదార్పునిస్తే నాన్న ధైర్యాన్ని ఇస్తారు. నాన్న పెంపకంలో ఒక గాంభీర్యం, క్రమశిక్షణ ఉంటుంది. అమ్మ ప్రేమను పంచితే, నాన్న బాధ్యతను, లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. కష్టాల్లో ఉన్నప్పుడు ఎలా నిలబడాలో, ఓటమి ఎదురైనప్పుడు అధైర్యపడకుండా, తిరిగి ఎలా గెలవాలో నేర్పే పాఠాలు జీవితాంతం వెన్నంటే ఉంటాయి. 'నో' చెప్పడంలో కూడా పిల్లల శ్రేయస్సును కోరుకునే క్రమశిక్షణ తండ్రి సొంతం. పిల్లలకు సంస్కారం, సమయపాలన, నిజాయితీ, కష్టపడే తత్వం వంటి సద్గుణాలను పిల్లలకు తన చేతల్లోనే చూపిస్తారు. నిజానికి నాన్న అంటే కేవలం ఇంట్లో ఒక వ్యక్తి మాత్రమే కాదు. అది ఒక పాఠశాల.



అమ్మ దగ్గర మనం ప్రేమని ఎలా పంచుకుంటామో, నాన్న దగ్గర జీవితానికి కావాల్సిన నిర్భయత్వాన్ని అలా పుణికి పుచ్చుకుంటాం. క్రమశిక్షణ అందించ డంలో కూడా అమ్మకంటే నాన్నదే పై చేయిగా ఉంటుంది. ఇంకా జీవితంలో పరాజ యాలు ఎదురైన ప్పుడు కృంగిపోకుండా మళ్ళీ ఎలా నిలబడాలో నాన్న ఇచ్చే ధైర్యం మరే పుస్తకాలలోను దొరకదు. 'పర్వాలేదు మళ్ళీ ప్రయత్నిద్దాం' అని ఆయన పలికే ఆ ఒక్క మాట 100 మంది ప్రోత్సహించిన దానికంటే ఎక్కువ శక్తినిస్తుంది. సంపద కంటే సంస్కారమే మిన్న అని ఎదుటివారిని గౌరవించడం, చిన్న వారిని ఆదరించడం, కష్టంలో ఉన్న వారికి అండగా ఉండడం, లాంటి సామాజిక బాధ్యతలను నాన్న మనకి ఓ స్నేహితునిలా నేర్పిస్తారు. ఆచరణలో చూపించిన ఈ విలువలు వల్ల పిల్లలు కేవలం చదువులోనే కాదు మనుషులను అర్థం చేసుకోవడం కూడా ఉత్తములుగా ఎదుగుతారు. పిల్లల ఆలోచనలను గౌరవిస్తూ వారిని సరైన మార్గంలో పెట్టేందుకు ప్రయత్నించే నాన్న బిడ్డకు ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన ఆశ్రయం. 'నాన్న' అనే రెండక్షరాల పదంలో ఒక ధైర్యం ఉంది, ఒక అభయం ఉంది, ఒక సంపూర్ణ ప్రపంచమే ఉంది. పితృదినోత్సవం అనేది కేవలం ఒక రోజుకే పరిమితం కాకూడదు. ప్రతిరోజూ నాన్నని ప్రేమతో పలకరిద్దాం, కంటికి రెప్పలా కాపాడుకుందాం. ఆయన ఆశయాలను నిజం చేయడమే మనం ఆ మహనీయునికి ఇచ్చే ఘనమైన బహుమతి. నాన్న ఆత్మీయ స్పర్శకు, నిస్వార్థ ప్రేమకు, అంతులేని త్యాగానికి శిరసు వంచి నమస్కరిస్తూ నాన్నకు ప్రేమతో... శుభాకాంక్షలు.

**- పింగళి భాగ్యలక్ష్మి**

**అంతర్వాణి**

# భయ భక్తులుంటే చాలు !

అడవిలోని ఓ నక్క దారితప్పి అర్థ రాత్రివేళ ఓ గ్రామంలోకి ప్రవేశించింది. రాత్రివేళ గ్రామం అంతా గాఢనిద్రలో ఉండి పోయింది. ఆకలి వేసిన ఆ నక్కకు ఓ ఇంటిముందు కట్టేసిన మేకలు కనిపిం చాయి. వెంటనే ఆ నక్క ఓ మేకతో కడుపునింపుకునేందుకు యత్నించింది. ఇంతలో మేకలు భయంతో గట్టిగా కేకలు వేశాయి. ఆ కేకలకు గ్రామప్రజలకు మెలకువ వచ్చి, నక్కను తరిమి కొట్టారు. భయంతో అది పరుగులు తీస్తూ, ఓ గుంటలోపడి పోయింది. గ్రామస్తులు ఇక దాన్ని తరమడం ఆపి, వెళ్లి నిద్ర పోయారు. తెల్లవారుజామున నక్క బతుకుజీవుడా అంటూ గుంటలోనుంచి బయటపడి, తిరిగి అడవిలోకి వెళ్లిపోయింది. అయితే గుంటలోని నీరు కలుషితం వల్ల నక్క శరీరం కాస్త ఎర్రగామారిపోయింది. నక్కను చూసిన అడవి జంతువులు ఇదేదో కొత్తరకం జంతువులా ఉందని, దాన్ని అడవికి రాజుగా ప్రకటించాయి. సింహం కూడా ఏమీ చేయలేకపోయింది. ఇక జంతువులు రోజూ ఆ నక్కకు ఆహారం తెచ్చిపెట్టసాగాయి.నక్కకు కూడా చాలా హాయిగా అనిపించింది. ఏకష్టం లేకుండా జంతువులు తెచ్చే ఆహారాన్ని తింటూ, సుఖపడ సాగింది.అయితే వర్షాకాలం రానే వచ్చింది. వర్షం నీరు నక్కపై పడగానే, దాని దేహం మళ్లీ మామూలుగా మారింది. దీంతో జంతువులు కొత్తరకం జంతువు కాదు, నక్కని గ్రహించి, దానికి తిండి పెట్టడం మానేశాయి. సమాజంలో చాలామంది క్రైస్తవులు ఇలాగే ఉన్నారు. పైకి భక్తిగలవారుగా కనిపి స్తున్నారు. అంతరంగంలో దేవుడికి చాలా దూరంగా జీవిస్తున్నారు. చాలామంది క్రైస్తవ పద్ధతులకు ఇచ్చే ప్రాధాన్యత, దేవుడి సన్నిధికి ఇవ్వడం లేదు. 'రక్షణ' అనే విషయాన్ని చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు. జీవం లేని క్రైస్తవభక్తిని ప్రదర్శిస్తున్నారు. దేవుడంటే ఏమాత్రం భయం లేదు. అందుకే సంఘాల్లో గొడవలు, అంతర్గత కలహాలు. విశ్వాసుల మధ్య ప్రేమ లేదు, దేవుడి ఆజ్ఞల్ని లైట్గా తీసుకుని, తమకు ఇష్టమైవిధానంలో జీవిస్తున్నారు. నక్కలా నటిస్తు న్నారు. 'నీయందు భయభక్తులు గలవారి నిమిత్తము నీవు దాచియుంచిన మేలు యెంతోగొప్పది. నరులయెదుట నిన్ను ఆశ్రయించువారి నిమిత్తము నీవు సిద్ధ పరచిన మేలు ఎంతో గొప్పది' (కీర్తనలు 31:19). దేవుడిపైభయభక్తులతో జీవిస్తే ఆ మేలు తప్పనిసరిగా మనం అనుభవించగలం. నటించేజీవితం కాకుండా యదార్థంగా బతుకుదాం.

**- పి.వాణిపుష్ప**

# తెర

## 'భరతవర్ష' నుంచి 'వీర జయధీర' ఫస్ట్ లుక్ రిలీజ్



టి. గోపీచంద్ ప్రతిష్టాత్మక చారిత్రక యాక్షన్ చిత్రం 'భరతవర్ష' ప్రతి ప్రమోషనల్ కంటెంట్ తో అంచనాలను పెంచుతూనే ఉంది. సంకల్ప్ దర్శకత్వంలో, శ్రీనివాస చిట్టూరి శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రానికి పవన్ కుమార్ సమర్ప కుడిగా వ్యవహారి స్తున్నారు. క్రీ.శ. 642 నేపథ్యంలో సాగే ఈ చిత్రం, విజువల్ గా అద్భుతమైన గ్లింప్స్, టైటిల్ టీజర్‌తో ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించింది. 'వీర జయధీర' కథానాయకుడి ప్రయా ణాన్ని, అతని పరివర్తనను ఆవిష్కరించే పవర్ ఫుల్ పాటగా నిలిచింది. సంగీత దర్శకుడు అనుదీప్ దేవ్ ఈ పాటకు అద్భుత మైన ఆర్కెస్ట్రేషన్‌తో కూడిన సంగీతాన్ని అందించారు. చంద్ర బోస్ రచించిన సాహిత్యం ధైర్యం, ఆత్మ విశ్వాసం, పట్టుదల వంటి విలువలను గొప్పగా చూపించాయి. ఈ పాటలోని విజువల్స్ కూడా ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. మంచుతో కప్పబడిన పర్వతాలు, క్లిష్టమైన భూభాగాల మధ్య ఒంటరి యోధుడిగా గోపీచంద్ చేసే ప్రయాణం అద్భుతంగా కనిపిస్తుంది.ఈ పాత్ర కోసం గోపీచంద్ పూర్తిగా కొత్త అవ తార్‌లో కనిపిస్తు న్నారు. ఓ యోధుడి ఆత్మను తన నటనలో ఆవిష్కరిస్తూ ఆకట్టుకుంటు న్నారు. హీరోయిన్‌గా రీతూ వర్మ నటిస్తుం డగా, ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండనుంది.'వీర జయధీర' పాటతో భరత వర్ష యుద్ధాలు, విజ యాలతో పాటు హీరో వ్యక్తిగత ప్రయా ణం, ఆత్మవికాసం వైపు ప్రేక్షకుల దృష్టిని మళ్లించింది. ఈ పాటను బట్టి చూస్తే, ఈ చిత్రం కేవలం భారీ యాక్షన్, విజువల్ గ్రాండియర్ మాత్రమే కాకుండా ధైర్యం, విధి, ఆత్మ జ్ఞానంతో కూడిన భావో ద్వేగ ప్రయ ాణాన్ని కూడా అందించ బోతోందని స్పష్టమవుతోంది.

## 'విశ్వనాథ్ సన్స్' తొలి గీతం 'నేనో బటర్‌ప్లై'



సూర్య అభిమానులతో పాటు, సినీ ప్రియు లంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫ్యామిలీ ఎంటర్ టైనర్ విశ్వనాథ్ సన్. బ్లాక్‌బస్టర్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'నేనో బటర్‌ప్లై'ను తాజాగా చిత్ర బృందం విడుదల చేసింది.'నేనో బటర్‌ప్లై' తం ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. మధురమైన ట్యూన్‌తో సరికొత్త అనుభూతిని అందిస్తున్న ఈ గీతం, విన్న తక్షణమే ప్రేక్షకుల హృద యాలను దోచుకుంటోంది. ఇటీవల కాలంలో వచ్చిన అత్యుత్తమ గీతాలలో ఒకటిగా నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. సినిమాలో కథానాయకుడు సూర్యను ఉద్దేశించి, నాయిక మమిత బైజు పాడుకునే ఈ 'నేనో బటర్‌ప్లై' వినసొంపుగా ఉంది. యువత మనసు దోచుకునేలా ఎంతో అందంగా జి.వి. ప్రకాష్ ఈ గీతాన్ని స్వరపరిచారు. మెలోడీల విషయానికి వస్తే జి.వి. ప్రకాష్ కుమార్ ఎప్పుడూ నిరాశ పరచరు. మరోసారి ఆయన అద్భుతమైన సంగీతంతో మాయ చేశారు. దర్శకుడు వెంకీ అట్లూరితో ఆయన కాంబినేషన్ వరుసగా ఆకట్టుకుంటుండటంతో, ఈ సినిమా ఆల్బమ్ పై అంచనాలు మరింత పెరిగాయి. 'రఫ్ అయిన నువ్వు.. టఫ్ అయిన నేను.. మిక్స్ అయ్యే కాలం వచ్చిందిలే" అంటూ ప్రేమలోని అమాయకత్వం, ఉత్సాహం, భావోద్వేగాలను అద్భుతంగా ప్రతిబింబించేలా ఉంది పాట.

## 'హ్రీం' మూవీ టీజర్ లాంచ్

పవన్ తాతా, చమింద వర్మ హీరో హీరోయిన్స్‌గా నటి స్తున్న సినిమా 'హ్రీం' ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, రాజీవ్ కనకాల, బెనర్జీ, భద్రమ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీమతి సుజాత మల్లాల సమర్ప ణలో శివమల్లాల నిర్మిస్తున్నారు. హారర్, మిస్టికల్ థ్రిల్లర్ స్టోరీతో దర్శకుడు రాజేష్ రావూరి రూపొంది స్తున్నారు. దిగ్దర్శ కులు ఎస్వీ కృష్ణారెడ్డి, ప్రముఖ నిర్మాత అచ్చిరెడ్డి చేతుల మీదుగా ఈ చిత్ర టీజర్ విడుదల చేశారు. ప్రొడ్యూసర్ అచ్చిరెడ్డి మాట్లాడుతూ హ్రీం మూవీ టీజర్ చాలా బాగుంది. నిర్మాతగా శివ మల్లాల ప్యాషన్ తెలుస్తోంది. డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ హ్రీం అనే మంచి చిత్రాన్ని శివ మల్లాల నిర్మించడం సంతోషంగా ఉంది. జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ చిత్ర నిర్మాణం అంటే భయపడుతుంటాం. కానీ మా శివ మాత్రం ప్రొడక్షన్‌లో నష్టపోడనే ధైర్యం, నమ్మకం నాకు ఉన్నాయి.మ్యూజిక్ డైరెక్టర్ మార్కస్ మాట్లాడుతూ ఈ సినిమాకు ఒక జానర్ అనుకుని ఫిక్స్ అయి ఆ కాన్సెప్ట్ మీద మ్యూజిక్ చేసుకుంటూ వెళ్లాం. డైరెక్టర్ రాజేష్ రావూరి మాట్లాడుతూ నేను



కొత్త డైరెక్టర్ అయినా ఈ సినిమాలో నటించిన చాలా మంది సీనియర్ నటులు నాకు కోపరేట్ చేశారు. బాగా మూవీ చేయమనే ఎంకరేజ్ మెంట్ ఇచ్చారు. నాకు డైరెక్షన్ అవకాశం ఇచ్చిన శివ మల్లాలకి థ్యాంక్స్. యాక్టర్ బెనర్జీ మాట్లాడుతూ శివ నాకు మంచి మిత్రుడు. ఆయన ఈ సినిమా చేస్తున్నాడని తెలిసినప్పుడు నేనూ నటిస్తానని అన్నాను. యాక్టర్ రాజీవ్ కనకాల మాట్లాడుతూ శివ ఈ సినిమాకు ఏ మంత్రం నేర్చుకున్నాడోగానీ తనకు కావాల్సిన ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ అందరినీ మూవీలోకి తీసుకొచ్చాడు. హీరోయిన్ చమిందవర్మ మాట్లా డుతూ హ్రీం చిత్రంతో నన్ను టాలీవుడ్‌కు పరిచయం చేస్తున్న ప్రొడ్యూసర్ శివకి థ్యాంక్స్. హీరో పవన్ తాతా మాట్లాడుతూ శివ ఒక తండ్రిలా నా బాగోగులు చూసుకున్నారు. సినిమా పరంగానే కాదు పర్సనల్‌గా కూడా పవన్‌కు ఇది చేస్తే బాగుంటుంది అని ఆలోచించేవారు. అలాంటి ప్రొడ్యూసర్ దొరకడం నా అదృష్టం.

## 'నాగబంధం': ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్టర్ అభిషేక్ నామా

విరాట్ కర్ణ, అభిషేక్ నామా, నిక్ స్టూడియో, ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ ఖినాగబంధంఖి స్పెల్‌బైండింగ్ ట్రైలర్ లాంచ్ 'నాగబంధం - ది సీక్రెట్ ట్రెజర్ఠ్ చిత్రం తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌తో అంచనాలను మరింత పెంచేసింది.



దర్శకుడు అభిషేక్ నామా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన ఈ ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో విరాట్ కర్ణ హీరోగా నటించారు. శతాబ్దాల నాటి ఓ రహస్యం చుట్టూ కథ సాగుతున్నట్లు ట్రైలర్ ప్రజెంట్ చేసింది. అనంత పద్మనాభ స్వామి ఆలయంలో భద్ర పరచ బడిన పవిత్రమైన బ్రహ్మ కమలం కథలో కీలక అంశంగా కనిపిస్తోంది. కథ ముందుకు సాగే కొద్దీ పురాతన, ఆధ్యాత్మిక రహస్యాలు, మర్మమైన శక్తులు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తాయి. భగవాన్ శివుడి ఆవిర్భావం, నాగ సాధువుల ప్రవేశం కథను మరింత ఉత్కంఠభరితంగా మారుస్తాయి. ఈ ట్రైలర్‌లో ప్రధానంగా ఆకట్టుకునే అంశం దర్శకుడు అభిషేక్ నామా సృష్టించిన అద్భుత ప్రపంచం. కేవలం భక్తి అంశాలకే పరిమితం కాకుండా, ట్రెజర్ హంట్, చరిత్ర, అతీంద్రియ శక్తులు, మిస్టరీ, అడ్వెంచర్ అంశాలను సమన్వయం చేస్తూ కథను మరింత ఆసక్తికరంగా మలిచారు.నిర్మాణ విలు వల పరంగా నాగబంధం అత్యున్నత స్థాయిలో కనిపిస్తోంది. ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ రూపొందించిన దేవాలయాలు, భారీ సెట్లు, ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించే విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. జునైద్ ఖాన్, అబే అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు మరింత బలం చేకూర్చింది. భావోద్వేగం, ఉత్కంఠ, భక్తి భావనలను సమపాళ్లలో మేళవిస్తూ ప్రతి సన్నివేశాన్ని మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దింది. నిక్ స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ బ్యానర్లపై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ తన పాత్రలో అద్భుతంగా కనిపిస్తున్నారు. శారీరకంగా, భావోద్వేగంగా బలమైన పాత్రలో ఆయన ఆకట్టుకున్నారు.

## 'బాలన్ ది బాయ్' మూవీ సక్సెస్ మీట్




గ్రాండియర్ ఫిలిం మేకింగ్‌కు మారుపేరైన కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించిన మూవీ "బాలన్ ది బాయ్". ఈ చిత్రానికి 'ఆవేశం' ఫేమ్ డైరెక్టర్ జితూ మాధవన్ అందించిన స్క్రిప్ట్‌తో "మంజుమ్మెల్ బాయ్స్" చిత్ర దర్శకుడు చిదంబరం దర్శకత్వం వహించారు. వెంకట్ కె నారాయణ, శైలజా దేశాయి ఫెన్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఇటీవలే ఈ సినిమా హిందీతో పాటు మలయాళం, తెలుగు, కన్నడ, తమిళంలో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. చైల్డ్ ఆర్టిస్ట్ ముహమ్మద్ జినాన్ మాట్లాడుతూ "బాలన్ ది బాయ్" సినిమా చూసి మమ్మల్ని ఎంకరేజ్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. యాక్టర్ జీన్ పాల్ లాల్ మాట్లాడుతూ "బాలన్ ది బాయ్" సినిమా మలయాళంలో మంచి విజయాన్ని సాధించింది. తెలుగులోనూ మీరంతా ఆదరిస్తారని ఆశిస్తున్నాం. ఇదొక గొప్ప చిత్రం. చైల్డ్ ఆర్టిస్ట్ ఆదిశేషన్ మాట్లాడుతూ 'బాలన్ ది బాయ్' సినిమాలో కీలక పాత్రలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. యాక్ట్రెస్ ఫర్జాన పాలతింగల్ మాట్లాడుతూ మా మూవీని సపోర్ట్ చేసేందుకు ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మీరు మా సినిమా చూసి, ఇచ్చే ఫీడ్ బ్యాక్ తెలుసుకోవడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. . బాలన్ ది బాయ్ వంటి ఒక సరికొత్త తరహా చిత్రాన్ని మీరు విజయవంతం చేస్తారని నమ్ముతున్నాం. అన్నారు.డైరెక్టర్ చిదంబరం మాట్లాడుతూ తెలుగు ఆడియెన్స్ సినిమాను ఎంజాయ్ చేస్తారు. సెలబ్రేట్ చేస్తారు. వారికి ఏ భాష సినిమా అనేది ఇంపార్టెంట్ కాదు. మంచి కంటెంట్ ఉంటే ఆదరిస్తారు. అలాగే మా మంజుమ్మెల్ బాయ్స్ సినిమాపై మీరు ఎంతో ప్రేమ చూపించారు.

## 'ది ప్యారడైజ్' రాఘవ్ జుయల్ ఫస్ట్ లుక్ రిలీజ్



నేచురల్ స్టార్ నాని పాన్ వరల్డ్ స్పెక్టాకిల్ 'ది ప్యారడైజ్' ఇప్పటికే భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. విడుదలైన ప్రతి అప్డేట్‌తో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతూనే ఉన్నాయి. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన అద్భుతమైన విజన్‌తో ది ప్యారడైజ్ ను ఒక్కో అడుగు విస్తరిస్తూ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతున్నారు. ఈ చిత్రంలో విక్రమ్ మాలిక్ పాత్రలో నటిస్తున్న రాఘవ్ జుయాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పాత్ర కోసం రాఘవ్ పూర్తిగా కొత్త అవతార్‌లో కనిపిస్తూ అందరినీ ఆశ్చర్యపరు స్తున్నారు. ఈ పాత్ర పరిచయాన్ని తనికెళ్ల భరణి వాయిస్ ఓవర్ మరింత ఎలివేట్ చేసింది. తన తెగకు గర్వకారణంగా, స్నేహితులకు ప్రాణస్నేహితుడిగా, శత్రువులకు భయంకరమైన శక్తిగా విక్రమ్ మాలిక్‌ను పరిచయం చేశారు గ్లింప్స్ చివర్లో నాని విక్రమ్ మాలిక్‌ను జడల్ జమాన్హా ప్రపంచంలోకి ఆహ్వానించే సన్నివేశం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ప్రతి అంశాన్ని అద్భుతంగా మలుస్తుండగా, నిర్మాతసుధాకర్ చెరుకూరి ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ తన ఎనర్జిటిక్ స్కోర్‌తో సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నారు.ది ప్యారడైజ్ 2026 ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.



## ఫైనల్లో భారత్ అమ్మాయిలు

**ఆక్లాండ్:** న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్‌లో భారత అమ్మాయిలు అజేయ జైత్రయాత్ర కొనసాగుతోంది. సెమీ ఫైనల్లో బెల్జియం పై 6-0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఫైనల్లోకి దూసుకెళ్లింది. భారతతరఫున నవనీత్ కౌర్, దీపిక చెరో రెండుగోల్స్... నేహా, రుతిజా ఫైసల్ ఒక్కో గోల్ సాధించారు. ఆదివారం జరిగే ఫైనల్లో న్యూజి లాండ్-అమెరికా మ్యాచ్ విజేతతో భారత్ తలపడనుంది.

ప్రపంచ హాకీ ర్యాంకింగ్స్‌లో తొమ్మిదో స్థానంలో ఉన్న భారత విమెన్ జట్టు.. టోర్నీ ఆరంభం నుంచి అద్భుత ఆటతీరు కనబరుస్తోంది. లీగ్ స్టేజ్‌లో అమెరికా, జపాన్, ఉరుగ్వే జట్లపై విజయాలతో గ్రూప్ టాపర్‌గా సెమీస్‌కు వచ్చింది. బెల్జియం తో జరిగిన సెమీఫైనల్లో సలీమా టెటె బృందం ఆద్యంతం ఆధిక్యం ప్రదర్శించింది. మ్యాచ్ ప్రారంభమైన ఆరో నిమిషంలోనే నవనీత్ కౌర్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి బోణీ కొట్టింది. మరో ఏడు నిమిషాలకు రెండో గోల్ సాధించి భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచింది. ఇక దీపిక కూడా నాలుగు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ సాధించిపెట్టింది. 14వ నిమిషంలో ఓ గోల్, 18వ నిమిషంలోమరో గోల్ అందించింది. భారత్ అటాక్ గేమ్‌తో బెల్జియం రక్షణ పంక్తి కకావికలమైంది. హాఫ్ టైమ్ విరామానికి భారత్ 4-0తో ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ భారత విమెన్ హాకీ టీమ్ ఆధిక్యం కొనసాగించింది. 32వ నిమిషంలో లభించిన మరో పెనాల్టీ కార్నర్‌ను నేహా గోల్‌గా మలచగా, మరో నాలుగు నిమిషాలకు రుతజా పిసల్ ఫీల్డ్ గోల్ సాధించి తిరుగులేని ఆధిక్యాన్ని అందించింది. చివరి క్వార్టర్లో బెల్జియం గోల్స్ ప్రయత్నాలకు గోల్‌కీపర్ సవితా పునియా అడ్డుగోడలా నిలిచింది.

## పవర్ పంచ్‌కు ఆరు పతకాలు గ్యారంటీ



**గుయాంగ్ (చైనా):** వరల్డ్ బాక్సింగ్ కప్(స్టేజ్2)లో భారత బాక్సర్లు అదరగొట్టారు. మహిళల 57 కిలోల విభాగంలో ప్రీతీ సంచలనం సృష్టించింది. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత షి యూ ను ఓడించింది. పిడిగుద్దులతో విరుచుకుపడ్డ ప్రీతి 4-1తో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. మెడల్‌ను ఖాయం చేసుకుంది. 51 కిలోల విభాగంలో మీనాక్షి తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్(2025) కజకిస్తాన్ బాక్సర్ అలువ బల్కిబెకోవాపై 5-0తో స్పష్టమైన విజయం సాధించింది. పురుషుల విభాగం 70 కిలోల ఈవెంట్‌లో దీపక్ సంయమనంతో కూడిన ప్రదర్శనతో అజర్‌బైజాన్‌కు చెందిన నబీ ఇస్గందరోవ్‌ను 5-0 ఏకగ్రీవ నిర్ణయంతో ఓడించాడు.అలాగే నిఖిల్ (55 కిలోల విభాగం) కూడా అజర్‌బైజాన్‌కు చెందిన అమిన్ మమ్మద్‌జాదాపై 5-0తో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నారు. ఈ ఫలితాలతో అంతర్జాతీయ వేదికపై భారత బాక్సర్లు తమ బలమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ ఆరు పతకాలను ఖాయం చేసుకున్నారు.

### చెలరేగిన ఓపెనర్లు యశస్వీ, రోహిత్.. 5 వికెట్లు తీసిన ప్రసిద్ధ్ కృష్ణ

# ఆఫ్ఘాన్‌పై వన్డే సిరీస్ క్లీన్‌స్వీప్




**చెన్నై:** క్రికెట్ కూన ఆఫ్ఘనిస్తాన్‌తో మెన్ ఇన్ బ్లూ ఆడేసుకుంది. మూడో వన్డేలోనూ ఏకపక్ష విజయం అందుకుంది. ఏకంగా 9 వికెట్ల తేడాతో నెగ్గి మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.మొదట ప్రసిద్ధ్‌కృష్ణ(5/23) బౌలింగ్‌లో చెలరేగడంతో ఆఫ్ఘనిస్తాన్‌ను 44.2 ఓవర్లలో 218పరుగులకు ఆలౌటైంది. 219 పరుగుల లక్ష్యాన్ని ఆదుతూ పాడుతూ 28.4 ఓవర్లలో కేవలం రోహిత్ శర్మ(69 బంతుల్లో 79) వికెట్ మాత్రమే కోల్పోయి అందుకుంది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్(86 బంతుల్లో 110 నాటౌట్, 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీతో కదం తొక్కాడు.

**తొలి ఓవర్‌లోనే 23 రన్స్**

219 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా తొలి ఓవర్లోనే 23 రన్స్ సాధించింది. ఆఫ్ఘన్ పేసర్ అజ్మతుల్లా ఓమర్జాయ్ భారీగా పరుగులు ఇచ్చాడు. వైడ్లు, నోబాల్స్‌తో పాటు యశస్వీ జైస్వాల్ మూడు ఫోర్లు బాదాడు.దీంతో టీమిండియా పెనాల్టీ రూపంలో లభించిన 5పరుగులతో కలిపి తొలి ఓవర్లో మొత్తం 23 రన్స్ చేసింది. అక్కడి నుండి ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వీ జైస్వాల్.. ఆఫ్ఘాన్ బౌలర్లపై బౌండరీల వర్షం కురిపించారు. వీరి ధాటికి భారత్ స్కోరు 6.4 ఓవర్లలో 50, 13.4 ఓవర్లలో 100, 21.1ఓవర్లలోనే 150 మార్కు దాటింది. ఈ క్రమంలో చెరో అర్ధసెంచరీ సాధించి సెంచరీలు చేసే ఊపులో కనిపించారు. ఈ దశలో రోహిత్‌ను నబీ అవుట్ చేసి 170 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి చెక్ పెట్టాడు. క్రీజ్‌లోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ (20నాటౌట్)తోకలిసి యశస్వీ మిగతా పనిని కంప్లీట్ చేసి మరో 21.2 ఓవర్లుండగానే భారత్‌కు విజయాన్ని సాధించిపెట్టాడు. ఈ క్రమంలో 38బంతుల్లో హాఫ్ సెంచరీ చేసిన యశస్వీ... 83 బంతుల్లో 13ఫోర్లు,2 సిక్స్‌లతో వన్డేల్లో రెండో సెంచరీని పూర్తి చేశాడు.

**నిప్పులు చెరిగిన ప్రసిద్ధ్ కృష్ణ**

అంతకుముందు టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌ను ఆరంభంలోనే ప్రసిద్ధ్ కృష్ణ పడేసిన బంతులతో దెబ్బతీశాడు. మొదట గుర్బాజ్(5)ను, ఆ తర్వాతత జర్దాన్(11), రహత్ షా(5) రసూలీ(1)లను అవుట్ చేశాడు.దీంతో ఆఫ్ఘాన్ 36రన్స్‌కే 4వికెట్లు కోల్పోయింది. ఈ దశలో ఓమర్‌జాయ్(50)తో కలిసి హస్మతుల్లా షాహిది(131 బంతుల్లో 102) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వికెట్ల పతనానికి ఫుల్‌స్టాప్ పెట్టడమే గాక అయిదో వికెట్‌కు శతక భాగస్వామ్యాన్ని అందించి ఆదుకున్నాడు. ఒమర్ జాయ్‌ను ప్రిన్స్ యాదవ్ అవుట్ చేయగా, శుబ్‌మన్ గిల్ రెండు రనౌట్లు చేయడంతో ఆఫ్ఘాన్ 218 పరుగులకే కుప్పకూలింది. వాషింగ్టన్ సుందర్ వేసిన 44వ ఓవర్లో బౌండరీతో తొలి శతకం అందుకున్న షాహిదిని ప్రసిద్ధ్ కృష్ణ అవుట్ చేశాడు. భారత బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లు.. గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే తలో వికెట్ పడగొట్టారు.



## బ్రెజిల్ గెలుపు బోణీ - నాకౌట్‌లో అమెరికా

**ఫిలడెల్ఫియా :** ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ బ్రెజిల్ ఫిఫా ప్రపంచ కప్ 2026లో గెలుపు బోణీ చేసింది. స్టార్ ప్లేయర్ నెయ్‌మర్ గైర్హాజరీలోనూ దూకుడుగా ఆడింది. రెండో మ్యాచ్‌లో 3-0 తేడాతో హైతీని చిత్తు చేసింది. మాథ్యూస్ కున్హా 23వ నిమిషంలో తొలి గోల్ సాధించి బ్రెజిల్‌కు ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత 36వ నిమిషంలో రెండో గోల్ చేశాడు. హైతీ నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు. అప్పుడప్పుడు గోల్ పోస్ట్ వైపు బంతి వెళ్లినా.. గోల్‌ను సాధించలేకపోయింది. వినిసియస్ జూనియర్ (45+3వ నిమిషం) మూడో గోల్‌తో మరింత ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొరాకోతో తొలి మ్యాచ్‌ను డ్రా చేసిన బ్రెజిల్ ఈ మ్యాచ్‌లో గెలుపుతో నాకౌట్ అవకాశాలను మెరుగుపర్చుకుంది.ఈ ఓటమితో హైతీ ప్రపంచ కప్ నుంచి నిష్క్రమించింది. కాగా సొంత అభిమానుల మధ్య అతిథ్య అమెరికా చెలరేగిపోతోంది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచి నాకౌట్‌కు చేరుకుంది. అమెరికా 2-0 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. కామెరూన్ బర్గెస్ (11వ నిమిషం), అలెక్స్ ఫ్రీమన్ (43వ నిమిషం) గోల్స్ చేసి అమెరికాను గెలిపించారు.



## తెలంగాణ టీ20 లీగ్ ధమాకా

**హైదరాబాద్, జూన్ 20(వార్త క్రీడా ప్రతినిధి):** తెలంగాణ టీ20 లీగ్‌కు నేడు తెరలేవనుంది. 20 రోజుల పాటు ఈ టోర్నీ అలరించనుంది. ఐపీఎల్ తరహాలో హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ లీగ్ తొలి సీజన్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతున్నాయి.హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్, రంగారెడ్డి రైజర్స్, మెదక్ ఫాల్కాన్స్,వరంగల్ వారియర్స్, పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్, కరీంనగర్ డైమండ్స్, నల్గొండ నైట్స్ జట్లు టీజీ20 లీగ్‌కు సిద్ధమయ్యాయి. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో మ్యాచ్‌లు జరుగుతాయి.

పాలమూరు స్ట్రయికర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ జట్ల మధ్య మ్యాచ్‌లో టీజీ లీగ్ ఆరంభం కానుంది. మ్యాచ్ రాత్రి 7.15ల నుండి జరుగుతుంది. తొలి రోజు ఒక మ్యాచ్ నిర్వహిస్తారు. రెండో రోజు నుంచి ప్రతి రోజు రెండేసి మ్యాచ్‌లు జరుగుతాయి. మధ్యాహ్నం 2.15 గంటలకు మొదటి మ్యాచ్, రాత్రి 7.15 గంటలకు రెండో మ్యాచ్ జరగనుంది. ఒక్కో జట్టు ప్రతి జట్టుతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. పాయింట్ల పట్టికలో టాప్ ఫోర్‌లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్‌కు చేరుతాయి. ఫైనల్ జూలై 10న జరగనుంది. ఆటగాళ్ల వేలంలో స్టార్ ప్లేయర్లు తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్‌లకు భారీ ధర పలికారు. అంతర్జాతీయ ప్లేయర్లతో పాటు జాతీయ జట్టులోకి దూసుకొచ్చేందుకు తహతహలాడుతున్న యంగ్ ఎమర్జింగ్ ప్లేయర్లు ఈ టోర్నీలో అలరించనున్నారు. యువ క్రికెటర్లు తమ ప్రతిభను చాటేందుకు ఇది చక్కని వేదిక కానుంది.

**అలరించున్న సంగీత విభావరి**

తెలంగాణ టీ20 లీగ్ ఆరంభోత్సవం కలర్‌ఫుల్‌గా నిలిచేలా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సాయంత్రం అయిదున్నర గంటల నుంచి సంగీత విభావరి ఆరంభం కానుంది.సినీ సంగీత దర్శకుడు తమన్ హోరెత్తించనున్నాడు. కల్చరల్ ఈవెంట్స్ అలరించనున్నాయి. అలాగే ఈ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న నటుడు విజయ్ దేవరకొండ నటించిన అఫీషియల్ గీతం ఇప్పటికే హోరెత్తుతోంది. స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్‌లో మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం అవుతాయి.

## దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్‌కు నిరాశ



**దోహా:** గాయంతో చాన్నాళ్ల తర్వాత మళ్లీ జావెలిన్ పట్టిన భారత స్టార్ నీరజ్ చోప్రా... దోహా డైమండ్ లీగ్‌లో నిరాశపరిచాడు. జావెలిన్‌ను అత్యుత్తమంగా 85.69 మీటర్ల దూరం విసిరిన నీరజ్ చోప్రా నాలుగో స్థానంతో సరిపెట్టాడు. ఫౌల్‌తో ఆరంభించిన నీరజ్ చోప్రా.. రెండో ప్రయత్నంలో 82.77 మీటర్ల దూరం విసిరాడు. ఆ తర్వాత వరుసగా 85.69మీటర్లు, 83.45మీటర్లు నమోదు చేశాడు. అయిదో ప్రయత్నంలో ఫౌల్ చేసి నిరాశగా ముగించాడు. 9 నెలల విరామం తర్వాత బరిలోకి దిగిన నీరజ్ పతకాన్ని తృటిలో కోల్పోయాడు. శ్రీలంక సంచలనం రుమేశ్ పతిరగె(88.68మీటర్లు) పసిడి పతకం సాధించాడు. గ్రెనెడాకు చెందిన అండర్సన్ పీటర్స్ (86.38మీటర్లు), అమెరికాకు చెందిన కర్టిస్ థాంప్సన్ (85.99మీటర్లు) రజత, కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. కామన్‌వెల్త్ క్రీడలకు నీరజ్ అర్హత సాధించాడు.




# ఎన్ఎస్ఇ ఐపిఓతో 30వేల కోట్ల సమీకరణ టార్గెట్

**ముంబయి,జూన్ 20:** నేషనల్ స్టాక్‌ఎక్స్ఛేంజి ఐపీఓ కోసం ప్రయత్నిస్తున్నా ఇప్పుడు ఎట్టకేలకు ముందడుగు పడింది. సెబీ దగ్గర ప్రాథమిక ముసాయిదా పత్రాల్ని దాఖలుచేసింది.భారత్‌లోనే అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజి. ఇందులో పెద్ద పెద్ద సంస్థలు, వ్యక్తిగత పెట్టుబడిదారులు ఇన్వెస్ట్ చేశారు. ఎన్ఎస్ఇ ఐపీఓకు రాబోతున్నందున వీరికి కాసుల వర్షం కురవనుంది. సుమారు 6 శాతం వాటాకు సమానమైన సుమారు 14.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుండగా రూ. 30 వేల కోట్ల వరకు నిధుల్ని సమీకరించి భారత దేశంలో అతిపెద్ద ఐపీఓగా నిలిచేందుకు చూస్తోంది. ఇక్కడ కంపెనీ విలువను రూ. 5 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇక ఎన్ఎస్ఇ ఇప్పటివరకు లిస్టింగ్ కాకపోయినా ఇందులో పెద్ద పెద్ద బ్యాంకులు, ఇతర దిగ్గజ సంస్థలు, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు, ఇతర వ్యక్తిగత షేర్ హోల్డర్లు పెద్ద మొత్తంలో గతంలోనే వాటాల్ని కొనుగోలు చేశారు. ఇప్పుడు ఐపీఓకు రాబోతున్న నేపథ్యంలో వీరు పండగ చేసుకోనున్నారు. వందల, వేల కోట్ల లాభాలు ఆర్జించనున్నారు.

అత్యధికంగా ఇక్కడ సంస్థల పరంగా చూస్తే అతిపెద్ద ఎల్ఐసీ, అరందా ఇన్వెస్ట్‌మెంట్స్, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ క్యాపిటల్ మార్కెట్స్, మహాగోనీ లిమిటెడ్, ఎస్బీఐ, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటివి ఉన్నాయి. ఇందులో అంతా షేర్లను విక్రయించట్లేదు. కానీ ఐపీఓతో షేర్లు అన్‌లాక్ అయి నేరుగా సంపద వచ్చి చేరుతుంది. ఎల్ఐసీకి 10 శాతానికిపైగా వాటా అమ్మట్లేదు కానీ రూ.54వేల కోట్లు ఒకవైపు ఎల్ఐసీకి అత్యధికంగా ఎన్ఎస్ఇలె దాదాపు 10.72 శాతం వాటా ఉండగా ఇది ఐపీఓలో షేర్లను విక్రయించట్లేదు. మరోవైపు ఎస్బీఐ క్యాపిటల్ మార్కెట్స్ కూడా దూరంగానే ఉంది. ఎల్ఐసీ తన వాటాతో ఏకంగా రూ. 54,514 కోట్లు ఆర్జించనుంది. ఎస్బీఐ క్యాపిటల్ మార్కెట్స్ విలువ రూ. 22,040 కోట్లుగా ఉంటుందని అంచనా. 2.47 కోట్ల షేర్లను విక్రయిస్తున్న ఎస్బీఐ అయితే ఎస్బీఐ తన 3.23 శాతం వాటాకు సమానమైన 7.98 కోట్ల షేర్లలో 2.47 కోట్ల షేర్లను విక్రయిస్తోంది. ఇక ఎన్ఎస్ఇ అన్‌లిస్టెడ్ షేర్ ప్రైస్ అంచనా రూ. 2200 లెక్కన కాసుల పంట పండుతుందని భావిస్తున్నారు.

ఇదిలా ఉంటే వ్యక్తిగత షేర్ హోల్డర్లలో డీమార్ట్ ఫౌండర్, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారుల్లో ముందు వరుసలో ఉండే బిలియనీర్ వ్యాపారవేత్త రాధాకిషన్ దమానీకి కాసుల పంట పండుతుంది.ఈయన కూడా షేర్లను ఓఎఫ్ఎస్‌లో విక్రయించనప్పటికీ తనకు 1.58శాతం వాటా ఉండగా ఈ విలువ రూ. 8599 కోట్లుగా ఉంటుందని అంచనా. ఈయనకు దాదాపు 4 కోట్ల వరకు ఎన్ఎస్ఈ షేర్లు ఉన్నాయి. వాటా ఉన్న అన్ని కంపెనీలు, వ్యక్తిగత పెట్టుబడిదారులు తమ షేర్లను విక్రయించట్లేదు. అత్యధికంగా ఎస్బీఐ 2.47కోట్ల షేర్లనువిక్రయిస్తోంది.తర్వాత ఎంఎఫ్ స్ట్రాటజిక్ (మారిషస్) లిమిటెడ్ 1.60 కోట్ల షేర్లు, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ 1.18 కోట్ల షేర్లు, అరండా ఇన్వెస్ట్‌మెంట్స్ 1.12 కోట్ల షేర్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా 1.09 కోట్ల షేర్లను ఓఎఫ్ఎస్‌లో అమ్మేస్తుంది. వీటితో పాటు విక్రయదారుల్లో స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, ది న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ వంటివి ఉన్నాయి. ఎన్ఎస్ఇలో అధిక వాటా ఉన్న వ్యక్తిగత పెట్టుబడిదారుల్లో దమానీ టాప్ ప్లేస్‌లో ఉండగా తర్వాత సునీల్ కాంత్ ముంజల్ 0.41 శాతం వాటాతో ఉండగా ఈయనకు రూ. 2245 కోట్లు రానున్నాయి.

ఎస్. గోపాలకృష్ణన్‌కు 0.38 శాతం వాటా ఉండగా అన్ లిస్టెడ్ ప్రైస్ ప్రకారం దీని విలువ 2074కోట్లుగా ఉంది. సిద్ధార్థ్ బాలచంద్రన్‌కు 0.38 శాతం వాటా ఉండగా విలువ 2049 కోట్లు, వనజా సుందర్ అయ్యర్ వాటా 0.18 శాతానికి విలువ రూ.968 కోట్లుగా ఉంటుంది.

## గ్యాస్ కంపెనీలకు మూడు నెలల్లో 22వేల కోట్ల నష్టం



**న్యూఢిల్లీ,జూన్ 20:** పశ్చిమాసియాలో చెలరేగిన సంక్షోభం, భారతదేశ ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ) దిగుమతులను మార్చేసింది.గల్ఫ్ దేశాలపైనే 90శాతం ఆధారపడిన భారత్, సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో అమెరికా, ఇరాన్ సహా ఇతర దేశాల నుంచి దిగుమతులను గణనీయంగా పెంచుకుంది. ఈ వ్యూహాత్మక మార్పు సరఫరా భద్రతకు హామీ ఇచ్చినప్పటికీ, దేశీయంగా వినియోగం తగ్గడంతో పాటు ప్రభుత్వ రంగ చమురు సంస్థలపై భారీ ఆర్థిక భారం పడిందని క్రిసిల్ నివేదిక వెల్లడించింది.క్రిసిల్ అంచనా ప్రకారం మే నెలలో ఒక్కో డొమెస్టిక్ సిలిండర్‌పై ప్రభుత్వ చమురు సంస్థలు రూ. 651 నష్టపోయాయి. ఈ లెక్కన మార్చిమేనెలల మధ్య కాలంలో ఈ సంస్థలు భరించిన మొత్తం నష్టం సుమారు రూ. 22వేల కోట్లుగా ఉంది.సంక్షోభం కారణంగా ఫిబ్రవరిలో కేవలం 8 శాతంగా ఉన్న అమెరికా నుంచి దిగుమతుల వాటా, ఏప్రిల్ నాటికి భారతదేశ మొత్తం ఎల్‌పీజీ దిగుమతుల్లో మూడో వంతుకు (దాదాపు 33శాతం) చేరింది. 2025 చివర్లో భారత్, అమెరికా మధ్య కుదిరిన 2.2 మిలియన్ టన్నుల వార్షిక సరఫరా ఒప్పందం ఇందుకు దోహదపడింది. ఈ ఒప్పందం మన దేశ వార్షిక దిగుమతి అవసరాల్లో 10 శాతాన్ని తీరుస్తుంది. చాలా కాలం తర్వాత ఇరాన్ నుంచి కూడా దిగుమతులు మొదలయ్యాయి. ఏప్రిల్‌లో ఇరాన్ వాటా 6 శాతంగా నమోదైంది. అంతర్జాతీయంగా ధరలు పెరగడంతో దేశీయంగా వినియోగంపై తీవ్ర ప్రభావం పడింది.

### పసిడి మార్కెట్‌పై ఫెడ్ రిజర్వు ఎఫెక్ట్

## నెలరోజుల్లోనే 8శాతం ధరల పతనం



**ముంబయి,జూన్ 20:** అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు భారీ స్థాయిలో పతనమయ్యాయి. ఈ ఏడాది జనవరిలో నమోదైన రికార్డు స్థాయుల నుంచి పసిడిధరలు గణనీయంగా క్షీణించాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠినవైఖరి సంకేతాలు, డాలర్ విలువ బలపడటంతో పసిడిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. 2025లో 65 శాతం మేర భారీ లాభాలను ఆర్జించిన బంగారం, ఈ ఏడాది జనవరిలో ఔన్సుకు సుమారు 5,602 డాలర్ల వద్ద ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిని తాకింది.అప్పటి నుంచి ఇప్పటివరకు పసిడి ధర సుమారు 28 శాతం మేర పతనమైంది. ఆదివారం నాటికి స్పాట్ గోల్డ్ ధర ఔన్సుకు 4,150 నుంచి 4,170 డాలర్ల శ్రేణిలో ట్రేడ్ అయింది. కేవలం నెల రోజుల్లోనే పసిడి ధర 8శాతానికి పైగా తగ్గడం గమనార్హం. ఈ ధరల పతనానికి అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశం నిర్ణయాలు ప్రధాన కారణంగా నిలిచాయి. ఈనెల 17 నుంచి 18 తేదీల్లో జరిగిన సమావేశంలో ఫెడ్ అధికారులు వడ్డీ రేట్లను 3.50 శాతం నుంచి 3.75 శాతం మధ్య స్థిరంగా ఉంచినప్పటికీ, భవిష్యత్తులో కఠిన నిర్ణయాలు తీసుకుంటామనే సంకేతాలను ఇచ్చారు. అమెరికాలో ద్రవ్యోల్బణం 4.2 శాతం వద్ద కొనసాగుతున్నందున, ఈ ఏడాది మరోసారి వడ్డీ రేట్లు పెంచే అవకాశం ఉందని 19మంది అధికారులలో 9మంది అభిప్రాయపడ్డారు. ఫెడ్ నిర్ణయంతో అమెరికా డాలర్ ఇండెక్స్ 100 మార్కును దాటి, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 2.6 శాతం మేర బలపడింది. సాధారణంగా డాలర్ విలువ పెరిగితే, ఇతర కరెన్సీలలో బంగారం కొనుగోలు ఖరీదైన వ్యవహారంగా మారుతుంది.




# సహకార బ్యాంకులపై ఆర్బీఐ జరిమానా

**ముంబయి,జూన్ 20:** కర్ణాటకలోని గోకాక్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్నటువంటి శ్రీ మహాలక్ష్మి అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ బ్యాంక్ లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటన చేసింది. ఈ మేరకు ఈనెల 18న ఒక సర్క్యులర్ విడుదల చేసింది. బ్యాంక్ వద్ద తగినంత మూలధన నిల్వలు లేకపోవడం, ఆర్థిక పరిస్థితి అంతకంతకూ క్షీణించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా బ్యాంకును మూసివేయక తప్పదని తెలిపింది. భవిష్యత్తుల్లో ఆదాయం వస్తుందన్న అంచనాలు కూడా లేవని స్పష్టం చేసింది. వ్యాపార కార్యకలాపాలు పూర్తిగా జూన్ 18 నుంచే మూసివేయాలని కేంద్ర బ్యాంక్ ఆదేశించింది. బ్యాంకును మూసివేసి దివాలా ప్రాసెస్ నిర్వహించేందుకు లిక్విడేటర్‌ను నియమించేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని కర్ణాటక సహకార సంఘాల రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. బ్యాంక్ డిపాజిటర్ల డబ్బులు చెల్లించలేని స్థితిలో దివాలా తీసిన నేపథ్యంలో ఇక్కడ డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ కింద డిపాజిట్లపై బీమా ఉంటుంది. గరిష్ఠంగా రూ. 5 లక్షల వరకు డిపాజిట్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

దీని ద్వారా సుమారు 97.9 శాతం మంది డిపాజిటర్లకు పూర్తి డిపాజిట్ మొత్తం అందుతుందని ఆర్బీఐ తెలిపింది. అర్హత కలిగిన ప్రతి డిపాజిటర్ దీని కింద గరిష్ఠంగా రూ. 5 లక్షల వరకు తమ డబ్బులు పొందేందుకు అర్హులు. ఇదిలా ఉంటే మరికొన్ని కోఆపరేటివ్ బ్యాంకులపై పెనాల్టీ విధించింది.తమ నిబంధనల్ని పాటించని కారణంతో జరిమానా చర్యలతో సరిపెట్టింది. మరోసారి ఇదే రిపీట్ అయితే ఆంక్షలు విధించడం, లైసెన్స్ రద్దు చేయడం చేసే ప్రమాదం పొంచి ఉంటుంది. నాసిక్ రోడ్ దేవ్‌లాలీ వ్యాపారి సహకారి బ్యాంకుకు రూ. 2.10 లక్షల పెనాల్టీ విధించింది. కర్ణాటక చిత్రదుర్గ కేంద్రంగా పనిచేస్తున్న చిత్రదుర్గ డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్‌పై రూ. 1.50 లక్షల ఫైన్ వేసింది. మహారాష్ట్ర హింగన్‌ఘాట్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వార్ధా డిస్ట్రిక్ట్ ఆశీర్వాద్ మహిళా నగరి సహకారి బ్యాంకు, గుజరాత్ మెహ్సానాలోని సర్వోదయా కమర్షియల్ కోఆపరేటివ్ బ్యాంకుకు రూ. 20 వేల చొప్పున, మహారాష్ట్ర నందుర్బర్‌కు చెందిన నవాపూర్ మర్చంటైల్ కో ఆపరేటివ్ బ్యాంకుకు రూ. 10 వేల జరిమానాలు విధించింది.

భారతదేశంలోని అన్ని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు, కోఆపరేటివ్ బ్యాంకులు ఇలా అన్నింటికీ ఆర్బీఐ నియంత్రణ సంస్థ పనిచేస్తోంది. ఆర్బీఐ మార్గదర్శకాలు, నిబంధనలకు లోబడి పని చేయాలి. నిబంధనల్ని ఉల్లంఘిస్తే కస్టమర్ల సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆర్బీఐ చర్యలు తీసుకుంటుంటుంది. చాలా వరకు కోఆపరేటివ్ బ్యాంకులు, ఎన్బీఎఫ్‌సీలు, ఇతర స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులపై చర్యలు ఎక్కువగా తీసుకుంటుంది. ఇటీవలి కాలంలో మరింత దూకుడుగా వ్యవహరిస్తోంది. చాలా సార్లు జరిమానాలతో సరిపెట్టినా కొన్ని సార్లు సమస్య తీవ్రంగా ఉంటే బ్యాంక్ లైసెన్స్ రద్దు చేసే పరిస్థితులు కూడా ఉంటాయి. ఇప్పుడు ఇలాగే కేంద్ర బ్యాంక్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది.

## ఆర్బీఎల్‌లో 60శాతం వాటాతో ఎమిరేట్స్ ఎన్బీడీ




**ముంబయి,జూన్ 20:** ప్రైవేట్ రంగ బ్యాంక్ ఆర్‌బీఎల్ బ్యాంకులో ఏకంగా 60 శాతం వాటాను దక్కించుకుంది దుబాయ్ ఎమిరేట్స్ ఎన్‌బిడి బ్యాంక్. ఇందుకోసం 2.75 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఇది భారత కరెన్సీలో రూ. 26 వేల కోట్ల కంటే ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ఆ మొత్తానికి సమానమైన అంటే రూ. 26,015 కోట్ల విలువైన షేర్లను కేటాయించినట్లు ఆర్‌బీఎల్ బ్యాంక్ ప్రకటించింది. ఇక నుంచి ఆర్‌బీఎల్ బ్యాంక్ ప్రమోటర్‌గా ఎమిరేట్స్ ఎన్బీడియే ఉంటుంది. ఇక్కడ ప్రైవేట్ ప్లేస్మెంట్ పద్ధతిలో ప్రిఫరెన్షియల్ షేర్ల జారీ కింద ఒక్కొక్కటి రూ. 280 చొప్పున దాదాపు రూ. 92.91 కోట్ల మేర షేర్లు కేటాయించేందుకు బోర్డు ఆమోదం తెలిపిందని ఎక్స్ఛేంజీలకు ఆర్‌బీఎల్ బ్యాంక్ పేర్కొంది. భారత స్టాక్ మార్కెట్లు భారీగా పడిపోయినా ఆర్‌బీఎల్ బ్యాంక్ షేరు దాదాపు 3 శాతం పెరిగి రూ. 379.85 వద్ద స్థిరపడింది. మార్కెట్ విలువ సుమారు రూ. 60 వేల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 379.90 కాగా, కనిష్ఠ ధర రూ. 219.61 గా ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఈ స్టాక్ ధర 20 శాతం పెరిగింది. ఇక భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు తాము కట్టుబడి ఉన్నామనేందుకు ఇది నిదర్శనం అని ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ వైస్ ఛైర్మన్ అండ్ ఎండీ అబ్దుల్లా అల్ ఖాసిం వ్యాఖ్యానించారు.

## ఎస్‌బిఐ ఎంఎఫ్ 13వేల కోట్ల ఓఎఫ్ఎస్‌కు సెబీ ఓకే

**ముంబయి,జూన్ 20:**దేశంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ అయిన ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్ తన ప్రతిష్టాత్మక ఐపిఒను ప్రారంభించేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థసెబీనుంచి అనుమతి పొందింది.మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఐపిఒ పరిమాణం సుమారు రూ.13వేల కోట్లు ఉండే అవకాశం ఉంది. వచ్చే నెలలో ఈ పబ్లిక్ ఇష్యూ మార్కెట్లోకి రానున్నట్లు తెలుస్తోంది. మార్చిలో దాఖలు చేసిన డిఆర్‌ఎహెచ్‌పి ప్రకారం, ఈఐపిఒ ఆఫర్‌ఫర్‌సేల్‌గానే ఉంటుంది. మొత్తం 20.37 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ఇందులో ఎలాంటి కొత్తషేర్ల జారీ ఉండదు.ఈ ఐపిఒలో భాగంగా ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్ ప్రమోటర్లైన ఎస్‌బిఐ అముండి ఇండియా హోల్డింగ్ సంస్థలు తమ వాటాల్లో కొంత భాగాన్ని విక్రయించనున్నాయి. ఐపిఒ విజయవంతంగా పూర్తయిన తర్వాత ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్స్ లిమిటెడ్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానుంది. దీంతో ఇప్పటికే లిస్టెడ్‌గా ఉన్న వంటి ప్రముఖ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీల సరసన చేరనుంది. 1987లో ప్రారంభమైన ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్ మ్యూచువల్ ఫండ్ 1987లో స్థాపించారు.అనంతరం 1993లో సెబీలో నమోదైంది.2011లో ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఎఎంయుతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం సంస్థ నిర్వహిస్తున్న పథకాలలో 52 ఈక్విటీ ఫండ్లు, 23 డెట్ ఫండ్లు, 13 హైబ్రిడ్ ఫండ్లు, 4 ఇతర పథకాలు ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.